PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 61 | విజయవాడ, బుధవారం 1 అక్టోబర్ 2025 | 10 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Wednesday 1 October 2025 | Rs

పేద, మధ్యతరగతి వర్గాలకు
సూపర్ గిఫ్ట్ ఇచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం

22 సెప్టెంబర్ 2025 నుండి
అమల్లోకి వచ్చిన
తగ్గించిన GST రేట్లు

రోజువారీ ఉపయోగించే అనేక వస్తువులపై
0% లేదా 5% GST
ఇప్పుడు ప్రధానంగా
2 పన్ను స్లాబ్ లు మాత్రమే

సూపర్ GST
సూపర్
సేవింగ్స్

ప్రతి కుటుంబానికి
₹15,000 వరకు ఆదా!

వ్యాపారులకు
అమ్మకాల పెరుగుదల!

సులభతరమైన
GST స్లాబ్ పద్ధతి

పన్ను తగ్గింపుతో సంక్షేమం...

ప్రజల ఆర్థికాభివృద్ధికి సోపానం...

99% వస్తువులు మరియు సేవలు పన్ను రహితం...
(లేదా) కేవలం 5% లేదా 18% GST మాత్రమే..

	గతంలో	ఇప్పుడు	ఆదా
కిరాణా సామాగ్రి	18/12/5%	NIL/5%	13% వరకు ఆదా
రోజువారీ నిత్యావసరాలు	18/12%	5%	13% వరకు ఆదా
ఆరోగ్యం & జీవిత బీమా	18%	NIL	18% వరకు ఆదా
దుస్తులు & పాదరక్షలు	12%	5%	7% వరకు ఆదా
మందులు	12%	NIL/5%	7-12% వరకు ఆదా
స్టేషనరీ	12/5%	NIL/5%	7% వరకు ఆదా

వీటిపై కూడా GST రేట్ తగ్గింపు

ట్రాక్టర్లు (1800 సీసీ వరకు)	చిన్న కార్లు (1500 సీసీ వరకు)	సైకిళ్లు/స్కూటర్లు (350 సీసీ వరకు)
సేవింగ్స్ దాదాపు ₹ 40,000	సేవింగ్స్ దాదాపు ₹ 70,000	సేవింగ్స్ దాదాపు ₹ 8,000

టెలివిజన్లు	ఎయిర్ కండిషనర్లు
సేవింగ్స్ : దాదాపు ₹ 3,500	సేవింగ్స్ : దాదాపు ₹ 2,800

GST
బెటర్ & సింపుల్!
జీఎస్టీ 2.0
సంస్కరణలతో
ఒక్క నెలలో మీరు ఎంత
ఆదా చేస్తున్నారో
ఈ QR కోడ్ ద్వారా
తెలుసుకోండి.

జారీచేసిన వారు: సంచాలకులు, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

డబుల్ ఇంజిన్ సర్కార్ - ఏపీలో డబుల్ బెనిఫిట్స్ - సూపర్ 6 & జీఎస్టీ 2.0

ముక్కలు.. ముక్కలుగా ప్రయివేటీకరించే కుట్ర

- విశాఖ ఉక్కు ఇఒఐ రద్దు చేయాల్సిందే
- రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం

రౌండ్ టేబుల్ సమావేశం లో మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖపట్నం ఉక్కు పరిశ్రమను కాపాడుకునేందుకు రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపట్టాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. యాజమాన్యం పలు విభాగాలను ప్రైవేటుకు అప్పగించేందుకు జారీచేసిన ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటనను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విజయవాడలోని ఎంబివికెలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన ప్రజా సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి కమిటీ ఛైర్మన్ డి ఆదినారాయణ అధ్యక్షత వహించారు. సమావేశంలో పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు పరిశ్రమను విడివిడిగా ప్రైవేటీకరించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలన్నారు. నారా లోకేష్ మండలిలో ప్రైవేటీకరణ చేసేది లేదని ప్రకటించినా, ఆచరణలో అలా కనిపించడం లేదని అన్నారు. ఈ విషయంలో కేంద్రంపై రాష్ట్రప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలన్నారు. ప్లాంటుకు రూ.లక్షల కోట్ల విలువైన భూములున్నాయని తెలిపారు. ప్రజాభిప్రాయమే అన్నింటికంటే బలమైందని, ఉద్యమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అన్నారు. విశాఖ ఉక్కును కాపాడుకోవడం అందరి బాధ్యతగా పేర్కొన్నారు. ప్రత్యేకంగా వెబ్‌సైట్ ఏర్పాటు చేసి దేశ విదేశాల్లోని అందరి మద్దతును కూడగట్టాలన్నారు.

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు మాట్లాడుతూ.. సరళీకరణ విధానాల్లో భాగంగానే ప్రభుత్వం ప్లాంట్‌ను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టేందుకు సిద్ధమైందన్నారు. రూ.11,400 కోట్ల ప్యాకేజీ.. అప్పుల భారం తీర్చింది ప్రైవేటుపరం చేసేందుకేనన్నారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు మాట్లాడుతూ.. 2021లో కేంద్ర కేబినెట్ నిర్ణయం అనంతరం దక్షిణ కొరియా సంస్థ, టాటా, జిందాల్ పలు ఇతర సంస్థలకు అప్పగించే ప్రయత్నం చేసినా కార్మికుల పోరాటం వల్ల సాధ్యం కాలేదన్నారు. అందుకే ప్రభుత్వం తన పంథాను మార్చి విభాగాల వారీ ప్రైవేటీకరణకు సిద్ధమైందన్నారు. గత ప్రభుత్వాలు కార్మికుల పోరాటానికి మద్దతు ఇచ్చాయని, కూటమి ప్రభుత్వం మాత్రం ఇందుకు వ్యతిరేకంగా పనిచేస్తోందని చెప్పారు. ప్లాంట్‌లో 5 వేల మంది కాంట్రాక్టు కార్మికులను బలవంతంగా తొలగించారని పేర్కొన్నారు. విజయవాడ ధర్నా చౌక్‌లో ధర్నాకు సహకారం కోరారు. ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రావుల రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. ప్లాంటు ప్రైవేటీకరణ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర విరుద్ధమైన ప్రకటనలు చేస్తున్నాయని తెలిపారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్త బస్సుయాత్రతో ప్రజలను ఆందోళనకు సిద్ధం చేస్తామని ప్రకటించారు. ఐఎఫ్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్ మాట్లాడుతూ.. విశాఖ ఉక్కుకు కావాల్సిన గనులను కేంద్రం కేటాయించాలన్నారు. ప్లాంట్ పరిరక్షణకు జరిగే పోరాటాల్లో తాము భాగస్వాములమవుతామని తెలిపారు.

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి మాట్లాడుతూ.. మహిళలు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. విశాఖ ఉక్కును విస్తరిస్తే అనేక మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. పోరాటంలో ఐద్వా ఆధ్వర్యాన మహిళలు పాల్గొంటారని తెలిపారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి రామ్మోహనరావు మాట్లాడుతూ.. అన్ని విశ్వవిద్యాలయాల్లో సదస్సులు నిర్వహించి విద్యార్థి లోకాన్ని కదిలించనున్నట్లు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించాలన్నారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ సంస్థలు ఉంటేనే దళిత, గిరిజన, బలహీన వర్గాలకు రిజర్వేషన్లు అమలవుతాయన్నారు. ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో విశాఖ ఉక్కు పోరాటంపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ ఛైర్మన్ మంత్రి రాజశేఖర్.. విశాఖ ఉక్కు పరిరక్షణకు ఉధృతంగా పోరాడాల్సిన అవసరాన్ని తెలియజేస్తూ.. తీర్మానాన్ని ప్రవేశపెట్టగా రౌండ్ టేబుల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా విశాఖ ఉక్కు పరిరక్షణకు రాష్ట్ర వ్యాప్త పోరాటాలకు త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామని పరిరక్షణ పోరాట కమిటీ పేర్కొంది. ఈ పోరాటాలకు ప్రభుత్వాలు దిగి రాకపోతే రాష్ట్ర బంద్‌కు సిద్ధంగా ఉండాలని కోరింది. ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు కె పోలారి, ఎఐటియుసి రాష్ట్ర నాయకులు సలీం, వెంకటసుబ్బయ్య, నీలం దుర్గారావు, టియుసిఐ నాయకులు ఎం ప్రసాద్ బాబు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక నాయకులు శ్రీనివాస్, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రధాన కార్యదర్శి యు రామస్వామి, కో-కన్వీనర్ జె అయోధ్యరామ్, జెవివి నాయకులు మురళీధర్, ప్రైవేటు టీచర్స్ ఫెడరేషన్ నాయకులు సూర్యారావు తదితరులు ప్రసంగించారు.

రేపు కెవిపిఎస్ జెండా ఆవిష్కరణలు

- రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన అనే పోరాట లక్ష్యాలతో ఏర్పడిన కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈ నెల 2న రాష్ట్ర వ్యాప్తంగా సంఘం జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1998 అక్టోబరు 2న కెవిపిఎస్ ఏర్పడిందని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దళితులపై రాష్ట్రంలో దుర్మార్గమైన కుల వివక్ష, దాడులు జరుగుతున్నాయని, వీటి నివారణకు పాలకులు ప్రయత్నించకపోగా ముద్దాయిలను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి, ఆర్ఎస్ఎస్ ప్రభుత్వ రంగ సంస్థలను తెగనమ్ముతూ.. రిజర్వేషన్లు లేకుండా చేసేందుకు ప్రయత్నం చేస్తుందన్నారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు ఈ అంశాన్ని వ్యతిరేకించడం మాని, మద్దతు ఇస్తున్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ఐక్య ఉద్యమాలు తప్ప మరో మార్గం లేదని చెప్పారు. జెండా ఆవిష్కరణలతోపాటు సేవా కార్యక్రమాలు, డప్పుల పండగ నిర్వహించాలని కోరారు.

కాకినాడ చేరుకున్న మత్స్యకారులు

శ్రీలంక నుంచి కాకినాడకు మత్స్యకారులు

- స్వాగతం పలికిన ఎంపి, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

శ్రీలంక జాఫ్నా జైలులో 52 రోజుల పాటు నిర్బంధంలో ఉన్న కాకినాడకు చెందిన నలుగురు మత్స్యకారులు పంతాడి బ్రహ్మానందం, కర్రి నూకరాజు, చింతా నాగేశ్వరరావు, కొప్పాడ శ్రీను మంగళవారం కాకినాడకు చేరుకున్నారు. ఫిషింగ్ ట్రాలర్ కొనుగోలు నిమిత్తం ఆగస్టులో తమిళనాడు రాష్ట్రం నాగపట్నం వెళ్లారు. బోటు కొనుగోలు చేసి ఆగష్టు 4న తిరిగి వస్తుండగా, నావిగేషన్ లోపం కారణంగా శ్రీలంక జలాల్లోకి ప్రవేశించారు. దీనితో శ్రీలంక నేవీ వారిని అదుపులోకి తీసుకొని జాఫ్నా జైలులో ఉంచిన విషయం తెలిసిందే. శ్రీలంక ఉన్నతస్థాయి అధికారులతో కాకినాడ ఎంపి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు సంప్రదింపులు జరిపి వారిని స్వదేశానికి తీసుకొచ్చేందుకు కృషి చేశారు. కాకినాడలోని కోస్ట్ గార్డ్ కార్యాలయంలో అధికారులు వారిని బంధువులకు అప్పగించారు. కాకినాడ ఎంపి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, అధికారులు మత్స్యకారులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విడుదలైన మత్స్యకారులు మాట్లాడారు. తమ విడుదలకు, బోటుతో సహా తిరిగి వచ్చేలా కృషి చేసిన ప్రభుత్వానికి అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపి ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ మత్స్యకారులను సురక్షితంగా ఇండియాకు తీసుకురావడానికి కృషి చేసిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

ప్రజల్లోకి సంక్షేమ పథకాలు

- పివిఎన్ మాధవ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన ఆవశ్యకత ప్రతిఒక్క బిజెవైఎమ్ కార్యకర్తపై ఉందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ పేర్కొన్నారు. విజయవాడలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఆయన బిజెవైఎమ్ కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి వాటిని పరిష్కరించేందుకు యువనేతలు కృషి చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు.

కడప జిల్లా ఉల్లి రైతులను ఆదుకోవాలి : సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కడప జిల్లాలో ఉల్లి రైతులను ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడుకు ఆయన మంగళవారం లేఖ రాశారు. రాష్ట్రంలో కర్నూలు, కడప జిల్లాల్లో ఉల్లి అధికంగా సాగవుతుందన్నారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది మార్కెట్లో ఉల్లి ధరలు పతనమయ్యాయని పేర్కొన్నారు. విపత్తు సహాయ నిధిలో భాగంగా క్వింటాకు రూ.1,200 మద్దతు ధరతో ఉల్లిని కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, అందుకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని తెలిపారు. కడప జిల్లాలో 15 వేల ఎకరాల్లో ఉల్లిని రైతులు సాగు చేస్తున్నారని వివరించారు. కర్నూలు జిల్లా వరకే కొనుగోళ్లు పరిమితం చేయడంతో కడప జిల్లా రైతులు దిక్కు తోచని స్థితిలో ఆందోళన బాట పట్టారన్నారు. ధరలు లేకపోవడానికి తోడు వర్షాల వల్ల పంట దెబ్బతిందని తెలిపారు. కడప, కర్నూలు జిల్లాల్లో ఒకే రకమైన ఉల్లి సాగు చేస్తారని, కడప జిల్లా ఉల్లి ప్రత్యేకమైందంటూ అధికారులు చెప్పడం సరికాదని పేర్కొన్నారు.

నేడు యథావిధిగా పింఛన్ల పంపిణీ

- ఎపి గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల జెఎసి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అక్టోబరు 1న బుధవారం యథావిధిగా ఇంటి వద్దనే పింఛన్ల పంపిణీ నిర్వహించే కార్యక్రమంలో ఉద్యోగులంతా పాల్గొనాలని ఎపి గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల జెఎసి కోరింది. ఈ మేరకు జెఎసి రాష్ట్ర కన్వీనరు షేక్ అబ్దుల్ రజాక్, ఛైర్మన్ షేక్ మొహమ్మద్ జానీపాషా, రాష్ట్ర సెక్రటరీ జనరల్ విప్పర్తి నిఖిల్ కృష్ణ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న ప్రయత్నం ఇతర సమస్యలకు కారణం కాకూడదని, ఉద్యోగులకు ఎటువంటి కొత్త సమస్యలు ఏర్పడకూడదని ఈ మేరకు విజ్ఞప్తి చేస్తున్నట్లు జెఎసి పేర్కొంది. పింఛన్ పంపిణీ విధులు సక్రమంగా నిర్వహించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించుకుందామని తెలిపింది.

రెండు నెలలే శిక్షణ

- మెయిన్స్‌కు వెళ్లే వారికి మాత్రమే
- అంబేద్కర్ స్టడీ సర్కిళ్లలో శిక్షణ కుదింపు
- ఆవేదనలో నిరుద్యోగులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలోని అంబేద్కర్ స్టడీ సర్కిల్స్ ద్వారా నిరుద్యోగ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఇబిసి యువతకు పోటీ పరీక్షల కోసం ఉచితంగా అందించే శిక్షణ స్థాయిని రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం కుదించేసింది. ఇది నిరుద్యోగులకు తీరని వేదనను మిగులుస్తోంది. గతంలో ప్రతి ఏటా యుపిఎస్‌సి (సివిల్స్)కి, ఇతర పోటీ పరీక్షలన్నింటికీ ఏడాదంతా శిక్షణ ఇచ్చే సంస్థల సేవలను పూర్తిగా మార్చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. మెయిన్స్‌కు వెళ్లే వారికి రెండు నెలల శిక్షణ అంటూ ఉత్తర్వులు జారీచేయడం వేల సంఖ్యలోని పేద, వెనుకబడిన తరగతుల నిరుద్యోగులకు ఆశనిపాతంలా మారింది.

విశాఖలోని అంబేద్కర్ స్టడీ సర్కిల్

విశాఖ రుషికొండలోని అంబేద్కర్ స్టడీసర్కిల్ (యుపిఎస్‌సి) పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తూ 2024 వరకూ నడిచింది. గతంలో ఒకసారి మూతపడినా పోరాటాలతో తిరిగి తెరుచుకుంది. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి, ఇబిసి, మైనారిటీ విద్యార్థుల కోసం ఇది సాగర తీరాన 1989లో జిఒ ఎంఎస్ నంబర్ 113 (ఎస్‌డబ్ల్యు(క్యూ1) ద్వారా ఏర్పాటైంది. దీన్ని గత ఏడాది టిడిపి కూటమి ప్రభుత్వం మూసేసింది. తాజాగా తెరిచినట్టే తెరుస్తూ సెప్టెంబర్ 25న ప్రభుత్వం ఐబిపిఎస్, ఆర్‌ఆర్‌బి (రూరల్ గ్రామీణ బ్యాంక్), ఎస్ఎస్‌సి వంటి పరీక్షలకు కేవలం ప్రిలిమినరీ పాస్ అయి టైర్ -2కి వెళ్తున్న వారికి నవంబర్, డిసెంబర్ రెండు నెలలే శిక్షణ ఇస్తున్నట్లు నోటిఫికేషన్ ఇచ్చింది. అంబేద్కర్ స్టడీ సర్కిల్స్ ద్వారా తిరుపతి, విజయవాడల్లోనూ ఈ శిక్షణ గతంలో జరిగేది. వాటిలోనూ నేడు శిక్షణ స్థాయిని కుదించేశారు. ఈ మేరకు అంబేద్కర్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ పి.వెంకటేష్ ఇటీవల ఒక ప్రకటన విడుదల చేశారు. దీని ప్రకారం గతంలో ఇచ్చినట్టుగా యుపిఎస్‌సి శిక్షణ ఉండదు. రెండు నెలలే.. అదికూడా ఎపిపిఎస్‌సి మెయిన్స్‌కి వెళ్లేవారికి, పిఒలు, క్లర్కులు, ఇదివరకే పాస్ అయి మెయిన్స్‌కి వెళ్లాలనుకునే వారికే అవకాశముంటుంది. శిక్షణ కోసం అభ్యర్థులు ఆన్‌లైన్‌లో గత నెల 24 నుంచి అక్టోబర్ ఆరు వరకూ దరఖాస్తు చేసుకోవచ్చునని ఆ ప్రకటనలో తెలిపారు. ఆయా జిల్లా కేంద్రాల్లో అక్టోబర్ 12న దీనికోసం మరలా ఒక స్క్రీనింగ్ టెస్ట్‌ను సాంఘిక సంక్షేమ శాఖలు పైన తెలిపిన మూడు కేంద్రాల్లో నిర్వహించనున్నాయి.

తాజా నిర్ణయంతో ఎవరికి నష్టం

రాష్ట్రంలో విజయవాడ, తిరుపతి, విశాఖల్లో అంబేద్కర్ స్టడీ సర్కిల్స్ నిర్వహణ ఉన్నా విశాఖలోనే పూర్తి స్థాయిలో గ్రూప్ 1, 2 సహా సివిల్స్ కోచింగ్ 2024 వరకూ నడిచింది. మిగతా రెండు చోట్లా సివిల్స్ కోచింగ్ లేదు. గ్రూప్ 1, ఎస్ఎస్‌సి, ఆర్‌ఆర్‌బి, ఎస్‌బిఐ పరీక్షలకు మాత్రమే శిక్షణ ఇచ్చేవారు. తాజాగా టిడిపి కూటమి ప్రభుత్వం తిరుపతి, విజయవాడ సహా విశాఖలోనూ ఎస్-ఎస్‌సి, బిఎస్‌ఆర్‌బి, గ్రూప్ పరీక్షల టైర్ - 2 శిక్షణకే పరిమితం చేసేసింది. టిడిపి కూటమి సర్కారు తాజా నిర్ణయంతో పేదలు, ఆర్థికంగా వెనుకబడిన తరగతులు గతంలో మాదిరిగా పోటీ పరీక్షల ప్రిలిమినరీకి ఉచిత శిక్షణ పొందలేరు.

గతంలో మంచి ఫలితాలు

విశాఖ, విజయవాడ, తిరుపతి కేంద్రాల్లో 2021 నుంచి 2023 వరకూ ఎక్కువ మంది పోటీ పరీక్షల్లో విజయం సాధించారు. 2021-2022లో విజయవాడ నుంచి 19 మంది, తిరుపతి నుంచి ఒకరు (బ్యాంకింగ్), విశాఖ నుంచి 30 మంది వరకూ వివిధ పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించారు. అయినప్పటికీ ఈ స్టడీ సర్కిల్స్‌పై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది.

శిక్షణ స్థాయి కుదింపు విచారకరం

విశాఖలో దశాబ్ద కాలం పాటు మూతపడిన స్టడీ సర్కిల్ అనేక పోరాటాల తర్వాత 2021లో ప్రారంభించబడింది. 2021 నుంచి 2024 కాలంలో విజయవంతంగా నడిచింది. 2024లో ఏర్పాటైన టిడిపి కూటమి ప్రభుత్వం ఈ స్టడీ సర్కిల్స్‌కు సంబంధించి నోటిఫికేషన్‌ను ఏడాది కాలంపాటు విడుదల చేయలేదు. తాజాగా శిక్షణ స్థాయిని కుదించి, పరిమితులు విధించి నోటిఫికేషన్ ఇచ్చింది. ఏడాదిలో శిక్షణ రెండు నెలలకే వర్తింపు, ఆ శిక్షణ కూడా టైర్ -2కి పరిమితం చేయడం అత్యంత విచారకరం. స్టడీసర్కిల్స్ పట్ల ఇదే వైఖరి 'కూటమి' నుంచి కొనసాగితే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతాం.

కొల్లు ఆనంద్ కుమార్,
ఎపి స్టడీ సర్కిల్స్ స్టూడెంట్స్ ఫోరం అధ్యక్షులు

భూమిక, శిరీష , రితిక (ఫైల్)

ఆటోను ఢీకొన్న లారీ

- ఇద్దరు మహిళలు, చిన్నారి మృతి

ప్రజాశక్తి-పత్తికొండ

కర్నూలు జిల్లా పత్తికొండలో ఆగి ఉన్న ఆటోను లారీ ఢీకొనడంతో ముగ్గురు మహిళలు మరణించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు... తుగ్గలి మండలం ముక్కెళ్ల గ్రామానికి చెందిన భూమిక (35), ఆమె కుమార్తె రితిక (5), శిరీష (35)లు దసరా పండుగ సందర్భంగా పత్తికొండలో సరుకులు కొనుగోలు చేసేందుకు వచ్చారు. పనులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు సాయిబాబా టెంపుల్ వద్ద ఉన్న ఆటోలో ఎక్కారు. అదే సమయానికి ఆదోని నుంచి పత్తికొండలోని సివిల్ సప్లయ్ గొడౌన్‌కు వెళ్తున్న లారీకి బ్రేకుల్ ఫెయిల్ ఇవ్వడంతో సాయిబాబా టెంపుల్ వద్ద ఉన్న ఆటోను ఢీకొన్నది. ఆ ప్రమాదంలో ఆటోలో కూర్చున్న భూమిక, రితిక, శిరీష అక్కడికక్కడే మరణించారు. మరో నలుగురికి గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి గోడ కూలి ముగ్గురు దుర్మరణం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు (కర్నూలు)

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండల పరిధిలోని గుడికల్ గ్రామంలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. సోమవారం అర్ధరాత్రి సమయంలో ఇంటి గోడ కూలి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మరణించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...గుడికల్ గ్రామానికి చెందిన నాగరాజు (47), ఆయన కుమారుడు లక్ష్మీనరసింహ (19), నాగరాజు తమ్ముడు రాజు (40) తమ ఇంటిలో నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో ఒక్కసారిగా వారిపై ఇంటి గోడ కూలింది. ఈ ప్రమాదంలో నాగరాజు, లక్ష్మీనరసింహ అక్కడికక్కడే మరణించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రాజు మరణించారు. తీవ్రగాయాలైన నాగరాజు తల్లి ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతదేహాలను ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి పరిశీలించి, సంతాపం తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చలో విజయవాడ పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న నేతలు

7న చలో విజయవాడ, ధర్నా విజయవంతం చేయండి

- పిఎఫ్ బకాయిలు విడుదల చేయాలి : సాయిశ్రీనివాస్
- ఫ్యాప్టో పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్సీ గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఫ్యాప్టో పోరుబాట కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 7న చలో విజయవాడ, ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో రాష్ట్ర ఛైర్మన్ ఎల్ సాయిశ్రీనివాసరావు కోరారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఫ్యాప్టో పోరుబాటు సన్నాహక సమావేశం జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్ పిఎస్ విజయరామరాజు, సెక్రటరీ జనరల్ జి ప్రకాశం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పోరుబాటు పోస్టర్‌ను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 15 నెలలైనా ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన ఏ ఒక్క ఆర్థిక సమస్యనూ పరిష్కరించలేదన్నారు. పిఆర్‌సి కమిషనర్‌ను నియమించి, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. బకాయి ఉన్న నాలుగు డిఎలను విడుదల చేయాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అక్టోబర్ ఏడున చేపట్టిన చలో విజయవాడ, ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గోపీమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుండి తప్పించి, బోధనకు మాత్రమే పరిమితం చేయాలని కోరారు.

ఉపాధ్యాయులకు యాప్‌ల భారం నుండి విముక్తి కల్పించాలని, సరెండర్ లీవ్, పిఎఫ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫ్యాప్టో కోకన్వీనర్లు శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, డిప్యూటీ సెక్రటరీ రమణ, కోశాధికారి పట్టాభిరామయ్య, ఎస్‌టియు ఉపాధ్యక్షులు దావీదు, రామచంద్రరావు, ఎపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసన్నకుమార్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అబ్రహం పాల్గొన్నారు.

భారత ప్రభుత్వము
రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ
నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా
ప్రాజెక్ట్స్ అమలు యూనిట్ - రాజమహేంద్రవరం

గొల్లప్రోలు టోల్ ప్లాజా (NH-216, కి.మీ.15.000) వద్ద 2025-2026 ఆర్థిక సంవత్సరమునకు
అనగా తేదీ : 01.10.2025 (00:00 గం) నుండి వినియోగదారులు చెల్లించవలసిన రుసుములు యొక్క బహిరంగ ప్రకటన

భారత ప్రభుత్వ గెజిట్ ఎస్.ఒ.నెం. 4125(E) తేదీ : 15.11.2019 న ప్రచురితమైన టోల్ నోటిఫికేషన్‌కు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడ జిల్లా గొల్లప్రోలు గ్రామ సమీపంలో గల టోల్ ప్లాజా వద్ద కత్తిపూడి నుండి కాకినాడ బైపాస్ సెక్షన్ ప్రారంభం వరకు (కి.మీ.0.000 నుండి 27.500) సెక్షన్‌ని ఉపయోగించడం కోసం వినియోగదారు రుసుములు 01.10.2025 (00.00 గం) నుండి జాతీయ రహదారుల సంస్థ అధీకృత అధికారిచే 29.09.2025 నాటి లేఖలో ఆమోదించబడిన ధరల ప్రకారం సవరించిన లింకేజ్ ఫ్యాక్టర్ సవరణ కారణంగా) క్రింద పేర్కొన్న విధంగా వసూలు చేయబడతాయి.

క్రమ సం.	వాహనాల కేటగిరీ	ఒకవైపు ప్రయాణానికి గల రుసుము	ఒకే రోజులో తిరుగు ప్రయాణానికి గల రుసుము	నెలలో 50 సార్లు ఒకవైపు ప్రయాణానికి నెలవారీ పాసుకు గల రుసుము	టోల్ ప్లాజా ఉన్న జిల్లాలో నమోదైన వాణిజ్య వాహనాలకు ఒకవైపు ప్రయాణానికి రుసుము
1	కారు, జీపు, వ్యాన్ లేదా లైట్ మోటార్ వాహనము	50	75	1690	25
2	లైట్ కమర్షియల్ వాహనము, లైట్ గూడ్స్ వాహనము లేదా మినీ బస్	80	125	2730	40
3	బస్ లేదా ట్రక్ (రెండు యాక్సిల్స్)	170	260	5725	85
4	మూడు - యాక్సిల్స్ వాణిజ్య వాహనము	185	280	6245	95
5	భారీ నిర్మాణ యంత్రాలు (HCM) లేదా ఎర్త్ మూవింగ్ ఎక్విప్‌మెంట్ (EME) లేదా మల్టీ యాక్సిల్ వెహికల్ (MAV) (నాలుగు నుండి ఆరు ఎక్సిల్లు)	270	405	8975	135
6	ఓవర్ సైజ్ గల వాహనాలు (7 లేదా అంత కుమించి యాక్సిల్స్)	330	490	10925	165

సీతారామపురం టోల్ ప్లాజా (NH-216, కి.మీ.12.180) వద్ద 2025-2026 ఆర్థిక సంవత్సరమునకు
అనగా తేదీ : 01.10.2025 (00:00 గం) నుండి వినియోగదారులు చెల్లించవలసిన రుసుములు యొక్క బహిరంగ ప్రకటన

భారత ప్రభుత్వ గెజిట్ ఎస్.ఒ.నెం. 3106(E) తేదీ : 11.09.2020 న ప్రచురితమైన టోల్ నోటిఫికేషన్‌కు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లా సీతారామపురం గ్రామ సమీపంలో గల టోల్ ప్లాజా వద్ద దిండి - దిగమర్రు సెక్షన్ ప్రారంభం వరకు కి.మీ. 126/510 నుండి కి.మీ. 135/740 సెక్షన్‌ని ఉపయోగించడం కోసం వినియోగదారు రుసుములు 01.10.2025 (00.00 గం) నుండి జాతీయ రహదారుల సంస్థ అధీకృత అధికారిచే 29.09.2025 నాటి లేఖలో ఆమోదించబడిన ధరల ప్రకారం సవరించిన లింకేజ్ ఫ్యాక్టర్ సవరణ కారణంగా) క్రింద పేర్కొన్న విధంగా వసూలు చేయబడతాయి.

క్రమ సం.	వాహనాల కేటగిరీ	ఒకవైపు ప్రయాణానికి గల రుసుము	ఒకే రోజులో తిరుగు ప్రయాణానికి గల రుసుము	నెలలో 50 సార్లు ఒకవైపు ప్రయాణానికి నెలవారీ పాసుకు గల రుసుము	టోల్ ప్లాజా ఉన్న జిల్లాలో నమోదైన వాణిజ్య వాహనాలకు ఒకవైపు ప్రయాణానికి రుసుము
1	కారు, జీపు, వ్యాన్ లేదా లైట్ మోటార్ వాహనము	40	60	1320	20
2	లైట్ కమర్షియల్ వాహనము, లైట్ గూడ్స్ వాహనము లేదా మినీ బస్	65	95	2130	30
3	బస్ లేదా ట్రక్ (రెండు యాక్సిల్స్)	135	200	4465	65
4	మూడు - యాక్సిల్స్ వాణిజ్య వాహనము	145	220	4870	75
5	భారీ నిర్మాణ యంత్రాలు (HCM) లేదా ఎర్త్ మూవింగ్ ఎక్విప్‌మెంట్ (EME) లేదా మల్టీ యాక్సిల్ వెహికల్ (MAV) (నాలుగు నుండి ఆరు ఎక్సిల్లు)	210	315	7000	105
6	ఓవర్ సైజ్ గల వాహనాలు (7 లేదా అంత కుమించి యాక్సిల్స్)	255	385	8525	130

అన్నంపల్లి టోల్ ప్లాజా (NH-216, కి.మీ.78.000) వద్ద 2025-2026 ఆర్థిక సంవత్సరమునకు
అనగా తేదీ : 01.10.2025 (00:00 గం) నుండి వినియోగదారులు చెల్లించవలసిన రుసుములు యొక్క బహిరంగ ప్రకటన

భారత ప్రభుత్వ గెజిట్ ఎస్.ఒ.నెం. 3120(E) తేది : 07.07.2022 న ప్రచురితమైన టోల్ నోటిఫికేషన్‌కు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అన్నంపల్లి గ్రామ సమీపంలో గల టోల్ ప్లాజా వద్ద గురజానపల్లి గ్రామం - పాశర్లపూడి గ్రామం వరకు కి.మీ.45.000 నుండి 106.000 వరకు సెక్షన్‌ని ఉపయోగించడం కోసం వినియోగదారు రుసుములు 01.10.2025 (00.00 గం) నుండి జాతీయ రహదారుల సంస్థ అధీకృత అధికారిచే 29.09.2025 నాటి లేఖలో ఆమోదించబడిన ధరల ప్రకారం సవరించిన లింకేజ్ ఫ్యాక్టర్ సవరణ కారణంగా) క్రింద పేర్కొన్న విధంగా వసూలు చేయబడతాయి.

క్రమ సం.	వాహనాల కేటగిరీ	ఒకవైపు ప్రయాణానికి గల రుసుము	ఒకే రోజులో తిరుగు ప్రయాణానికి గల రుసుము	నెలలో 50 సార్లు ఒకవైపు ప్రయాణానికి నెలవారీ పాసుకు గల రుసుము	టోల్ ప్లాజా ఉన్న జిల్లాలో నమోదైన వాణిజ్య వాహనాలకు ఒకవైపు ప్రయాణానికి రుసుము
1	కారు, జీపు, వ్యాన్ లేదా లైట్ మోటార్ వాహనము	60	90	2020	30
2	లైట్ కమర్షియల్ వాహనము, లైట్ గూడ్స్ వాహనము లేదా మినీ బస్	100	145	3265	50
3	బస్ లేదా ట్రక్ (రెండు యాక్సిల్స్)	205	310	6840	105
4	మూడు - యాక్సిల్స్ వాణిజ్య వాహనము	225	335	7460	110
5	భారీ నిర్మాణ యంత్రాలు (HCM) లేదా ఎర్త్ మూవింగ్ ఎక్విప్‌మెంట్ (EME) లేదా మల్టీ యాక్సిల్ వెహికల్ (MAV) (నాలుగు నుండి ఆరు ఎక్సిల్లు)	320	485	10725	160
6	ఓవర్ సైజ్ గల వాహనాలు (7 లేదా అంత కుమించి యాక్సిల్స్)	390	585	13055	195

1. పై టోల్ ప్లాజా వద్ద దిగువ పేర్కొన్న రాయితీలు లభించును.
   (i) ఫాస్ట్ ట్యాగ్ ద్వారా మాత్రమే అన్ని కేటగిరి వాహనాలకు చెల్లింపు సమయం నుండి 24 గం. లలోపు తిరుగు ప్రయాణం (25 శాతం తగ్గింపు)
   (ii) ఫాస్ట్ ట్యాగ్ ద్వారా మాత్రమే అన్ని కేటగిరి వాహనాలకు చెల్లింపు తేదీ నుండి ఒక సారి ప్రయాణాలకు నెలలో 50 (33 శాతం తగ్గింపు)
   (iii) ఫాస్ట్ ట్యాగ్ ద్వారా మాత్రమే టోల్ ప్లాజా నుండి 20 కి.మీ. పరిధిలో ఉన్న వ్యాపారేతర వాహనాలకు కేలండర్ నెల ప్రకారం రూ. 340/- పాసు
   (iv) ఫాస్ట్ ట్యాగ్ ద్వారా మాత్రమే టోల్ ప్లాజా యొక్క జిల్లాలో రిజిష్టరు అయిన వ్యాపార వాహనాలు (జాతీయ పర్మిట్‌తో నడిచే వాహనాలు తప్ప) (50 శాతం తగ్గింపు)
   (v) వాణిజ్యేతర వాహనాలు (కార్లు/వ్యాన్లు/జీప్) రూ. 3,000/- కు వార్షిక పాస్ పొందవచ్చు, ఇది 1 సంవత్సరం లేదా 200 ట్రిప్పులకు చెల్లుతుంది.
2. జిఎస్ఆర్ 950 (ఇ) ద్వారా ఫీజు నిబంధనలు తేది. 03-12-2010కు గల సవరణలో ఇవ్వబడిన విధముగా మినహాయింపబడిన వాహనాల జాబితా ఇవ్వడమైనది.
3. అనుమతించిన లోడ్ మించి చేసిన వాహనం జిఎస్ఆర్ నెం 920 (ఇ) 25-09-2018 ప్రకారం జారీ చేయబడిన ఎన్‌హెచ్ ఫీజ్ రూల్స్ 2008నకు సవరించినదాని ప్రకారం ఫీజు రేటు వర్తించును మరియు హైవే వినియోగించుటకు అధిక లోడు తొలగించబడును.
4. ఏదేని విచారణ మరియు / లేదా ఫిర్యాదు / సలహాలు ఇచ్చుటకు దయచేసి సంప్రదించండి.

ప్రాజెక్ట్ డైరెక్టర్
భారత జాతీయ రహదారుల సంస్థ, ప్రాజెక్ట్స్ ఇంప్లిమెంటేషన్ యూనిట్ - రాజమహేంద్రవరం
టయోటా షోరూమ్ ప్రక్కనే, NH-216A, దివాన్ చెరువు రాజమహేంద్రవరం, ఆంధ్రప్రదేశ్ 533102

.... రోడ్లు మాత్రమే కాదు, దేశాన్ని నిర్మిస్తుంది ....

PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 45 సంచిక : 61 | విజయవాడ, బుధవారం 1 అక్టోబర్ 2025 | 10 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Wednesday 1 October 2025 | Rs

ముక్కలు.. ముక్కలుగా ప్రయివేటీకరించే కుట్ర

- విశాఖ ఉక్కు ఇఒఐ రద్దు చేయాల్సిందే
- రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం

2

దీప్తి ఆల్‌రౌండ్ ప్రదర్శన

శ్రీలంకపై 59 పరుగుల తేడాతో టీమిండియా గెలుపు

ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్

10

సామ్రాజ్యవాద పునరుద్ధరణకే...

అమెరికాతో బంధం ప్రమాదకరం : వివిఎస్ఆర్

టారిఫ్‌లపై చంద్రబాబు, జగన్ నోరెత్తడం లేదు

ట్రంప్ సుంకాల యుద్ధంపై బివి రాఘవులు



సభలో మాట్లాడుతున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమెరికాలో దెబ్బతిన్న పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదాన్ని పునరుద్ధరించుకునేందుకే ట్రంప్ సుంకాల పేరుతో ప్రపంచ యుద్ధం చేస్తున్నారని, ఉగ్రవాద యుద్ధంగా ఇది కొనసాగుతోందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు విమర్శించారు. 'ట్రంప్ ఉగ్రవాద నిర్ణయాలు - మోడీ మౌనం' అనే అంశంపై సిపిఎం విజయవాడ నగర కమిటీ ఆధ్వర్యాన బాలోత్సవ్ భవన్‌లో మంగళవారం సాయంత్రం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ మన దేశ విదేశాంగ విధానాన్ని కూడా ట్రంప్ పరోక్షంగా దెబ్బతీస్తున్నారని చెప్పారు. ప్రపంచంలో భిన్నత్వం కలిగిన సుంకాలు ఉంటేనే సమానత్వం ఉంటుందని, లేనిపక్షంలో సామ్రాజ్యవాదులు దోచుకుంటారని తెలిపారు. దోపిడీని కొనసాగించాలంటే ప్రపంచ వ్యాపారాన్ని దెబ్బతీయాలనే కుట్ర సుంకాల విధింపులో ఉందని చెప్పారు. సాంకేతికంగా చాలా దేశాలు అమెరికాను మించిపోయాయని అన్నారు. దీంతో సామ్రాజ్యవాదం మూడో ప్రపంచ దేశాలపై ఒత్తిడి తెచ్చి లొంగదీసుకోవాలనే ప్రయత్నాలు చేస్తోందని అన్నారు. అమెరికాలో కార్మికుల ఆగ్రహాన్ని ఇతర దేశాలపై మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ట్రంప్ టారిఫ్‌లతో సామ్రాజ్యవాదం గురించి ప్రతిగ్రామంలోనూ మాట్లాడుతున్నారని, ఈ సమయంలోనే దాని ప్రమాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. అన్ని పేపర్లలోనూ ట్రంప్ గురించి చర్చ జరుగుతోందని వివరించారు. ఈ సమయంలోనే మన దేశ విదేశాంగ విధానంలో ఉన్న డొల్లతనం బయటపడుతోందని, ఈ సమయంలో ఒత్తిడి చేస్తే వెనక్కు తగ్గుతారని అన్నారు. అందువల్లే దేశవ్యాప్తంగా విస్తృత ప్రచారం చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ నిర్ణయించిందని అన్నారు. మన దేశం వ్యవసాయ ఉత్పత్తులను ముఖ్యంగా పత్తిని జీరో ట్యాక్స్‌తో దిగుమతి చేసుకునేందుకు అనుమతి ఇచ్చిందని, మొక్కజొన్న, డెయిరీ ఉత్పత్తులను కూడా దిగుమతికి అనుమతిస్తే ఆయా రంగంలో ఉన్నవారు దెబ్బతింటారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్వహిస్తున్న సుంకాల యుద్ధంపై దేశవ్యాప్తంగా ప్రజలను చైతన్యం చేయాలని, వాస్తవాలను ప్రజలకు చెప్పాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రచార కార్యక్రమానికి 'ట్రంప్, టారిఫ్, టెర్రరిజం' అని సిపిఎం పేరు పెట్టిందని చెప్పారు . డాలర్ పెత్తనం తగ్గితే అమెరికా సామ్రాజ్యవాదం తగ్గుతుందని వివరించారు. అందుకే డాలర్‌ను కాపాడుకునేందుకు ట్రంప్ విశ్వప్రయత్నాలు చేస్తున్నారని చెప్పారు. అమెరికాలో ప్రజల మధ్య వ్యత్యాసాలు పెరగడంతో ఆసియన్లపై తప్పుడు ప్రచారం చేశారని చెప్పారు. పెట్టుబడిదారీ సమాజం అమెరికాపై తెస్తున్న ఒత్తిడిని తట్టుకునేందుకు ట్రంప్ సుంకాల మిగతా 6లో

మాట్లాడుతున్న చంద్రబాబు

హాజరైన పారిశ్రామికవేత్తలు

విశాఖ సదస్సుకు రండి

రాష్ట్రాన్ని చూసిన తరువాతే పెట్టుబడులు పెట్టండి

సిఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ కర్టన్‌రైజర్‌లో పారిశ్రామిక వేత్తలకు బాబు ఆహ్వానం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విశాఖపట్నంలో నవంబర్ 14, 15 తేదీల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే భాగస్వామ్య సదస్సుకు హాజరు కావాలని పారిశ్రామికవేత్తలను, వివిధ దేశాల రాయబారులను సిఎం చంద్రబాబు ఆహ్వానించారు. మంగళవారం ఢిల్లీలో జరిగిన సిఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ కర్టన్‌రైజర్ కార్యక్రమానికి కేంద్ర మంత్రి పియూష్ గోయల్‌తో కలిసి చంద్రబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదస్సును విజయవంతం చేయడానికి విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. సదస్సుకు హాజరు కావడంతో పాటు, రాష్ట్రంలో విస్తృతంగా పర్యటించాలని ఆయన పారిశ్రామిక వేత్తలను కోరారు. 'ముందు రాష్ట్రమంతా చూడండి. పెట్టుబడులు పెట్టడానికి మా రాష్ట్రమే ఎందుకు అత్యుత్తమమో పరిశీలించండి. ఆ తరువాతే పెట్టుబడులు పెట్టండి' అని బాబు అన్నారు. ప్రధాని మోడీ వికసిత్ భారత్ 2047 రూపొందిస్తే.. మేం స్వర్ణాంధ్ర 2047 విజన్ రూపకల్పన చేశాం. ఆంధ్రప్రదేశ్‌ను 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దటమే మా లక్ష్యం. దీనికోసం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ స్థానంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. లాజిస్టిక్స్, డీప్ టెక్నాలజీ, ప్రొడక్ట్ పర్ఫెక్షన్ లాంటి కీలకమైన లక్ష్యాలను పెట్టుకున్నట్లు, స్పేస్, ఎలక్ట్రానిక్స్, డ్రోన్స్, ఏరోస్పేస్ సిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

జనవరికి క్వాంటమ్ కంప్యూటర్

'2026 జనవరి నాటికి రాష్ట్ర రాజధాని అమరావతిలో క్వాంటమ్ కంప్యూటర్ పనిచేయటం ప్రారంభిస్తుందని చంద్రబాబు చెప్పారు. ఆ తదుపరి రెండేళ్లలో క్వాంటం కంప్యూటర్ పరికరాలను కూడా ఉత్పత్తి చేసే దశకు చేరుకుంటామన్నారు. పునరుత్పాదక విద్యుత్ రంగంలో 500 గిగావాట్లను దేశంలో ఉత్పత్తి చేయాలని నిర్దేశిస్తే... అందులో ఏపిలోనే 160 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం పెట్టుకున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటికే సోలార్, పంప్డ్ ఎనర్జీ, పవన విద్యుత్, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేసేలా ప్రాజెక్టులు చేపట్టినట్లు తెలిపారు. విశాలంగా ఉన్న తీర ప్రాంతంలో ప్రపంచ ప్రమాణాలతో పోర్టులు, పారిశ్రామిక, లాజిస్టిక్స్ కారిడార్ల నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు. 'అడ్వాన్స్‌డ్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ప్రోత్సహిస్తాం, రైతులకు లబ్ధి కలిగేలా బిగ్ టెక్ కంపెనీలకు రాష్ట్రం కీలక స్థానంగా మారుతుంది. సహజ పర్యాటక ప్రాంతాలు రాష్ట్రానికి ఉన్న అతిపెద్ద వనరు, విద్య, వైద్య రంగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయి. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోంది. అమెరికా తర్వాత ఇదే రెండో అతిపెద్ద కేంద్రం అవుతుంది. మాన్యుఫ్యాక్చరింగ్ పరిశ్రమలు పెద్ద ఎత్తున తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.' అని బాబు వివరించారు. 'రాష్ట్ర రాజధాని అమరావతి నగరాన్ని గ్రీన్ సిటీగా నిర్మాణం చేస్తున్నాం. అమరావతి సమీపంలో ప్రస్తుతం రోజుకు ఏడు లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. కృష్ణా - గోదావరి నదులను అనుసంధానించాం. ఈ ఏడాది ఈ రెండు నదుల నుంచి ఐదు వేల టిఎంసిల నీరు సముద్రంలో కలిసింది.' అని చెప్పారు. సుస్థిరమైన ప్రభుత్వాలు.. సుస్థిరమైన విధానాలు దేశంలో, రాష్ట్రంలో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, సిఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ సహా వివిధ దేశాల రాయబారులు, పారిశ్రామిక వేత్తలు హాజరయ్యారు.

మరింత సహకారం అందించండి 8లో

- కేంద్ర మంత్రులతో సిఎం భేటీ

ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద వరద నీటి ప్రవాహం

గోదావరి ఉగ్రరూపం

- భద్రాచలం వద్ద 2వ ప్రమాద హెచ్చరిక
- విలీన మండలాల్లో గ్రామాల చుట్టూ చేరిన వరద
- నిలిచిన రాకపోకలు

ప్రజాశక్తి - యంత్రాంగం

గోదావరి మళ్లీ ఉగ్రరూపం దాల్చింది. భద్రాచలం వద్ద వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. ప్రస్తుతం 51.10 అడుగుల నీటి మట్టానికి చేరుకుంది. ఇక్కడ రెండో ప్రమాద హెచ్చరిక అమలులో ఉంది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద గంటగంటకూ నీటి మట్టం పెరుగుతోంది. ప్రస్తుతం 12.40 అడుగుల నీటి మట్టం నమోదైంది. ఇక్కడ మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతుంది. బ్యారేజీకి చెందిన 175 గేట్లను ఎత్తి 10,65,562 క్యూసెక్కుల నీటికి సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. విలీన మండలాలైన విఆర్.పురం మండలంలోని శ్రీరామగిరి, వడ్డిగూడెం, రామవరం, చింతరేగుపల్లి సహా పలు గ్రామాల చుట్టూ వరద నీరు చేరింది. శ్రీరామగిరి వాసులు ఎత్తైన గుట్టలపైకి వెళ్లిపోయారు. జల దిగ్బంధనంలో చిక్కుకున్న ప్రజలంతా భయాందోళన చెందుతున్నారు. వందలాది ఎకరాలలో పంటలు నీటమునిగాయి. ఎటపాక మండలంలోని నెల్లిపాక - వీరాయిగూడెం, కన్నాయిగూడెం - గట్టుగూడెం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మురుమూరు, నందిగామ, చలంపాలెం, బండారుగూడెం, మిగతా 6లో

బంగాళాఖాతంలో నేడు మరో అల్పపీడనం

- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని, మరో ఉపరితల ఆవర్తనంతో బుధవారం బంగాళాఖాతం మధ్య ప్రాంతాల్లో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ఈ మేరకు ఆ సంస్థ ఎమ్‌డి ప్రఖర్‌జైన్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అల్పపీడనం అక్టోబరు 2 నాటికి వాయువ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశముం దన్నారు. అనంతరం పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ శుక్రవారం ఉదయానికి దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర తీరాలను దాటే అవకాశం ఉందని పేర్కొన్నారు. శనివారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించారు. అల్పపీడనం ప్రభావంతో రానున్న ఒకట్రెండు రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. బుధవారం నాడు శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో పలుచోట్ల తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. తీరం వెంబడి గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు.

అడవి బిడ్డలపై పెరిగిన దాడులు

- మహిళలు, చిన్నారులపై పెచ్చరిల్లిన అఘాయిత్యాలు
- భారీగా సైబర్ నేరాలు
- ఎన్‌సిఆర్‌బి - 2023 నివేదిక

న్యూఢిల్లీ : దేశంలో ఆదివాసీ తెగలను, అభంశుభం తెలియని చిన్నారులను, మహిళలను లక్ష్యంగా చేసుకొని దాడులు పెరిగిపోతున్నాయి. ఆర్థిక నేరాలకు తెగిస్తున్న సైబర్ మూకల దాడులు కూడా హెచ్చరిల్లుతున్నాయి. గత గణాంకాలతో పోలిస్తే ఈ తరహా దాడులు క్రమేపి పెరుగుతూనేవుండటం ఆందోళనకరం. 2023 సంవత్సరానికి సంబంధించి నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) విడుదల చేసిన నివేదిక ఈ విషయాన్ని మరోసారి స్పష్టం చేసింది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే 2023లో షెడ్యూలు తెగలు (ఎస్‌టిలు) పై దాడులు ఏకంగా 28.8 శాతం పెరిగాయి. 2022లో ఎస్‌టిలపై నేరాలకు సంబంధించి 10,064 కేసులు నమోదు కాగా, 2023లో ఈ కేసుల సంఖ్య 12,960కు పెరిగింది. అలాగే, ఈ కేటగిరిలో మొత్తం నేరాల రేటు కూడా 2022తో పోలిస్తే 9.6 శాతం పెరిగింది. అంటే 28.8శాతం పెరిగాయి. అలాగే 2023లో సైబర్ క్రైమ్‌లు కూడా 2022తో పోలిస్తే 31.2 శాతం పెరిగాయి. 2022లో 65,893 సైబర్ క్రైమ్ కేసులు నమోదు కాగా, 2023లో 86,420 కేసులు నమోదయ్యాయి. అంటే 31.2శాతం పెరిగాయి. 2023లో నమోదైన సైబర్ నేరాల్లో ఎక్కువగా అంటే 59,526 కేసులు (68.9 శాతం) పౌరులను మోసం చేయడమే లక్ష్యంగా జరిగాయి. తరువాత స్థానంలో లైంగిక వేధింపుల కేసులు వున్నాయి. అవి 4.9 శాతం (4,199)గా వుండగా దోపిడీ కేసులు గా, 3.8 శాతం (3,326)గా నమోదయ్యాయి.

మహిళలపై నేరాలు కూడా అంతకుముందు ఏడాదితో పోలిస్తే 2023లో పెరిగాయి. 2022లో మహిళలపై నేరాలకు సంబంధించి 4.45 లక్షల కేసులు నమోదు కాగా, 2023లో ఈ కేసుల సంఖ్య 4,48,211కు చేరుకుంది. వీటిల్లో ప్రధానంగా 29.8 శాతం అంటే 1,33,676 కేసులు భర్త లేదా బంధువుల క్రూరత్వానికి సంబంధించినవి కాగా, మరో 19.8 శాతం (88,605) కేసులు మహిళల కిడ్నాప్ కేసులుగా వున్నాయి. అలాగే 18.71 శాతం కేసులు(83,891) మహిళల గౌరవాన్ని దెబ్బతీసే ఉద్దేశ్యంతో జరిగిన దాడులు కాగా, మిగిలిన 14.8 శాతం (66,232) పోక్సో చట్టం కింద నమోదైన కేసులు.

తగ్గిన హత్య కేసులు

2022తో పోలిస్తే 2023లో హత్య కేసుల్లో స్వల్పంగా 2.8 శాతం తగ్గుదల కనిపించింది. 2022లో దేశంలో 28,522 హత్య కేసులు నమోదు కాగా, 2023లో 27,721 కేసులు నమోదయ్యాయి. వీటిలో వివాదాలకు సంబంధించిన కేసులు అత్యధికంగా 9,209 ఉన్నాయి. తరువాత స్థానంలో ప్రతీకారం లేదా శత్రుత్వంతో హతమార్చిన కేసులు 3,458 గా ఉన్నాయి.

2023లో దేశవ్యాప్తంగా 62,41,569 కేసులు నమోదు కాగా, వీటిలో 37,63,102 కేసులు ఇండియన్ పీనల్ కోడ్ కింద మిగిలిన 24,78,467 కేసులు ప్రత్యేక, స్థానిక చట్టాల కింద నమోదయ్యాయి. 2022తో పోలిస్తే 2023లో కేసుల నమోదులో 7.2 శాతం (4,16,623) పెరుగుదల కనిపించింది. అలాగే, ప్రతీ లక్ష జనాభాకు నమోదైన నేరాల రేటును పరిశీలిస్తే అది కూడా పెరిగింది. 2022లో ప్రతీ లక్ష జనాభాకు 422.2 కేసులు నమోదు కాగా, 2023లో ఇది 448.3కు పెరిగింది.

తమిళనాట మరో విషాదం

- ఎన్నూర్ థర్మల్ పవర్ ప్లాంట్‌లో కూలిన శ్లాబు
- 9 మంది మృతి - మరో 15 మందికి గాయాలు
- మృతులందరూ వలస కార్మికులే

చెన్నై : తమిళనాడులో కరూరు తొక్కిసలాట ఘటన మరవకముందే మరో పెను విషాదం చోటుచేసుకుంది. ఎన్నూరులోని థర్మల్ పవర్ ప్లాంటు విస్తరణ పనుల్లో శ్లాబు కూలడంతో తొమ్మిది మంది వలస కార్మికులు చనిపోయారు. మరో 15 మంది గాయపడ్డారు. మృతులను అస్సాం నుంచి వచ్చిన వలసకార్మికులుగా గుర్తించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం..తిరువల్లూరు జిల్లా ఎన్నూరు సమీపంలోని వయలూర్‌లో ఉన్న ఎన్నూర్ సెజ్ సూపర్‌క్రిటికల్ థర్మల్ పవర్ ప్రాజెక్టు సైటులో విస్తరణ పనులు చేపడుతున్నారు. భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (బిహెచ్‌ఇఎల్ - భెల్) ఇక్కడ 2 x 660 మెగావాట్ల సామర్థ్యంతో బొగ్గు ఆధారిత విద్యుత్కేంద్రాన్ని నిర్మిస్తోంది. ఇందులో భాగంగా నిర్మించిన శ్లాబు మంగళవారం సాయంత్రం ఒక్క సారిగా కుప్పకూలింది. దీంతో పనుల్లో నిమగ్నమైన కార్మికులు శిథిలాల కింది చిక్కుకుపోయారు.

ఎన్నూర్‌లోని థర్మల్ విద్యుత్కేంద్రం.. విస్తరణ పనుల్లో ప్రమాదం చోటుచేసుకున్న ప్రాంతం

అక్కడికక్కడే 9 మంది చనిపోయారు. మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చెన్నయ్‌లోని రాయపురం ప్రభుత్వ స్టాన్లీ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు. వీరిలో కొందరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.

స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాంతి

ఈ విషాద ఘటనపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అస్సాంకు చెందిన తొమ్మిది మంది కార్మికులు ఈ ప్రమాదంలో చనిపోవడం తనను తీవ్రంగా కలిచి వేసిందని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే తక్షణమే ఘటనాస్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్య వేక్షించాల్సిందిగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి శివ శంకర్, తమిళనాడు జెడ్కో ఛైర్మన్ జె.రాధాకృష్ణన్‌ను ఆయన ఆదేశించారు. చనిపోయిన మిగతా 6లో

విజయవాడలో దారుణం

- బాలికపై బాబాయ్ అత్యాచారం

ప్రజాశక్తి - విజయవాడ

విజయవాడలో దారుణం చోటుచేసుకుంది. ఏడో తరగతి చదువుతున్న 14 ఏళ్ల బాలికపై ఆమె బాబాయ్ అత్యాచారం చేశాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. గుంటూరు జిల్లా దాచేపల్లికి చెందిన బాధిత బాలిక తల్లిదండ్రులు (దేవమణి, చినబాబు) ఆరేళ్ల క్రితం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈ నేపథ్యంలో విజయవాడ శివారు పాయకాపురంలో నివాసముంటున్న బాలిక పిన్ని ఇరుగు సుచిత్ర (దేవమణి సొంత చెల్లెలు), బాబాయ్ ప్రవీణ్, అమ్మమ్మ వద్ద బాలిక ఉంటుంది. సింగనగర్‌లోని మున్సిపల్ పాఠశాలలో చదువుకుంటోంది. నాలుగైదు నెలలుగా బాబాయ్ అత్యాచారానికి పాల్పడుతున్నాడు. భయంతో అప్పటి నుంచి ఇప్పటి వరకూ తనపై జరిగిన ఘోరం గురించి బయటకు చెప్పలేకపోయింది. కడుపు నొప్పిగా ఉందని పిన్నికి తెలపడంతో ఆమె పాత ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు. పరీక్షించిన వైద్యులు బాలిక గర్భం దాల్చినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై నున్న పోలీసులకు ఫిర్యాదు అందింది. ఎసిపి స్రవంతిరాయ్ బాలిక నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేసుకుని నిందితుడు ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

పాక్‌లో ఆత్మాహుతి దాడి

- పేలుళ్లు, కాల్పులతో దద్దరిల్లిన క్వెట్టా
- 13 మంది మృతి - మరో 30 మందికి గాయాలు
- పారామిలటరీ కేంద్ర కార్యాలయం వద్ద ఘటన

క్వెట్టాలో పేలుళ్ల ధాటికి ధ్వంసమైన వాహనాలు

ఇస్లామాబాద్ : పాకిస్తాన్‌లోని క్వెట్టా ప్రాంతం మంగళవారం భారీ పేలుళ్లతో దద్దరిల్లింది. భద్రతా బలగాలను లక్ష్యంగా చేసుకొని దుండగులు ఆత్మాహుతి కారుబాంబు దాడులతో విరుచుకుపడ్డారు. అనంతరం భీకర కాల్పులు జరిపారు. ఈ దాడుల్లో 13 మంది చనిపోయారు. మరో 30 మంది పైగా గాయపడ్డారు. చనిపోయినవారిలో ఇద్దరు భద్రతాధికారులు, మిగిలినవారంతా సాధారణ పౌరులు. స్థానిక అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం..బలోచిస్థాన్‌లోని క్వెట్టా నగరంలో పారామిలిటరీ బలగాలకు చెందిన ఫ్రాంటియర్ కార్ప్స్ ప్రాంతీయ కేంద్ర కార్యాలయం సమీపంలో ఈ పేలుళ్ల చోటుచేసుకున్నాయి. దాంతో దాని చుట్టుపక్కల ప్రాంతాల్లోని ఇళ్లు, భవనాల కిటికీ అద్దాలు పగిలిపోయాయి. వాహనాలు పెద్ద సంఖ్యలో ధ్వంసమయ్యాయి. అప్పటికే ఆందోళన చెందుతున్న ప్రజలకు భీకరస్థాయిలో కాల్పుల మోత వినిపించింది. ఈ వరుస ఘటనలు స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించాయి. దాడులకు పాల్పడిన వారిని గుర్తించేందుకు బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. అత్యంత తీవ్రతతో జరిగిన పేలుళ్లకు గల కారణాలపై దర్యాప్తు జరుగుతోంది. క్షతగాత్రులను వెంటనే దగ్గర్లోని ఆస్పత్రులకు తరలించారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితిని విధించారు. ఈ నెల ప్రారంభంలో క్వెట్టాలో బలూచిస్థాన్ నేషనల్ పార్టీ వ్యవస్థాపకుడు అతావుల్లా మెంగల్ వర్ధంతి నేపథ్యంలో కూడా ఆత్మాహుతి దాడి జరిగింది. ఆ ఘటనలో 11 మంది మరణించగా, సుమారు 18 మంది గాయపడ్డారు.

సంపాదకీయం

అన్నింటిపైనా సుంకాలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ దేశంలోకి దిగుమతయ్యే ఫార్మాస్యూటికల్ డ్రగ్స్‌పై వంద శాతం సుంకాలు బాది ప్రపంచ ఔషధ మార్కెట్‌ను అనిశ్చితిలోకి నెట్టారు. కొత్త సుంకాలు అక్టోబర్ ఒకటి (నేటి) నుంచి అమల్లోకొస్తాయని ట్రంప్ ప్రకటించారు. కేవలం బ్రాండెడ్, పేటెంట్ ఔషధాల పైనే వంద శాతం సుంకాలని పైకి చెబుతున్నా అమల్లోకొస్తేనే వాస్తవం బోధ పడుతుంది. తమ వాణిజ్య భాగస్వాములపై జాతీయంగా విధించిన సుంకాలకు కొత్తవి అదనమా కాదా అన్నదానిపై స్పష్టత లేదు. సుంకాలపై చట్టపరంగా వివరించలేదు. అమెరికాలో ఔషధ ఉత్పత్తి ప్లాంట్లు స్థాపించిన, నెలకొల్పే దశలో ఉన్న వారికి సుంకాల నుంచి మినహాయింపునిచ్చారు. దేశీయంగా తయారీని పెంచి, తద్వారా బడ్జెట్ లోటును పూడ్చుకునేందుకే సుంకాలంటూ ఆగస్టు నుంచి ట్రంప్ చెలరేగిపోతున్నారు. ఆ వాదనలో ఎంతమాత్రం నిజం లేదని ఎవరైనా చెబుతారు. దేశ భద్రత, ఇతర కారణాల రీత్యానే సుంకాలు వేస్తున్నామనడం ఎంతమాత్రం పొసగదు. తన మాట వినని దేశాలపై కక్ష సాధించడానికే సుంకాల బాదుడు. పైగా ఏకపక్షంగా వేస్తున్నారు. వాణిజ్యపర, ద్వైపాక్షిక చర్చలకు ఆస్కారం లేకుండా, గిట్టని దేశాలను ఎంపిక చేసుకొని మరీ సుంకాల విధింపునకు బరి తెగించారు.

ప్రస్తుతం ఔషధ దిగుమతులపై ట్రంప్ విధించిన సుంకాల వలన ఇప్పటికిప్పుడు భారత్ ఫార్మా పరిశ్రమపై ప్రభావం ఉండదని, అందుక్కారణం మన దేశం జనరిక్ మందుల ఎగుమతిదారుగానే ఉందన్నది ఇండస్ట్రీ పెద్దల ప్రాథమిక అంచనా. భవిష్యత్తులో సుంకాలు జనరిక్‌నకు కూడా విస్తరించే అవకాశం లేకపోలేదు. అదే జరిగితే మన దేశ ఫార్మా ఇండస్ట్రీకి పెద్ద దెబ్బే. ఇప్పుడు కూడా ఫార్మా స్టాక్స్‌పై సెంటిమెంటల్ ప్రభావం కచ్చితంగా ఉంటుందనేవారు లేకపోలేదు. అమెరికా ఔషధ అవసరాలలో 40 శాతం మేర భారతదేశం తీరుస్తోంది. 2024లో ఆ దేశానికి దిగుమతైన ఫార్మా డ్రగ్స్ విలువ 27.9 బిలియన్ డాలర్లు (దాదాపు రూ. 2.45 లక్షల కోట్లు) కాగా వాటిలో 31 శాతం, అంటే 8.7 బిలియన్ డాలర్లు (సుమారు రూ.77 వేల కోట్లు) భారత్‌వే. అమెరికాలో వినియోగించే జనరిక్ ఔషధాల్లో 45 శాతం మన దేశం నుంచే సరఫరా అవుతున్నాయి. ఇండియాలో ప్రముఖ ఫార్మా కంపెనీలైన డాక్టర్ రెడ్డీస్, అరబిందో, జైడస్, సన్, గ్లాండ్ వంటి సంస్థల ఆదాయాల్లో 30-50 శాతం వరకు అమెరికా మార్కెట్ నుంచే లభిస్తున్నాయి. ఈ విధంగా చూస్తే భారత్‌ను దెబ్బతీయాలన్న ప్రధాన లక్ష్యంతోనే ట్రంప్ వంద శాతం సుంకాలు వేశారని అర్థమవుతుంది. అందుకే తమ దేశంలో మందుల ధరలు పెరిగినా పట్టించుకోలేదు.

తన ఆంక్షలను ధిక్కరించి ఇండియా, రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందన్న కక్షతో ట్రంప్ 50 శాతం సుంకాలు విధించారు. తాజాగా ఫార్మాతో పాటు గృహోపకరణాలు, చివరికి సినిమా పరిశ్రమను సైతం వదిలిపెట్టలేదు. భారత్‌ను ఇబ్బందులు పెట్టి, బెదిరించి తన దారికి తెచ్చుకోవాలని చూస్తున్నారు. హెచ్1 బి వీసాల వ్యవహారం కూడా ఆ కోవలోనిదే. ఇప్పటికే ట్రంప్ టారిఫ్‌ల వలన మన వ్యవసాయ, ఆక్వా తదితర రంగాలు, రైతులు సంక్షోభంలో పడ్డాయి. అయినప్పటికీ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమెరికా-ట్రంప్ విధానాలను, వినాశకర నిర్ణయాలను గట్టిగా నిలదీసి, నిరసించడంలో, పోరాటం నిర్వహించడంలో తటపటాయిస్తోంది. న్యూయార్క్‌లో జరుగుతున్న ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశాల సదర్భంగా బ్రిక్స్ దేశాలు ట్రంప్ టారిఫ్‌లను నిర్ద్వంద్వంగా వ్యతిరేకించాయి. ఆ సంయుక్త ప్రకటనలో ఇండియా కూడా ఉంది. ప్రకటనలు ఏ విధంగా ఉన్నా అమెరికాతో జరిగే వాణిజ్య, ద్వైపాక్షిక సమావేశాల్లో, అంతర్జాతీయ వేదికలపైనా ట్రంప్ ఏకపక్ష, కక్ష పూరిత టారిఫ్‌లను భారత్ వ్యతిరేకించాలి. ట్రంప్ టారిఫ్‌లను వ్యతిరేకించే మిగతా దేశాలతో కలిసి నిర్వహించే పోరాటంలో భారత్ ముందుండాలి. అదే దేశ ప్రజల ప్రయోజనాలకు రక్ష. అమెరికా- ట్రంప్‌తో పెనవేసుకుంటే మన ప్రయోజనాలకు గండికొట్టి దేశాన్ని తాకట్టు పెట్టినట్లు భావించాలి. మూల్యం చెల్లించుకోక తప్పదు.

మహనీయుల మాట

**విద్య ఒక ఆయుధం.
దాని సామర్థ్యం...
అది ఎవరి చేతిలో ఉంది,
ఎవరి కోసం ఉద్దేశించబడింది
అనే దానిపై ... ఆధారపడి ఉంటుంది.
- జోసఫ్ స్టాలిన్**

సందర్భం

ఆర్.ఎస్.ఎస్ అసలు స్వభావం

ఆర్.ఎస్.ఎస్‌ను ఏర్పాటు చేసి ఈ విజయదశమికి వంద సంవత్సరాలవుతోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని భారత ప్రభుత్వం ప్రత్యేక పోస్టల్ స్టాంపును విడుదల చేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇటీవల దానిని ఆవిష్కరించారు. అంతకు ముందు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోట నుండి దేశ ప్రజలకు ఇచ్చిన సందేశంలోనూ మోడీ ఆర్.ఎస్.ఎస్ ను ఘనంగా ప్రశంసించారు. ఈ నేపథ్యంలో...ఆర్.ఎస్.ఎస్ అసలు స్వభావంపై ప్రముఖ రచయిత ఎ.జి.నూరాని 1993 మార్చి 26న ఫ్రంట్‌లైన్‌లో రాసిన వ్యాసాన్ని... పాఠకులకు అందిస్తున్నాం.



'మంచి ప్రవర్తనతో ఉంటాం' అన్న హామీతో భారతదేశంలో మనుగడ సాగిస్తున్న ఏకైక రాజకీయ సంస్థ ఆర్.ఎస్.ఎస్ మాత్రమే! ఈ వ్యాఖ్య 1975 జులై 4న ఎమర్జెన్సీ నాటి నిషేధానికి ఉద్దేశించినదే కాదు. అంతకు చాలా ముందు, 1948 జనవరి 30న గాంధీజీ హత్య తర్వాత విధించిన నిషేధానికి సంబంధించినది కూడా! ఈ రెండు సందర్భాల్లోనూ అసత్యపు హామీలతో ఆర్.ఎస్.ఎస్ మనుగడ కొనసాగించింది. అలా అసత్యాలు, కపట విన్యాసాలే ఆర్.ఎస్.ఎస్ అసలైన ప్రాథమిక స్వభావం (బేసిక్ ఇన్‌స్టిక్ట్)! జనవరి 30న గాంధీజీ హత్య జరిగిన వెంటనే, ఫిబ్రవరి 1న ఆర్.ఎస్.ఎస్ ప్రధాన నేత ఎం.ఎస్. గోల్వాల్కర్‌ను అరెస్ట్ చేశారు. గాంధీజీ హత్యపై దిగ్భ్రాంతి, దు:ఖాన్ని వ్యక్తం చేస్తూ ఆయన జనవరి 30న జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్‌కు పంపిన టెలిగ్రామ్‌లు ఆయనను రక్షించలేకపోయాయి. 1948 ఫిబ్రవరి 4న భారత ప్రభుత్వం ఆర్.ఎస్.ఎస్ ను నిషేధించింది. ఈ మేరకు విడుదలైన ప్రభుత్వ ప్రకటనలో 'హిందువుల శారీరక, మానసిక, నైతిక శ్రేయస్సును ప్రోత్సహించడం. అలాగే వారిలో సోదరభావం, పరస్పర ప్రేమ, సేవా భావాలను పెంపొందించడాన్ని ఆర్ఎస్ఎస్ లక్ష్యాలుగా ప్రకటించింది. అయితే, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఫ్ సభ్యులు తాము ప్రకటించిన ఆదర్శాలకు అనుగుణంగా ప్రవర్తించలేదని గుర్తించాము. సంఫ్ సభ్యులు వాంఛనీయం కాని, ప్రమాదకరమైన కార్యకలాపాలలో పాల్గొంటూ వచ్చారు. వారు ప్రజలలో ఉగ్రవాదాన్ని ప్రోత్సహించేలా కరపత్రాలు పంచారు. తుపాకులు కూడగట్టమని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా అసంతృప్తి రేకెత్తించమని, పోలీసులు, సైన్యంపై తిరగబడమని పిలుపునిచ్చారు' అని పేర్కొన్నారు.

ఎ.జి. నూరాని

'నిషేధం కొనసాగుతున్నంత వరకు ఆర్.ఎస్.ఎస్ ను రద్దు చేయాలి' అని గోల్వాల్కర్ ఫిబ్రవరి 6న ఆదేశించారు. అయితే ప్రభుత్వం చేసిన అన్ని ఆరోపణలను ఆయన తిరస్కరించారు. ఆర్.ఎస్.ఎస్ చట్టానికి లోబడి నడుచుకునే సంస్థ అని, చట్ట పరిమితులలోనే తన కార్యక్రమాలను కొనసాగిస్తుందని ఆయన పేర్కొన్నారు. గోల్వాల్కర్‌ను 1948 ఆగస్టు 6న విడుదల చేసినా, ఆయన ప్రయాణాలు నాగ్‌పూర్ వరకు మాత్రమే పరిమితం చేస్తూ ఆంక్షలు పెట్టారు. విడుదలైన అయిదు రోజుల తరువాత ఆయన నెహ్రూ, పటేల్‌లకు లేఖ రాసి ఈ పరిమితులపై ఫిర్యాదు చేశారు. ప్రధానమంత్రి కార్యదర్శులలో ఒకరిపై సెప్టెంబర్ 27న గోల్వాల్కర్‌కు సమాధానం ఇస్తూ రాసిన లేఖలో 'ఆర్.ఎస్.ఎస్ జాతీయ ప్రయోజనాలకు విరుద్ధంగా, ప్రజాహితానికి హానికరంగా ఉండే కార్యాకలాపాలలో పాల్గొన్నదన్న గట్టి ఆధారాలు ప్రభుత్వం వద్ద ఉన్నాయి.' అని రాశారు. 'ఆర్.ఎస్.ఎస్ ను నిషేధించే ముందు, యుపి ప్రభుత్వం ఈ మేరకు సేకరించిన ఆధారాలను ప్రధాని నెహ్రూకు పంపింది. ఇతర రాష్ట్ర ప్రభుత్వాల వద్ద కూడా ఇలాంటి ఆధారాలు ఉన్నాయి. నిషేధం విధించిన తరువాత కూడా ఆర్.ఎస్.ఎస్ సభ్యుల ఈ తరహా కార్యకలాపాల గురించి మాకు సమాచారం అందుతూనే ఉంది. ఈ పరిస్థితుల్లో ఆర్.ఎస్.ఎస్ ను ప్రజా ప్రయోజనాల దృష్ట్యా హాని చేయని సంస్థగా ప్రభుత్వం పరిగణించలేదు.' అని కూడా ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు.

ఈ ఆరోపణలపై విచారణ జరపాలని నవంబర్ 3న గోల్వాల్కర్ డిమాండ్ చేశారు. అప్పటికి ఆయనపై ఉన్న ఆంక్షలను తొలగించారు. ఢిల్లీకి వెళ్లడానికి, ప్రభుత్వం ముందు తన వాదన వినిపించడానికి ఆయనకు అనుమతి లభించింది. అయితే, ప్రధానమంత్రి నెహ్రూతో సమావేశం ఏర్పాటు చేయాలంటూ ఆయన చేసిన విజ్ఞప్తిని తిరస్కరించారు. ఈ ఇంటర్వ్యూను తిరస్కరించడానికి కారణాలను నవంబర్ 10న నెహ్రూ వివరించారు. 'ఆర్.ఎస్.ఎస్ ప్రకటించిన లక్ష్యాలకు, ఆచరణకు సంబంధం లేదు. ఆర్.ఎస్.ఎస్ తో సంబంధమున్నవారు పలు రూపాల్లో, పలు మార్గాల్లో చేపడుతున్న కార్యాచరణ భారత పార్లమెంటు తీర్మానాలకు, రాజ్యాంగంలోని నిబంధనలకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. జాతి వ్యతిరేకంగానూ, తరచూ విధ్వంసకరంగా, హింసాత్మకంగా వారి కార్యాచరణ ఉంటోంది' అని నెహ్రూ పేర్కొన్నారు.

నిషేధం అనంతరం కూడా సర్దార్ వల్లభ్ భాయి పటేల్‌కు ఆర్.ఎస్.ఎస్ ను కాంగ్రెస్‌లో కలుపుకోవాలనే ఆసక్తి ఉండేది. కానీ, కేబినెట్‌లోని తన హిందూ మహాసభ సహచరుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ, ఆర్.ఎస్.ఎస్, హిందూ మహాసభల పట్ల సున్నితంగా (సాఫ్ట్) వ్యవహరించాలంటూ ఒత్తిడి చేశారు. దీనికి పటేల్ పెద్దగా స్పందించలేదు. జులై 18న పటేల్ ముఖర్జీకి రాసిన లేఖలో 'మా నివేదికలు ఈ రెండు సంస్థల (ముఖ్యంగా మొదటిదైన ఆర్.ఎస్.ఎస్) కార్యకలాపాల ఫలితంగా దేశంలో అలాంటి ఘోర విషాదం (గాంధీజీ హత్య) సంభవించగల వాతావరణం ఏర్పడిందని ధృవీకరిస్తున్నాయి. హిందూ మహాసభలోని అతి తీవ్రవాద వర్గం ఈ కుట్రలో భాగమని చెప్పడానికి ఎటువంటి సందేహం లేదు' అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆ తరువాత రెండు నెలలకు, సెప్టెంబర్ 11న గోల్వాల్కర్‌కు పటేల్ ఇచ్చిన సమాధానంలోని అంశాలను అర్థం చేసుకోవడం కొంచెం కష్టమే!

ఈ లేఖలో గోల్వాల్కర్‌ను పటేల్ 'సోదరుడు'గా సంబోధించారు (అంతకు ముందు గోల్వాల్కర్ రాసిన లేఖలో 'మహనీయ సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ గారికి' అని ఉద్దేశించారు). 1947 డిసెంబరులో జైపూర్‌లో చేసిన తన ప్రసంగాన్ని పటేల్ ఈ లేఖలో గుర్తుచేశారు. ఆ ప్రసంగంలో ఆయన ఆర్.ఎస్.ఎస్ గురించి చాలా మృదువుగా మాట్లాడారు. వారిని 'దేశాన్ని ప్రేమించే దేశభక్తులు' అని అన్నట్లు ఆయన గుర్తు చేశారు. కానీ తన మాటలు సంఫ్‌పై ఎటువంటి ప్రభావం చూపలేదని పటేల్ విచారం వ్యక్తం చేశారు: 'ఆర్.ఎస్.ఎస్ హిందూ సమాజానికి సేవ చేసిందనే విషయంలో ఎటువంటి సందేహం లేదు. అయితే వారు ప్రతీకార స్వభావంతో ముస్లింలపై దాడులు ప్రారంభించినప్పుడు సమస్య ప్రారంభమైంది. హిందువులను సంఘటితం చేయడం, వారికి సహాయం చేయడం ఒక విషయం. అది ఫర్వాలేదు. కానీ నిరపరాధులైన, బలహీనులైన పురుషులు, స్త్రీలు, పిల్లలపై దాడులు చేయడం సహించలేం.' అని పటేల్ పేర్కొన్నారు. అంతేకాదు 'ఆర్.ఎస్.ఎస్ నేతల ప్రసంగాలన్నీ మతోన్మాద విషంతో నిండిపోయిన ఉండేవి' అని కూడా ఆయన రాశారు. 'ఈ విషం ఫలితంగా దేశం గాంధీజీ అమూల్యమైన ప్రాణాలను త్యాగం చేయాల్సి వచ్చింది. 'గాంధీజీ హత్య తరువాత ఆర్.ఎస్.ఎస్ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తూ, మిఠాయిలు పంచుకున్నారు' అని ఆయన స్పష్టంగా రాశారు.

అయితే తనకంటూ ఉన్న కొన్ని ప్రత్యేక కారణాల వల్ల పటేల్ ఒక ఆశ్చర్యకరమైన ప్రతిపాదన చేశారు: 'ఆర్.ఎస్.ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో కలిసిపోవడం ద్వారానే తమ దేశభక్తి ప్రయత్నాలు కొనసాగించగలరు కానీ, వేరుగా ఉండటం లేదా కాంగ్రెస్‌ను వ్యతిరేకించడం ద్వారా కాదు' అని ఆయన రాశారు. ఆ తరువాత ఆంక్షలను ఎత్తివేడయంతో గోల్వాల్కర్ ఢిల్లీలోకి వచ్చారు. కానీ వారి చర్చలు విఫలమయ్యాయి. 1948 నవంబర్ 2న గోల్వాల్కర్ తన వైఖరిని వివరిస్తూ, బహిరంగ ప్రకటన చేశారు. మరో మూడు రోజుల తరువాత ఆయన సర్దార్ పటేల్ ప్రతిపాదనకు ఇచ్చిన సమాధానం అత్యంత ప్రధానమైనది. అదే ఆ తరువాత జనసంఘం (బిజెపికి పూర్వ సంస్థ) స్థాపనకు పునాది సిద్ధాంతమైంది. 'రాజకీయ రంగంలో ప్రజలకు సేవ చేయగల శక్తి కలిగి, ప్రస్తుతానికి పాలక పార్టీగా ఉన్న కాంగ్రెస్...సాంస్కృతిక రంగంలో ప్రజల్లో అసమానమైన దేశభక్తి, సోదరభావం, నిస్వార్థతను పెంపొందించడంలో విజయాన్ని సాధించిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఫ్ ఈ రెండింటి మధ్య ఎటువంటి వివాదం లేకుండా శాశ్వతమైన పరస్పర ప్రేమ ఉండాలని, ఒకటి మరొకదానికి సంపూర్ణంగా తోడ్పడుతూ, పవిత్ర సంగమంలా కలిసిపోవడానికి నేను నా శక్తి మేర ప్రయత్నించాను.' అని ఆయన తెలిపారు. చర్చలు విఫలమైన తరువాత గోల్వాల్కర్‌ను తిరిగి నాగ్‌పూర్‌కి వెళ్లాలని ఆదేశించారు. గోల్వాల్కర్ సర్దార్ పటేల్‌తో జరిగిన రెండు సమావేశాల్లో సంఫ్ విధానాలను మార్చేందుకు నిరాకరించారని, హోం మంత్రిత్వ శాఖ నవంబర్ 14న ఒక ప్రకటన విడుదల చేసింది. 'ఆర్.ఎస్.ఎస్ భారతదేశాన్ని లౌకిక రాజ్యంగా తీర్చి దిద్దడానికి పూర్తిగా సహకరిస్తుందని, జాతీయ పతాకాన్ని ఆమోదిస్తుందని, సంస్థపై విధించిన నిషేధాన్ని ఎత్తివేయాలని కోరుతూ...ప్రధానమంత్రికి, హోం మంత్రికి గోల్వాల్కర్ లేఖలు రాశారు. అయితే, ఆచరణ దీనికి పూర్తి భిన్నంగా ఉంది. దీనితో పాటు ఇటువంటివే అనేక కారణాల వల్ల భారత ప్రభుత్వం ఆర్.ఎస్.ఎస్ పై నిషేధాన్ని ఎత్తివేయాలని రాష్ట్రాలకు సూచించలేకపోతోంది.' అని కూడా హోంశాఖ పేర్కొంది. అయితే, అనంతర పరిణామాల్లో భారత ప్రభుత్వం 1949 జులై 11న ఆర్.ఎస్.ఎస్ పై విధించిన నిషేధాన్ని ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. ఆ ప్రకటనలో 'ఆర్.ఎస్.ఎస్ నాయకుడు ఇచ్చిన హామీల మేరకు ఆర్.ఎస్.ఎస్ కు భారత రాజ్యాంగం పట్ల నిబద్ధత చూపడానికి, జాతీయ పతాకాన్ని గౌరవిస్తూ, అజ్ఞాతాన్ని వదిలి, హింసను తిరస్కరించే ప్రజాస్వామ్య, సాంస్కృతిక సంస్థగా కార్యకలాపాలు కొనసాగించడానికి అవకాశం ఇవ్వాలన్న నిర్ణయానికి భారత ప్రభుత్వం వచ్చింది' అని పేర్కొన్నారు.

ఎమర్జెన్సీ సమయంలో ఇలా...

ఎమర్జెన్సీ సమయంలో నిషేధం విధించడంలో అప్పటి ఆర్.ఎస్.ఎస్ అధినేత బాలా సాహెబ్ దేవరస్ ఇందిరా గాంధీకి, నాటి హోంశాఖ మంత్రి చవాన్‌కు ఎన్నో లేఖలు రాశారు. 'మీరు 1975 ఆగస్టు 15న ఢిల్లీలోని ఎర్రకోట నుండి చేసిన ప్రసంగాన్ని రేడియో ద్వారా నేను విన్నాను. ఆ ప్రసంగం సమయోచితంగా ఉంది. దానితో ప్రేరణ కలిగే ఈ ఉత్తరం రాస్తున్నాను.' అని ఆయన ఆగస్టు 22న ఇందిరకు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఆ ఉత్తరంలోనే చివరగా ఆర్.ఎస్.ఎస్ పై విధించిన నిషేధాన్ని రద్దు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దేవరస్ జులై 16న మరోసారి ఇందిరా గాంధీకి లేఖ రాసి, ఆమె విదేశీ విధానాన్ని ప్రశంసించి, నిషేధంపై తన విన్నపాన్ని మరోసారి వ్యక్తం చేశారు. చవాన్‌కు రాసిన లేఖలు కూడా ఇదే విధంగా ఉన్నాయి. 1975 జులై 15న రాసిన లేఖలో 'సంఫ్‌కు ప్రభుత్వానికి, సమాజానికి మధ్య ఎటువంటి శత్రుత్వం లేదు. సంఫ్ కార్యక్రమంలో హింసకు స్థానం లేదు. సంఫ్ కేవలం సామాజిక, సాంస్కృతిక కార్యకలాపాల్లో మాత్రమే ఆర్.ఎస్.ఎస్ నిమగ్నమౌతుంది.' అని రాశారు. 1975 నవంబర్ 24, 1975 డిసెంబర్ 12, 1976 జనవరి 24న కూడా ఆయన చవాన్‌కు లేఖలు రాశారు. 1976 జూన్ 6న కొన్ని విషయాలను ప్రత్యక్షంగా వివరించడానికి 'పెరోల్‌పై విడుదల చేయాలి' అని కోరారు. ఈ విన్నపాన్ని1976 జులై 12న మళ్లీ పునరావృతం చేశారు.

అత్యవసర పరిస్థితులు ముగిశాక, జనతా హయాంలో ఆర్.ఎస్.ఎస్ అభివృద్ధి సాధించింది. జనతా పార్టీలో భాగంగా వున్న జనసంఫ్ 1980లో ఆ పార్టీ నుంచి బైటకొచ్చింది. ఆ తర్వాత భారతీయ జనతా పార్టీగా ఏర్పడింది. ఏడు సంవత్సరాల తరువాత 1987 నవంబర్ 16న 'సమీప భవిష్యత్‌లో ఆర్.ఎస్.ఎస్ రాజకీయ రంగ ప్రవేశాన్ని తోసిపుచ్చలేము' అని దేవరస్ ధైర్యంగా ప్రకటించారు. నేరుగా రాజకీయ తెరపై ఆరంగ్రేటం చేసేంతవరకు బిజెపి, విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్‌తో పాటు ఇతర సంస్థలపై ఆర్ఎస్ఎస్ ఆధిపత్యం కొనసాగుతుంది. ★

స్వాతంత్ర్యోద్యమంలో దసరా...
బ్రిటీష్ పాలనపై ఓ ఆయుధం

స్వాతంత్ర్యోద్యమంలో దసరా ద్వారా ప్రజలలో జాతీయవాద భావన బలపడింది. అన్ని మతాలు, కులాల వారు ఐక్యమై బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాడారు. ఇది 1947లో స్వాతంత్ర్య సాధనకు దోహదపడింది. దసరా సమావేశాలు కుల, మత బేధాలు లేకుండా స్వాతంత్ర్యం, సమానత్వం, సామాజిక సంస్కరణలకు దోహదపడ్డాయి. 1921లో గాంధీజీ దసరా సమయంలో నిర్వహించిన స్వదేశీ ర్యాలీలు బ్రిటీష్ ఆర్థిక వ్యవస్థను బలహీన పరిచాయి. స్వాతంత్ర్యోద్యమంలో దసరా సానుకూల ఐక్యతను, స్వాతంత్ర్య లక్ష్యాన్ని సాధించగా...నేడు విభజన, హింస, భయాన్ని పెంచుతోంది.

దసరా (విజయ దశమి) పండుగ భారత స్వాతంత్ర్యోద్యమంలో ముఖ్యమైన సాంస్కృతిక, రాజకీయ సాధనంగా ఉపయోగించబడింది. ఈ పండుగ 'చెడు మీద మంచి సాధించిన విజయా'న్ని సూచించడం వల్ల, బ్రిటిష్ వలస పాలనను 'చెడు'గా చిత్రీకరించి, జాతీయవాద భావాలను రేకెత్తించడానికి సహాయపడింది. ఇది ప్రజలను ఐక్యం చేసే బలమైన వేదికగా మారింది. ముఖ్యంగా బాల గంగాధర్ తిలక్ (1893-1905) దసరా, గణేష్ చతుర్థి ఉత్సవాలను బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రచారానికి ఉపయోగించారు. బ్రిటిష్ పాలకులు పెద్ద సమావేశాలను నిషేధించడంతో తిలక్ ఈ పండుగలను "సాంస్కృతిక ఉత్సవాలు"గా మార్చి, ప్రజల మధ్య ఐక్యతను, దేశభక్తిని ప్రోత్సహించారు. రామ్ లీలా నాటకాల ద్వారా స్వరాజ్ (స్వయం పాలన) భావాన్ని వ్యాప్తి చేశారు. ముంబైలో 1890 లలో ఈ ఉత్సవాలు జాతీయవాద కార్యక్రమాలుగా మారాయి. ఇది బ్రిటిష్ అధికారులకు ఆందోళన కలిగించింది. ఇది స్వదేశీ ఉద్యమానికి (1905) మార్గదర్శకంగా మారింది. ఇక్కడ దసరా ఊరేగింపులు బ్రిటిష్ వస్తువుల బహిష్కారానికి ప్రేరణగా మారాయి. తిలక్ ఈ పండుగలను "ప్రజల సమావేశాలు"గా మార్చి, జాతీయ వాదాన్ని ప్రజలలో కల్పించాడు.

డా.కె. రమాప్రభ

గాంధీజీ స్వాతంత్ర్యోద్యమాన్ని అహింస, సత్యాగ్రహంతో నడిపారు. దసరా "విజయ" సందేశాన్ని బ్రిటిష్ పాలనపై పోరాటంగా ప్రతీకాత్మకంగా ఉపయోగించారు. స్వదేశీ ఉద్యమం (1905-1911) దసరా సమయంలో బ్రిటిష్ వస్తువుల బహిష్కారాన్ని ప్రోత్సహించారు. రావణ దహనాన్ని "బ్రిటిష్ వలస వ్యవస్థను తగులబెట్టడంగా చిత్రీకరించారు. ఇది ప్రజలలో బ్రిటిష్ వ్యతిరేక పోరాటానికి పట్టుదలను పెంచింది. సహాయ నిరాకరణ ఉద్యమంలో (1920-1922) గాంధీ దసరా అహింసా సందేశాన్ని ఉపయోగించి, బ్రిటిష్ సంస్థలను (స్కూళ్లు, కోర్టులను) బహిష్కరించమని ప్రజలకు పిలుపునిచ్చారు. 'చెడు మీద మంచి విజయా'న్ని స్వరాజ్‌తో పోల్చారు.

దసరా (మహా నవమి అని పిలుస్తారు) చారిత్రక మూలాలు విజయనగరంలో ఉన్నాయి. ఇక్కడ ఇది సైనిక శక్తి ప్రదర్శనగా జరిగేవి. బ్రిటిష్ కాలంలో ఈ సాంప్రదాయాన్ని వారు సైనిక భర్తీ కోసం ఉపయోగించుకున్నారు. కానీ జాతీయవాదులు దాన్ని బ్రిటిష్ వ్యతిరేక పోరాటంగా మార్చారు. 19వ శతాబ్దంలో మైసూర్ మహారాజులు దసరాను రాజకీయంగా ఉపయోగించారు. ఇది బ్రిటిష్‌కు వ్యతిరేకంగా ఐక్యతను పెంచింది. 1857 ప్రథమ స్వాంతత్ర్య సంగ్రామం తర్వాత, బ్రిటిష్ వాడు దసరాను "సాంస్కృతిక ఉత్సవంగా గుర్తించగా, జాతీయవాదులు దాన్ని ప్రతిఘటనకు సింబల్‌గా మార్చారు.

స్వాతంత్ర్యోద్యమంలో దసరా ఒక సాంస్కృతిక ఆయుధంగా పనిచేసింది. ఇది ప్రజలను భక్తి ద్వారా రాజకీయంగా ప్రేరేపించి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాటం నడిపింది.

స్వాతంత్ర్యోద్యమంలో దసరా పండుగ యొక్క ఉపయోగానికి...నేడు రాజకీయంగా, మతపరమైన పండుగలను వాడుకోవడానికి మధ్య స్పష్టమైన వ్యత్యాసాలు ఉన్నాయి. విభజన, రాజకీయ లబ్ధి కోసం రాజకీయ పార్టీలు, కొన్ని సంస్థలు (ఆర్ఎస్ఎస్, విహెచ్‌పి, బిజెపి మొదలైనవి) పండుగల మతపరమైన గుర్తింపును బలోపేతం చేయడానికి, మైనారిటీల(ముఖ్యంగా ముస్లింలు, క్రైస్తవులు)పై విద్వేషాన్ని రెచ్చగొట్టడానికి ఉపయోగిస్తున్నాయి. ఇది ఎన్నికల లబ్ధి, హిందుత్వ సిద్ధాంతాన్ని వ్యాప్తి చేయడం కోసం జరుగుతుంది. రావణ దహనం, రామ్ లీలాలను మైనారిటీలపై హింసను ప్రోత్సహించేలా వాడటం (ఉదా: "లవ్ జిహాద్", "ల్యాండ్ జిహాద్" ఆరోపణలు) సమాజంలో విభజనను సృష్టిస్తోంది. 2022లో బీహార్ బిజెపి నాయకుడు హరి భూషణ్ ఠాకూర్ దసరా సందర్భంగా ముస్లింలపై చేసిన వ్యాఖ్యలు విద్వేషాన్ని రెచ్చగొట్టాయి. స్వాతంత్ర్యోద్యమంలో దసరా సమాజాన్ని ఐక్యం చేసి, వలస పాలనకు వ్యతిరేకంగా ఉపయోగపడగా, నేడు సమాజాన్ని మతపరంగా విభజించి, విద్వేషాన్ని పెంచుతోంది. స్వాతంత్ర్యోద్యమ కాలంలో, హిందువులు, ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులు కలిసి బ్రిటిష్‌కు వ్యతిరేకంగా పోరాడారు, దసరా అన్ని మతాల వారిని ఐక్యం చేసే సాధనంగా ఉపయోగపడింది.

కానీ నేడు స్వతంత్ర భారత దేశంలో కొన్ని రాజకీయ పార్టీలు ఓట్ల కోసం మతాన్ని ఉపయోగిస్తున్నాయి. దసరా వంటి పండుగలను హిందూ గుర్తింపును బలోపేతం చేయడానికి, మైనారిటీలను 'ఇతరులు'గా చిత్రీకరించడానికి వాడుతున్నారు. సోషల్ మీడియా, ట్రోల్ ఆర్మీల ద్వారా విద్వేష సందేశాలు వ్యాప్తి చేయడం సులభమైంది. ఇది స్వాతంత్ర్యోద్యమ కాలంలో లేదు. స్వాతంత్ర్యోద్యమంలో దసరా ఒక విదేశీ శత్రువుకు వ్యతిరేకంగా ఐక్యతను పెంచగా, నేడు దేశంలోని సొంత పౌరుల మధ్య (మతపరంగా) విభజనను సృష్టిస్తోంది. కొన్ని సంస్థలు దసరా ఊరేగింపులను మైనారిటీలపై విద్వేష ప్రసంగాల కోసం వాడుతున్నాయి. ఉదాహరణకు, 2023లో ఉత్తరప్రదేశ్‌లో దసరా ఊరేగింపులో మైనారిటీలపై దాడులు జరిగాయి. స్వాతంత్ర్యోద్యమంలో దసరా అహింసాత్మక, సమైక్య ఉద్యమంగా ఉపయోగపడగా, నేడు తరచూ హింసాత్మక, విభజన రాజకీయ లక్ష్యాల కోసం జరుగుతోంది. 2023లో హపూర్‌లో దసరా ఊరేగింపులో ఒక ముస్లిం యువకుడు మూకదాడిలో హత్య చేయబడ్డాడు. ఇది మైనారిటీలను భయాందోళనలకు గురిచేస్తున్నది. హ్యూమన్ రైట్స్ వాచ్ వంటి అంతర్జాతీయ సంస్థలు ఈ రకమైన హేట్ స్పీచ్‌ను "జినోసైడ్ పిలుపులు"గా వర్గీకరించాయి.

స్వాతంత్ర్యోద్యమంలో దసరా ద్వారా ప్రజలలో జాతీయవాద భావన బలపడింది. అన్ని మతాలు, కులాల వారు ఐక్యమై బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడారు. ఇది 1947లో స్వాతంత్ర్య సాధనకు దోహదపడింది. దసరా సమావేశాలు కుల, మత బేధాలు లేకుండా స్వాతంత్ర్యం, సమానత్వం, సామాజిక సంస్కరణలకు దోహదపడ్డాయి. 1921లో గాంధీజీ దసరా సమయంలో నిర్వహించిన స్వదేశీ ర్యాలీలు బ్రిటిష్ ఆర్థిక వ్యవస్థను బలహీన పరిచాయి. స్వాతంత్ర్యోద్యమంలో దసరా సానుకూల ఐక్యతను, స్వాతంత్ర్య లక్ష్యాన్ని సాధించగా... నేడు విభజన, హింస, భయాన్ని పెంచుతోంది.

గత 11 సంవత్సరాలలో (2014 నుండి 2025 వరకు) అంటే బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత భారతదేశంలో పండుగల పేరుతో జరిగిన మతపరమైన విద్వేషాలు, హింస, విద్వేష నేరాల గురించిన వివిధ మానవ హక్కుల సంస్థలు (హ్యూమన్ రైట్స్ వాచ్, సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సొసైటీ అండ్ సెక్యులరిజం-సిఎస్ఎస్ఎస్), ఎన్‌సిఆర్‌బి డేటా వివరాలు కలచివేస్తున్నాయి. సిఎస్ఎస్ఎస్ 2024 నివేదిక ప్రకారం, 2024లో మొత్తం 59 మత విద్వేష దాడులు జరిగాయి. వీటిలో 26 పండుగల సందర్భంగా (ముఖ్యంగా హిందూ పండుగలు) చోటుచేసుకున్నాయి. మొత్తం 11 సంవత్సరాల్లో, సుమారు 150-200 పైగా మతపరమైన విద్వేష ఘటనలు జరిగాయి. ఇవి ముఖ్యంగా శ్రీరామ నవమి, హోలీ, దసరా, గణేష్ చతుర్థి, దీపావళి వంటి హిందూ పండుగల సమయంలో జరిగాయి. వంద మందికి పైగా మరణించగా, వేలాది మందికి గాయాలు అయ్యాయి. హేట్ స్పీచ్ 500 శాతం పెరిగింది. గోవు సంబంధిత హింసలో 44 మరణాలు సంభవించాయి. ఇవి ప్రధానంగా ముస్లింలపై దాడులు, రాళ్ళు రువ్వడం, లూటీ, ముస్లింల ఆస్తుల విధ్వంసం ఉన్నాయి. ముస్లింలు, క్రైస్తవులు ప్రధాన బాధితులు, బిజెపి పాలిత రాష్ట్రాల్లో 80 శాతం పైగా సంఘటనలు జరిగాయి.

మన దేశంలో పండుగలు ఎంతో సుహృద్భావ, సహోదర భావంతో జరుగుతాయి. గతంలో ఎప్పుడూ పండుగలలో ఇటువంటి దుర్ఘటనలు జరగలేదు. బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాతే ఇటువంటివి జరుగుతున్నాయి. పండుగలు సమాజ ఐక్యత, శాంతి, సామాజిక సంస్కరణలను ప్రోత్సహించే అవకాశాలుగా మారాలి. ప్రజాతంత్ర వాదులు, లౌకిక పార్టీలు, ఇతర రాజకీయ పార్టీలు పండుగలలో జోక్యం చేసుకోవాలి. విద్వేషాన్ని నిలువరించాలి. అన్ని మతాలు, కులాల వారిని కలిపేలా నిర్వహించాలి. సమాజ సేవా కార్యక్రమాలు (ఆహార దానం, పరిశుభ్రత), అన్నిమతాల పండుగలలో పాల్గొనడం, ఊరేగింపులు, నాటకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం, సోషల్ మీడియా ద్వారా తమ శ్రేణులకు శాంతి సందేశాలు వ్యాప్తి చేయాలని చెప్పడం వంటి కార్యకలాపాల ద్వారా పండుగల నిజమైన స్ఫూర్తిని నింపి...విద్వేషాలను అడ్డుకోవచ్చు.

/ వ్యాసకర్త సెల్: 9492348428 /

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com

లడఖ్ ప్రజలకు మోడీ మోసం

- ఇప్పటికైనా చర్చలు జరపండి: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ : లడఖ్ ప్రజలతో చర్చలు జరపాలని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మంగళవారం డిమాండ్ చేశారు. హింసా రాజకీయాలను ఆపాలని విన్నవించారు. ఇటీవల లేహ్‌లో నలుగురు ప్రాణాలను బలిగొన్న హింసపై న్యాయపరమైన విచారణను జరిపించాలన్నారు. కాల్పుల్లో మరణించిన బాధితుల్లో ఒకరు సైనికుల కుటుంబానికి చెందినవారని రాహుల్ తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. "తండ్రి సైనికుడు, కొడుకు కూడా సైనికుడే – వారి రక్తం దేశభక్తితో ప్రవహిస్తుంది. అయినప్పటికీ, లడఖ్‌తోపాటు హక్కుల కోసం నిలబడినందుకు బీజేపీ ప్రభుత్వం దేశ ధైర్యవంతుడైన కొడుకును కాల్చి చంపింది. తండ్రి బాధపడ్డ కండ్ల ఒకే ఒక ప్రశ్న అడుగుతున్నాయి . ఈ రోజు దేశానికి సేవ చేసినందుకు లభించే ప్రతిఫలమా?" అని రాహుల్ గాంధీ సోషల్ మీడియాలో విమర్శించారు. "లడఖ్‌లో జరిగిన హత్యలపై న్యాయ విచారణ జరగాలి. దోషులకు సాధ్యమైనంత కఠినమైన శిక్ష విధించాలి అనేది మా డిమాండ్. మోడీ జీ, మీరు లడఖ్? ప్రజలను మోసం చేశారు" అని రాహుల్ ఆరోపించారు. లడఖ్ ప్రజలు తమ హక్కులను డిమాండ్ చేస్తున్నారని, అందుకో వారితో చర్చించాలని కోరారు. హింస, భయ రాజకీయాలు ఆపాలని అన్నారు.

నా జీవితంలో ఎన్నడూ ఇంత బాధ పడలేదు

- కరూరు ఘటనపై విజయ్ వీడియో సందేశం

చెన్నై: కరూర్‌లో జరిగిన తొక్కిసలాట ఘటనతో తన హృదయం పూర్తిగా బాధతో నిండిపోయిందని టివికె అధినేత, నటుడు విజయ్ అన్నారు. తన జీవితంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి ఎదుర్కోలేదన్నారు. కరూర్ తొక్కిసలాట ఘటనపై టివికె అధినేత, నటుడు విజయ్ తొలిసారి స్పందించారు. ఈ మేరకు మంగళవారం ఓ వీడియో విడుదల చేశారు. ఈ ఘటనలో తమ తప్పిదమేమీ లేకపోయినా డిఎంకె ప్రభుత్వం తమపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిందని ఆయన విమర్శించారు. స్టాలిన్ ప్రభుత్వానికి ప్రతీకార వాంఛ ఉంటే తనను ఏమైనా చేసుకోవచ్చున్నారు. తమ పార్టీ నేతలను లక్ష్యంగా చేసుకోవద్దని ప్రభుత్వాన్ని కోరారు. కరూర్ జిల్లాకు చెందిన టివికె నేతలపై పోలీసులు కేసులు పెట్టిన నేపథ్యంలో విజయ్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'సిఎం సార్..మీరు నాపై కక్ష తీర్చుకోవాలంటే..నన్ను ఏదైనా చేయండి. నేను ఇంట్లో కానీ..ఆఫీసులో కానీ ఉంటాను. నా ప్రజల జోలికి వెళ్లకండి' అని విజయ్ తన వీడియో సందేశంలో పేర్కొన్నారు. అయితే విజయ్ వీడియో సందేశంపై అధికార డిఎంకె తీవ్రంగా స్పందించింది. ఒక వీడియో సందేశమివ్వడానికి నాలుగు రోజులు సమయం పట్టిందా అని ప్రశ్నించింది. 'ఇదంతా రాసుకొచ్చి మాట్లాడుతున్నారు.. ఒక వీడియో విడుదల చేయడానికి నాలుగు రోజులు పట్టిందా' అని డిఎంకె అధికార ప్రతినిధి ఎ శరవణన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలు ఉల్లంఘించినందున మరణాలకు విజయ్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

హెచ్1బి వీసాలు లాటరీ వంటివి

- ఫిబ్రవరి నాటికి గణనీయ మార్పులు
- అమెరికా వాణిజ్య మంత్రి లుట్నిక్

న్యూయార్క్ : అమెరికాలో పనిచేయడానికి వృత్తి నిపుణులకు జారీ చేసే హెచ్1బి వీసాలు 'లాటరీ' వంటివని అమెరికా వాణిజ్య మంత్రి హోవర్డ్ లుట్నిక్ వ్యాఖ్యానించారు. దాని ద్వారా నిపుణులైన ఉద్యోగులను దేశానికి ఎందుకు రప్పించుకోవాలని ఆయన ప్రశ్నించారు. దానిలో అర్థమేలేదని అన్నారు. వచ్చే సంవత్సరం ఫిబ్రవరికి ముందు హెచ్1బి వీసా ప్రక్రియలో గణనీయమైన మార్పులు జరుగుతాయని చెప్పారు. చౌకగా లభించే టెక్ కన్సల్టెంట్లు అమెరికాకు వచ్చి వారి కుటుంబాలను కూడా తీసుకురావాలని అనుకోవడం తప్పని న్యూస్ నేషన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. 'వీసా ప్రక్రియలో అనేక రకాల మార్పులు జరగబోతున్నాయి. వారు మార్పుల గురించి మాట్లాడుతుంటారు. లాటరీ ఎలా పొందాలి అని. అయితే అది ఇప్పటికీ లాటరీగానే ఉండిపోవాలా? అదంతా ఫిబ్రవరి నాటికి పరిష్కారం అవుతుంది' అని అన్నారు. అమెరికాకు వచ్చే నిపుణుల కోసం లాటరీ తీయడం వింత అని టెక్ కంపెనీల అధిపతులు తనతో అన్నారని లుట్నిక్ చెప్పారు. నిపుణులను లాటరీ ద్వారా ఎందుకు దేశంలోకి తెచ్చుకోవాలని ఆయన ప్రశ్నించారు. వీసాలు 7–10 రెట్లు అధికంగా సబ్‌స్క్రైబ్ అయ్యాయని, అందులో 74 శాతం టెక్ కన్సల్టెంట్లేనని అన్నారు. హెచ్1బీ వీసాలు టెక్ కన్సల్టెంట్ల కోసమా అని ప్రశ్నించారు. విద్యావేత్తలు, వైద్యులకు కేవలం నాలుగు శాతం వీసాలు మాత్రమే ఉన్నాయని గుర్తు చేశారు. అత్యంత నిపుణత కలిగిన వారికే నైపుణ్య ఉద్యోగాలు ఇవ్వాలని చెప్పారు. చౌకగా వచ్చే టెక్ కన్సల్టెంట్లు ఎందుకని లుట్నిక్ అన్నారు.

బీహార్‌లో తుది ఓటరు జాబితా విడుదల

- వారం రోజుల్లో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్

పాట్నా: బీహార్‌లో అనేక వివాదాలకు నెలవుగా మారిన ఓటరు జాబితా ప్రత్యేక సవరణను పూర్తి చేసిన ఎన్నికల సంఘం తుది ఓటరు జాబితాను ప్రకటించింది. ఎస్ఐఆర్ డ్రాఫ్ట్ జాబితాపై వచ్చిన అన్ని అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని ఈ జాబితాను తయారు చేసినట్టు తెలిపింది. బీహార్‌లో ప్రధాన ఎన్నికల అధికారి తన సోషల్ మీడియాలో ఈ ప్రకటన చేశారు. ప్రజలు తమ పేర్లను voters.eci.gov.in లింక్‌పై క్లిక్ చేసి చూసుకోవచ్చుని తెలిపారు.

త్వరలోనే ఎన్నికల షెడ్యూల్?

బీహార్ ఓటరు తుది జాబితా ప్రకటించడంతో వచ్చేవారం బీహార్ శాసనసభ ఎన్నికల షెడ్యూలును కూడా ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. అక్టోబర్ చివరలో ఛట్ పండగ తర్వాత తొలిదశ ఎన్నికలు నిర్వహించనున్నట్టు సమాచారం. బీహార్ ఎన్నికలతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాల్లో జరగనున్న ఉప ఎన్నికల కోసం ఈసీ 470 మంది పరిశీలకుల్ని నియమించింది. వచ్చేనెల 3న సాధారణ, పోలీసు, వ్యయ పరిశీలకుల వివరాలపై ప్రకటన వెలువడుతుందని అధికారిక వర్గాలు వెల్లడించాయి.

భారీగా ఓటర్ల తొలగింపు

ఎస్ఐఆర్ ప్రక్రియ తరువాత ఎలక్షన్ కమిషన్ బీహార్



ఓటర్ల జాబితాలో చాలా సవరణలు చేసింది. పెద్ద సంఖ్యలో ఓటర్ల తొలగించింది. ముసాయిదా జాబితా ప్రకారం, ఎస్ఐఆర్ ప్రక్రియకు ముందు బీహార్‌లో 7.89 కోట్ల మంది ఓటర్లు ఉంటే, అందులో 65.63 లక్షల మంది ఓటర్లను తొలగించింది. వీరిలో మరణించిన, నకిలీ పత్రాలు సమర్పించిన వారు ఉన్నట్లు పేర్కొంది. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్ల చిరునామాలను నవీకరించినట్టు తెలిపింది. ఎస్ఐఆర్ ప్రక్రియ కింద కొత్త ఓటర్ల పేర్లను కూడా ఓటరు లిస్ట్‌లో చేర్చినట్టు స్పష్టం చేసింది. ఆగస్టు 1 నుంచి సెప్టెంబర్ 1 మధ్య ఏకంగా 16.56 లక్షలకు పైగా యువత కొత్తగా ఓటర్ రిజిస్ట్రేషన్ కోసం ఫారం–6ను సమర్పించారు.

ఎన్నికల కమిషన్ అక్టోబర్ 4–5 తేదీల్లో బీహార్‌ను సందర్శించనుంది.ఆ తర్వాత ఏ క్షణంలోనైనా బీహార్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించవచ్చని తెలుస్తోంది. బీహార్ శాసనసభ పదవీకాలం 2025 నవంబర్ 22న ముగియనుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని 246 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

వేడెక్కుతున్న రాజకీయం

ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో బీహార్‌లో రాజకీయం వేడెక్కుతోంది. కాంగ్రెస్, ఆర్‌జెడిలతో కూడిన మహాఘట్ బంధన్, బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నాయి. 1990వ దశకం నుంచి అక్కడి రాజకీయ పటంలో కనిపించకుండా పోయిన కాంగ్రెస్ పార్టీ మళ్లీ పట్టు సాధించేందుకు యత్నిస్తోంది. పూర్వ వైభవాన్ని తిరిగి సాధించేందుకు శ్రమిస్తోంది. అగ్రనేతల యాత్రలతో ఓటర్లకు చేరువయ్యేందుకు ప్రయత్నిస్తోంది. ఇప్పటికే బీహార్‌లోని 80 స్థానాలకు కాంగ్రెస్ తన అభ్యర్థులను ఖరారు చేసింది. మరోవైపు అధికారంలో ఉన్న నితీశ్ కుమార్ కూడా తాయిలాల మోతతో ఓటర్లను ఆకట్టుకునే పనిలోపడ్డారు. ప్రధాని మోడీ కూడా బీహార్‌పై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. మరోవైపు 2020 ఎన్నికల్లో సాధించిన విజయాన్ని రిపీట్ చేయాలని బీజేపీ బీటీమ్ మజ్లిస్ కూడా భావిస్తోంది. ఇక ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జన్ సురాజ్ పార్టీ కూడా బరిలో ఉంది. ప్రశాంత్ కిశోర్ ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేసిన విషయం తెలిసిందే. దీనితో ఈసారి పార్టీల మధ్య పోటీ తీవ్రంగా ఉండే అవకాశం కనిపిస్తోంది.

లండన్‌లో గాంధీజీ విగ్రహంపై జాత్యహంకార రాతలు

- తీవ్రంగా ఖండించిన భారత్

లండన్ : బ్రిటన్ రాజధాని లండన్‌లోని చారిత్రక టావీస్టాక్ స్క్వేర్‌లో దారుణం జరిగింది. ఆ ప్రఖ్యాత కూడలిలో ఉన్న భారత జాతిపిత మహాత్మాగాంధీ కాంస్య విగ్రహంపై గుర్తు తెలియని వ్యక్తులు పిచ్చిరాతలు రాశారు. జాత్యహంకారంతోనే ఇలాంటి పిచ్చిరాతలు రాసివుంటారని భావిస్తున్నారు. మహాత్ముడి విగ్రహంపై అసభ్య వ్యాఖ్యలతో కూడిన రాతలున్న ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ దుశ్చర్యను లండన్‌లోని భారత హైకమిషన్ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఒక పోస్ట్ చేసింది.

గాంధీజీ జయంతి (అక్టోబరు 2)ని అంతర్జాతీయ అహింసా దినంగా జరుపుకుంటారని, దీనికి సరిగ్గా మూడు రోజుల ముందు ఈ దారుణం జరగడం బాధాకరమని భారత హైకమిషన్ పేర్కొంది. దీన్ని అహింసా వాదంపై జరిగిన హింసాత్మక దాడిగా అభివర్ణించింది. ఈ ఘటన వార్త విని తాము విచారానికి గురయ్యామని తెలిపింది. దీని సమాచారాన్ని వెంటనే స్థానిక అధికార యంత్రాంగానికి చేరవేశామని వెల్లడించింది. గాంధీజీ విగ్రహాన్ని త్వరితగతిన పునరుద్ధరించే అంశంపై సంబంధిత అధికార విభాగంతో సమన్వయం చేసుకుంటున్నామని చెప్పింది.

దర్యాప్తు చేస్తున్నాం : అధికారులు

ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని, పూర్తి వివరాలను సేకరించడంపై ఫోకస్ పెట్టామని లండన్ మెట్రోపాలిటన్ పోలీస్, నగర పాలక సంస్థ (క్యామ్‌డెన్ కౌన్సిల్) అధికారులు వెల్లడించారు. ఈ ఏడాది ఆరంభంలో భారత విదేశాంగ



లండన్‌లోని టావీస్టాక్ స్క్వేర్‌లో గాంధీజీ విగ్రహం (ఫైల్)

మంత్రి ఎస్ జైశంకర్ లండన్‌లో పర్యటించారు. ఆ సందర్భంగా ఆయన బస చేసిన హొటల్ వద్ద పలువురు ఖలిస్థానీలు నిరసనకు దిగారు. దాన్ని 'భద్రతా ఉల్లంఘన'గా భారత్ అభివర్ణించింది. ఎస్ జైశంకర్ బస చేసిన హొటల్ వద్దకు నిరసనకారులను అనుమతించడాన్ని తప్పుపట్టింది.

గాంధీ లా చేసిన కాలేజీ సమీపంలో ఏర్పాటు

మహాత్మా గాంధీ ఉన్నత విద్య కోసం 1888 సంవత్సరంలో భారత్ నుంచి లండన్‌కు వెళ్లారు. ఆయన 1888 సంవత్సరం నవంబరు 6న యూనివర్సిటీ కాలేజ్ లండన్(యూసీఎల్)లో లా కోర్సులో చేరారు. భారత చట్టాలపై అక్కడ అధ్యయనం చేశారు. ఈ కాలేజీలో చదువుకున్న ఇతర ప్రముఖుల్లో నోబెల్ గ్రహీత రవీంద్రనాథ్ ఠాగూర్ కూడా ఉన్నారు.

తెలిసినవారే.. చెరబడుతున్నారు..!

- చిన్నారులపై నేరాల్లో ఇవే అధికం
- ఎన్‌సిఆర్‌బి నివేదిక

న్యూఢిల్లీ : అభంశుభం తెలియని చిన్నారులపై వారికి సన్నిహితులైనవారు, బాగా తెలిసినవారే అఘాయిత్యాలకు ఒడిగడుతున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. చిన్నారులపై నేరాలకు నేషనల్ క్రైమ్ బ్యూరో ఆఫ్ రికార్డ్స్ (ఎన్‌సిఆర్‌బి) 2023 నివేదిక వివరాల ప్రకారం.. దేశవ్యాప్తంగా చిన్నారులపై దాడులకు సంబంధించి 1,77,335 కేసులు నమోదయ్యాయి. వీటిల్లో కిడ్నాప్, అత్యాచారం కేసులు ఎక్కువగా ఉన్నాయి. 40,434 కేసుల్లో నేరస్తులు బాధితులకు పరిచయం ఉన్నవారే. 3,224 కేసుల్లో కుటుంబ సభ్యులు, 15,146 కేసుల్లో కుటుంబ స్నేహితులు, ఇరుగుపొరుగువారు, యజమానులు నిందితులుగా ఉన్నారు. 2022తో పోలిస్తే 2023లో చిన్నారులుపై నేరాలు 9.2 శాతం పెరిగాయి. 2022లో 1,62,449 కేసులు నమోదయ్యాయి. 2021లో ఈ కేసుల సంఖ్య 1,49,404గా ఉంది. 2023లో నమోదైన కేసుల్లో అధిక శాతం అంటే 45 శాతం కేసులు (79,884) చిన్నారుల కిడ్నాప్, అపహరణకు సంబంధించినవి కాగా, 38.2 శాతం కేసులు (67,694) పోక్సో చట్టం ప్రకారం నమోదైనవి. అలాగే ఈ కేసుల్లో బాధితుల్లో ఆరేళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్నవారు 762 మంది, ఆరేళ్ల నుంచి 12 ఏళ్ల మధ్య ఉన్న వారు 3,229 మంది, 12 ఏళ్ల నుంచి 16 ఏళ్ల వయస్సు ఉన్న వారు 15,444 మంది, 16 ఏళ్ల నుంచి 18 ఏళ్ల వయస్సు ఉన్న వారు 21,411 మంది ఉన్నారు.

ఒకవైపు మారణకాండ.. మరోవైపు శాంతిసూక్తులు

- 20 సూత్రాలతో 'గాజా శాంతి' ప్రణాళిక
- హమస్ ఒప్పుకోకపోతే ముప్పు తప్పదని ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్ : గాజాలో పాలస్తీనియన్లను లక్ష్యంగా చేసుకుని రెండేళ్లుగా మారణకాండ సాగిస్తున్న ఇజ్రాయిల్‌కు అండదండలు అందిస్తున్న అమెరికా ఇప్పుడు శాంతిసూక్తులు వల్లెవేస్తోంది. 20 సూత్రాలతో 'గాజా శాంతి ప్రణాళిక' అమెరికా అధ్యక్షులు ట్రంప్ వెల్లడించారు. గాజాలో విచక్షణారహిత దాడులకు స్వస్తి పలకడంతో పాటు హమాస్ వద్ద బందీలుగా ఉన్న వారిని విడిపించేందుకు అలాగే భవిష్యత్తులో పాలస్తీనా అధికార యంత్రాంగాన్ని ఏర్పాటు చేసేందుకు ఈ ప్రణాళిక ప్రతిపాదించిందని ట్రంప్ చెప్పారు. శ్వేతసౌధంలో ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూతో సోమవారం చర్చలు జరిపిన అనంతరం ట్రంప్ విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయాలు వెల్లడించారు. దాడులకు ముగింపు పలికినందుకు, మానవతా సాయాన్ని అందించినందుకు, గాజా పునర్నిర్మాణానికి హామీ ఇచ్చినందుకు ప్రతిగా హమాస్ లొంగిపోవాలని ట్రంప్ అన్నారు. ఆయుధాలను కూడా అప్పగించాలన్నారు. ఒకవేళ ఈ ఒప్పందాన్ని తిరస్కరించినట్లైతే సైనిక చర్యను ఎదుర్కోవాల్సి వుంటుందని ట్రంప్ బెదిరింపులకు దిగారు. ఈ ప్రణాళికపై సంతకాలు జరిగిన 72 గంటల్లోగా మిలటరీ ఆపరేషన్ నిలిచిపోతుందని ప్రకటించారు. ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు ఇప్పటికే దీన్ని అంగీకరించారని, హమాస్ కూడా ఒప్పుకోవాల్సిందేనని పేర్కొన్నారు. ఇజ్రాయిల్, హమాస్ మధ్య తక్షణమే ఘర్షణలు ఆగిపోవాలని, గాజా పాలనలో హమాస్‌కు ఎలాంటి పాత్ర ఉండరాదని తెలిపారు. హమాస్

వైట్‌హౌస్‌లో జరిగిన సంయుక్త మీడియా సమావేశంలో డొనాల్డ్ ట్రంప్, నెతన్యాహు

కనుక ఈ ప్రణాళికను తిరస్కరిస్తే దానిని నామరూపాలు లేకుండా తుడిచిపెట్టే విషయంలో నెతన్యాహూకు తమ మద్దతు ఉంటుందని ట్రంప్ చెప్పారు. కాగా హమాస్ ఈ ప్రణాళికను ఆమోదించేందుకు అవకాశాలే లేవని విశ్లేషకులు భావిస్తున్నారు. పైకి చూసేందుకు ఇది శాంతి ఒప్పందంలా కనిపిస్తున్నప్పటికీ పూర్తిగా ఇజ్రాయిల్‌కు అనుకూలంగానూ, హమాస్ లొంగిపోయేందుకు అవసరమైన షరతులతోనూ ఉన్నట్లు పేర్కొంటున్నారు. హమాస్ అంగీకరిస్తుందన్న నమ్మకం లేదని పశ్చిమాసియా వ్యవహారాల నిపుణులు, మాజీ భారత దౌత్యవేత్త తల్మీజ్ అహ్మద్ వ్యాఖ్యానించారు.

పాలస్తీనియన్ల తరలింపు ప్రస్తావన లేదు

కాగా మొట్టమొదటిసారిగా గాజా నుండి పాలస్తీనియన్లను తరలించే ప్రస్తావన ఈ ప్రణాళికలో లేకుండా పోయింది. "ఎవరినీ బలవంతంగా గాజా నుండి పంపిచేది లేదు. ఒకవేళ ఎవరైనా వెళ్ళాలనుకున్నా వారు వెళ్లవచ్చు, కావాలనుకుంటే తిరిగి రావచ్చు. ఇక్కడ వుండేలానే ప్రజలను ప్రోత్సహిస్తాం. మరింత మెరుగైన గాజా పునర్నిర్మాణానికి అవకాశాలు కూడా అందచేస్తాం." అని ఆ డాక్యుమెంట్ పేర్కొంది.

దీర్ఘకాలంలో పాలస్తీనాకు రాజ్య హోదా

ఇప్పుడు కాకపోయినా ఏదో ఒక దశలో పాలస్తీనాకు రాజ్య హోదా ఇవ్వాలని ప్రణాళిక సూచించింది. అయితే ఇది దీర్ఘకాలిక లక్ష్యంగానే వుంది. ప్రస్తుతానికి గాజా నగరం అంతర్జాతీయ సమాజం అధీనంలో ఉంటుంది. అంతర్జాతీయ భద్రతా దళం అక్కడి భద్రతా వ్యవహారాలను పర్యవేక్షిస్తుంది. ట్రంప్‌తో పాటు బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ నేతృత్వంలో 'శాంతి బోర్డు'ను ఏర్పాటు చేస్తారు. ఇది పాలనా వ్యవహారాలను, పునర్నిర్మాణ పనులను చూస్తుంటుంది. ఇజ్రాయిల్ దళాలు ఆ ప్రాంత పరిసరాలలో మోహరిస్తాయి. కాగా ఈ ప్రణాళికపై తమకు అంగీకారం కుదిరిందని ట్రంప్, నెతన్యాహూ ధృవీకరించారు. అయితే నెతన్యాహూ వైఖరితో ప్రణాళికలోని ఓ భాగం విభేదించింది. గాజాపై అధికారం చివరికి పాలస్తీనా అథారిటీదేనని ప్రణాళిక తేల్చి చెప్పింది. నెతన్యాహూ, ఆయన ప్రభుత్వం పాలస్తీనాకు రాజ్య హోదా ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే.

కలపపై 10 శాతం... ఫర్నీచర్‌పై 25 శాతం

కొనసాగుతున్న ట్రంప్ టారిఫోన్మాదం

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ తన టారిఫోన్మాదాన్ని కొనసాగిస్తూనేవున్నారు. తాజాగా వాణిజ్య భాగస్వాములపై కలప, కలప ఉత్పత్తులపై సుంకాలు విధించారు. దిగుమతి చేసుకున్న కలప, టింబర్, కిచెన్ కేబినెట్, ఫర్నీచర్ దిగుమతులపై విధించిన సుంకాల కారణంగా భవన నిర్మాణ సామగ్రి, ఇంటీరియల్ డెకరేషన్ ఖర్చులు పెరగబోతున్నాయి. ఇప్పటికే వీటి ధరలు బాగా పెరిగిపోయాయి. భవన నిర్మాణ సామగ్రిలో ఎక్కువగా ఉపయోగించే విదేశీ కలప, టింబర్‌పై పది శాతం టారిఫ్ విధించారు. అలాగే కిచెన్ కేబినెట్లు, వానిటీలు, మృదువుగా ఉండే చెక్క ఫర్నీచర్‌పై పాతిక శాతం టారిఫ్ విధిస్తున్నట్లు కూడా ట్రంప్ ప్రకటించారు. ఈ రేట్లు అక్టోబర్ 14వ తేదీ నుంచి అమలులోకి వస్తాయి. తాజాగా విధించిన సుంకాలతో కేబినెట్లపై టారిఫ్ 50 శాతానికి, మృదువైన ఫర్నీచర్‌పై 30 శాతానికి పెరుగుతుంది. నూతన టారిఫ్‌లపై ట్రంప్ తన ట్రూత్ సోషల్‌లో పోస్ట్ పెట్టారు.

అమెరికాలోని స్థానిక పరిశ్రమలకు ఊతమిచ్చేందుకు, దేశ భద్రతకు మద్దతు తెలిపేందుకు విదేశీ కలపపై సుంకాలు విధించానని ట్రంప్ ఆ పోస్టులో వివరించారు. తన నిర్ణయాన్ని ఆయన సమర్థించుకుంటూ దీంతో సరఫరా వ్యవస్థ బలోపేతం అవుతుందని, పారిశ్రామిక సామర్థ్యం ఇనుమడిస్తుందని, అత్యంత నాణ్యమైన ఉద్యోగాలు లభిస్తాయని, కలప ఉత్పత్తుల దేశీయ వినియోగ సామర్థ్యం పెరుగుతుందని చెప్పుకొచ్చారు. తన చర్య దేశీయ వినియోగాన్ని పూర్తిగా సంతృప్తి పరుస్తుందని, ఎగుమతులు పెరిగి ఆర్థిక ప్రయోజనాలు చేకూరుతాయని తెలిపారు.

అయితే అమెరికాలో 300 బిలియన్ల చెట్లు ఉన్నప్పటికీ అవి దేశీయ డిమాండును తీర్చలేవని ఆర్థికవేత్తలు, బిల్డర్లు హెచ్చరిస్తున్నారు. కెనడా నుంచి దిగుమతి అవుతున్న కలపపై సుంకాన్ని పెంచితే సంక్షోభం మరింత తీవ్రమవుతుందని వారు తెలిపారు. అమెరికాలో గృహ నిర్మాణానికి కలప చాలా అవసరమన్న విషయం తెలిసిందే. ప్రతి ఏటా దేశం వినియోగిస్తున్న కలపలో 30 శాతం కెనడా నుంచే దిగుమతి అవుతోంది. అయితే అక్కడి నుంచి జరిగే కలప దిగుమతులపై ఇప్పటికే 14.5 శాతం డంపింగ్ నిరోధక సుంకాలు విధిస్తున్నారు. ట్రంప్ విధిస్తున్న వివిధ రకాల సుంకాల కారణంగా గత సంవత్సర కాలంలో ఫర్నీచర్ ధరలు గణనీయంగా పెరిగాయి. గత సంవత్సరం ఆగస్టుతో పోలిస్తే ఈ ఆగస్టు నాటికి ఫర్నీచర్ ధరలు 4.7 శాతం పెరిగాయి. లివింగ్ రూమ్, డైనింగ్ రూమ్ ఫర్నీచర్ ధరలు అయితే 9.5 శాతం పెరిగాయి. కెనడాతో పాటు వియత్నాం నుంచి కూడా అమెరికాకు కలప సరఫరా అవుతోంది. వియత్నాం నుంచి జరుగుతున్న దిగుమతులపై కూడా ట్రంప్ సుంకాలు పెంచేశారు.

అమెరికాలో షట్‌డౌన్ తప్పదా?

వాషింగ్టన్ : అమెరికా ప్రభుత్వం ఏడు సంవత్సరాల తర్వాత తొలిసారిగా ఆర్థిక సంక్షోభంలో చిక్కుకు పోనుంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వినాశకర విధానాల వల్ల అన్ని రంగాల్లోనూ అస్తవ్యస్థ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆర్థిక కార్యకలాపాలన్నీ స్తంభించే పరిస్థితి నెలకొంది. దీనిని నివారించా లంటే వ్యయ బిల్లుపై ప్రతిపక్ష డెమొక్రాట్లతో రిపబ్లికన్ పార్టీ చేతులు కలపాల్సి ఉంటుంది. లేకుంటే అన్నీ కాక పోయినా కొన్ని ప్రభుత్వ సేవలైనా తాత్కాలికంగా నిలిచి పోతాయి. బడ్జెట్‌పై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య విభేదాలు అమెరికాలో సహజమే అయినప్పటికీ వ్యయ బిల్లు విషయంలో తలెత్తిన విభేదాలు ఉద్రిక్తతకు దారితీశాయి.

షట్‌డౌన్ అంటే...

అక్టోబరులో, ఆ తర్వాత ప్రభుత్వ సేవలకు నిధుల కేటాయింపునకు సంబంధించిన బిల్లుపై అధికార ప్రతిపక్ష పార్టీలు ఒకే తాటిపైకి రానిపక్షంలో ఆర్థిక పరిస్థితి సంక్లిష్టమవుతుంది. బిల్లుపై అమెరికా ప్రతినిధి సభ ఏకాభిప్రాయానికి రాకపోతే అది చర్యలు తీసుకునే వరకూ ప్రభుత్వ సంస్థలు అన్ని రకాల నిధుల విడుదలను నిలిపివేయాల్సి ఉంటుంది. దీనినే 'ప్రభుత్వ షట్‌డౌన్' అంటారు. ఈ సమస్య ఎదురైతే కొన్ని ప్రభుత్వ సేవలు నిలిచిపోతాయి. ఉద్యోగ నియామకాలు ఆగిపోతాయి. కొందరు ఉద్యోగులను తొలగించే అవకాశం కూడా ఉంది. గతంలో షట్‌డౌన్ పరిస్థితులు ఎదురైనప్పటికీ వాటితో పోలిస్తే ఇది కఠినమైనదని శ్వేతసౌధం చెబుతోంది. ప్రభుత్వ పరిమాణం తగ్గుతుందని, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో బయటికి వచ్చే అవకాశం ఉన్నదని అంటున్నారు.



పోలీసు బలగాల పహారాలో బుల్డోజ్‌తో మహ్మద్ షాహిద్ రాయ్ నివాసాన్ని కూల్చేస్తున్న దృశ్యం

యుపిలో బుల్డోజ్‌రాజ్ దారుణాలు

- 'పద్మశ్రీ' గ్రహీత ఇల్లు కూల్చివేత
- తీవ్రంగా ఖండించిన ప్రతిపక్షాలు

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం బుల్డోజర్లతోనే పాలన సాగిస్తోంది. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. అక్రమ కట్టడాల ముద్ర వేసి సాగిస్తున్న కూల్చివేత ఘటనలకు అంతూపొంతూ లేకుండా పోతోంది. ఈ క్రమంలోనే పద్మశ్రీ పురస్కార గ్రహీత ఇల్లును సైతం కూల్చిపారేసింది. స్థానికుల కథనం ప్రకారం..భారత మువ్వన్నెల పతాకాన్ని విశ్వ క్రీడా వేదికలపై సమోన్నంతంగా నిలిపిన ఒలింపియన్, మాజీ హాకీ క్రీడాకారుడు, కీర్తిశేషులైన మహమ్మద్ షాహిద్‌రాయ్ ఇంటిని వారణాసి అధికారులు అక్రమంగా తేల్చి బుల్డోజర్లతో కూలగొట్టారు. పద్మశ్రీ పురస్కారం కూడా అందుకున్న షాహిద్ నివాసాన్ని కూల్చివేయడం పట్ల సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇదేనా డబుల్ ఇంజిన్ అభివృద్ధి అంటూ అధికార బిజెపిని నిలదీస్తున్నాయి.

1980 ఒలింపిక్స్‌లో భారత్ స్వర్ణపతకం సాధించిన జట్టులో షాహిద్‌రాయ్ సభ్యులు. 2016లో ఆయన మతి చెందారు. కాగా షాహిద్ పూర్వీకుల ఇల్లు కచేరీ–సంధహా మార్గంలో ఉంది. రోడ్డు విస్తరణ పేరుతో ఆ ఇంటిని అధికారులు బుల్డోజర్లతో కూల్చివేశారు. దీనిపై రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు అజయ్‌రాయ్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'పద్మశ్రీ మహమ్మద్ షాహిద్‌రాయ్ నివాసం అంటే అది కేవలం ఒక ఇల్లు కాదు..దేశ క్రీడా వారసత్వానికి నిదర్శనం. అలాంటి వారసత్వ సంపదనే కూలగొట్టారంటే ఇంతకన్నా బరితెగింపు ఏముంటుంది' అని ఆయన ప్రశ్నించారు. కాశీలోని ప్రముఖులను అవమానిస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని ప్రజలు క్షమించరు అని పేర్కొన్నారు. ఆజాద్ సమాజ్ పార్టీ చీఫ్, ఎంపీ చంద్రశేఖర్ ఆజాద్ కూడా బిజెపి ప్రభుత్వ తీరును తీవ్రంగా నిరసించారు. బిజెపి బుల్డోజర్ ప్రభుత్వానికి మానవత్వం, దేశ వీరులపై గౌరవం లేవంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆర్‌ఎస్‌ఎస్ ఆహ్వానాన్ని తిరస్కరించిన సిజెఐ మాతృమూర్తి కమల్ తాయి

- అంబేద్కర్‌వాదిగా తాను రాలేనని స్పష్టీకరణ

ముంబయి : విజయదశమిని, అలాగే సంస్థ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ మాతృమూర్తి కమల్‌తాయిని ఆర్‌ఎస్‌ఎస్ ఆహ్వానించినట్లు వార్తలు వెలువడిన మరుసటి రోజు కమల్‌తాయి ఆ ఆహ్వానాన్ని తిరస్కరించారు. ఈ మేరకు ఆమె స్వయంగా లేఖ రాశారు. తాను అంబేద్కర్ విలువలను, భావాలను ధృఢంగా విశ్వసిస్తానని, అందువల్ల తాను ఈ కార్యక్రమానికి హాజరు కాబోనని ఆమె ఆ లేఖలో స్పష్టం చేశారు. కమల్‌తాయి ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమానికి హాజరవుతారని అనేక వార్తా చానళ్ళు పేర్కొన్నాయి. అయితే వాటిని ఆమె తన లేఖలో ఖండించారు. ఇదంతా ఒక కుట్రగా ఆమె అభివర్ణించారు. ఆర్‌ఎస్‌ఎస్ వ్యాప్తి చేసిన ఈ వార్త పూర్తిగా తప్పుడు వార్త అని స్పష్టం చేశారు.

అయితే ఆ లేఖ కమల్‌తాయినే విడుదల చేశారా లేదా అనే అంశాన్ని వైర్ ధృవీకరించలేదు. ఈ నెల 5న మహారాష్ట్రంలోని అమరావతిలో కిరణ్ నగర్ ప్రాంతంలో శ్రీమతి నరసమ్మ మహా విద్యాలయ మైదాన్‌లో జరిగే ఆర్‌ఎస్‌ఎస్ అమరావతి మహానగర్ శాఖ నిర్వహించే కార్యక్రమానికి కమల్‌తాయి ముఖ్య అతిథిగా ఆహ్వానించారని, ఆమె హాజరు కావడానికి కూడా అంగీకరించారని అంతకుముందు గవాయ్ సోదరుడు రాజేంద్ర గవాయ్ మీడియాతో చెప్పారు. రాజేంద్ర గవాయ్ రాజకీయవేత్త, డాక్టర్ కూడా. అయితే తాజాగా తన తల్లి తీసుకున్న నిర్ణయాన్ని కూడా ఆయన సమర్థించారు. తన తల్లి వెళ్లినా, వెళ్లకపోయినా ఏదైనా ఆమె స్వంత నిర్ణయమని, దాన్ని తాను సమర్థిస్తానని చెప్పారు. వ్యక్తిగత సంబంధాలు రాజకీయ అభిప్రాయాలను గందరగోళంలో పడేయరాదని వ్యాఖ్యానించారు. పార్టీలకతీతంగా తన తండ్రి రాజకీయ నేతలందరితో కలివిడిగా వ్యవహరించేవారని, ఇందిర, వాజ్‌పేయి సహా పలువురితో మాట్లాడేవారని, వివిధ కార్యక్రమాలకు హాజరయ్యే వారని, అంత మాత్రాన ఆయన రాజకీయ అభిప్రాయాల విషయంలో రాజీ పడేవారు కాదని చెప్పారు.

బిజెపి సీనియర్ నాయకులు మల్హోత్రా మృతి

న్యూఢిల్లీ : బిజెపి సీనియర్ నాయకులు విజయ్‌కుమార్ మల్హోత్రా (93) మంగళవారం మృతి చెందారు. ఢిల్లీలోని తన నివాసంలో ఆయన తుదిశ్వాస విడిచారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తదితరులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఢిల్లీలో బిజెపి విస్తరణకు మల్హోత్రా ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా, ఐదు సార్లు ఎంపిగా ఎన్నికయ్యారు. రెండు సార్లు బిజెపి ఢిల్లీ అధ్యక్షునిగా పనిచేశారు. 1999 లోక్‌సభ ఎన్నికల్లో మన్మోహన్ సింగ్‌పై విజయం సాధించారు.

రాష్ట్ర హోదా కోసం రాజీపడలేను

- ఒమర్ అబ్దుల్లా

శ్రీనగర్ : జమ్మూ కాశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతానికి రాష్ట్ర హోదా పునరుద్ధరణ కోసం తాను బిజెపి కూటమిలో చేరేది లేదని, దానికన్నా రాజీనామా చేయడం మంచిదని జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మంగళవారం స్పష్టం చేశారు. అనంతనాగ్ జిల్లాలో ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర హోదా కోసం తాను ఏ రకంగానూ రాజకీయంగా రాజీ పడేందుకు సిద్ధంగా లేనని చెప్పారు. "ఒకవేళ మీరు (ప్రజలు) సిద్ధంగా వున్నారనుకుంటే, నాకు చెప్పండి, ఎందుకంటే ఆ బేరసారాలకు నేను సిద్ధంగా లేను. కాబట్టి బిజెపి ప్రభుత్వంలో చేరడం అవసరమైనట్లైతే ముందుగా నా రాజీనామాను ఆమోదించండి, ఆ తర్వాత ఏ ఎంఎల్ఎనైనా ముఖ్యమంత్రిగా చేసుకుని బిజెపితో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయండి.' అని ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. ఒకవేళ తాను బిజెపి ప్రభుత్వంలో చేరితే బహుశా రాష్ట్ర హోదా త్వరగా పునరుద్ధరించబడుతుందేమోనని అన్నారు. మనం చేరితే మనకు ఒక బహుమతి ఇవ్వొచ్చు, అది రాష్ట్ర హోదా పునరుద్ధరణ కావచ్చునన్నారు.

వాతావరణ సదస్సు కోసమే వాంగ్‌చుక్ పాక్ పర్యటన

న్యూఢిల్లీ : లఢాఖ్‌లో చెలరేగిన హింసకు కారకుడన్న ఆరోపణపై పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్‌ను పోలీసులు ఎన్ఎస్ఏ కింద అరెస్ట్ చేసి రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ జైలుకు తరలించిన విషయం తెలిసిందే. ఫిబ్రవరిలో వాంగ్‌చుక్ పాకిస్తాన్‌లో జరిపిన పర్యటనపై ఆరా తీస్తున్నామని పోలీసులు తెలిపారు. అలా పర్యటించడం నేరమని వారి అభిప్రాయం. అయితే వాంగ్‌చుక్ పాకిస్తాన్ ఎందుకు వెళ్లారంటే...పాక్‌లోని ప్రముఖ మీడియా సంస్థల్లో ఒకటైన డాన్ గ్రూప్ ఓ సదస్సును ఏర్పాటు చేసి ఆయన్ని ఆహ్వానించింది. వాతావరణ మార్పులను ఎలా ఎదుర్కోవాలన్న విషయంపై చర్చించడానికి ఈ సదస్సును ఏర్పాటు చేశారు. వాతావరణ మార్పులపై అవగాహన కలిగించడానికి డాన్ సంస్థ దక్షిణాసియా ప్రాజెక్టును చేపట్టింది. వచ్చే ఏడాది కూడా మరో సదస్సును నిర్వహించి సంప్రదింపులను కొనసాగించాలని డాన్ యోచిస్తోంది. దక్షిణాసియాలోని దేశాలు వాతావరణ మార్పుల కారణంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఆఫ్ఘనిస్తాన్‌లో ఐక్యరాజ్యసమితి సమన్వయకర్తగా వ్యవహరిస్తున్న ఇంద్రికా రట్వట్టే అధ్యక్షతన సదస్సులో జరిగిన చర్చలో వాంగ్‌చుక్ పాల్గొని ప్రసంగించారు. లద్దాఖ్‌లో ఐస్ టవర్స్ గురించి ఆయన మాట్లాడారు. అక్కడ వాంగ్‌చుక్ గురించి పెద్దగా ఎవరికీ తెలియదు. పర్యావరణ కార్యకర్తగా మాత్రమే ఆయనను పరిచయం చేశారు. ఆయన రాజకీయ కార్యకలాపాలు లేదా నిరాహార దీక్షల గురించిన ప్రస్తావనే రాలేదు. ఇది వాతావరణ మార్పులకు సంబంధించిన సదస్సు మాత్రమేనని, వాంగ్‌చుక్ నిర్వహిస్తున్న ఇతర కార్యకలాపాలను చెప్పాల్సిన అవసరమేమీ లేదని నిర్వాహకులు తెలిపారు.

అణు బ్లాక్ మెయిల్‌కు భారత్ భయపడదు

- సిడిఎస్ అనిల్ చౌహాన్

న్యూఢిల్లీ : భవిష్యత్తులో యుద్ధాల స్వభావం పూర్తిగా మారిపోనుందని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ అన్నారు. అణు బెదిరింపులు, రేడియో ధార్మిక పదార్థాల ప్రయోగాలు వంటి వాటిని రాబోయే రోజుల్లో ప్రపంచదేశాలు యుద్ధతంత్రాలుగా వినియోగించే ప్రమాదముందన్నారు. అలాంటివాటిని ఎదుర్కోవాలంటే అణ్వాయుధాల నుంచి వచ్చే రేడియో ధార్మిక కాలుష్యంతో డీల్ చేయడంపై భారత్‌లో శిక్షణనివ్వాల్సిన అవసరముందని అభిప్రాయం వ్యక్తంచేశారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో భారత్ అప్రమత్తంగా ఉండాలన్నారు. మిలిటరీ నర్సింగ్ సర్వీసెస్ 100 ఏళ్ల ఆవిర్భావ దినోత్సవంలో ప్రసంగిస్తూ.. ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

భవిష్యత్తులో ఇతరదేశాల నుంచి వచ్చే అణు బెదిరింపులకు వ్యతిరేకంగా పోరాడాలంటే భారత్ అన్నిరకాలుగా సిద్ధంగా ఉండాలని అనిల్ చౌహాన్ అన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో కూడా ప్రధాని మోదీ తమతో మాట్లాడుతూ.. భారత్ అణు బెదిరింపులకు ఎన్నడూ భయపడకూడదని చెప్పినట్లు అనిల్‌చౌహాన్ తెలిపారు. 1926లో స్థాపించిన మిలిటరీ నర్సింగ్ సర్వీస్ వందేళ్లుగా దేశ సైన్యానికి అందిస్తున్న సేవలను అనిల్ చౌహాన్ కొనియాడారు.

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణపై వైసిపి నిరసన

- అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను టిడిపి కూటమి ప్రభుత్వం తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ వైసిపి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించి, అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేశారు. ఏలూరు జిల్లాలో ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్ ఆధ్వర్యంలో ఏలూరు పాత బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. భీమవరం జిల్లా పెనుమంట్రలో వైసిపి ఆచంట నియోజకవర్గ ఎస్‌సి సెల్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం మార్టేరు సెంటర్‌లోని డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. నరసాపురం అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. కడప, అన్నమయ్య జిల్లా కేంద్రాల్లోని అంబేద్కర్ విగ్రహాల ఎదుట నిరసన తెలిపారు. కర్నూలు జిల్లా నంద్యాల పట్టణం బొమ్మల సత్రం కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. నెల్లూరు జిల్లాలో నెల్లూరు అర్బన్ విఆర్‌సి సెంటర్ వద్ద గల అంబేద్కర్ బొమ్మ సర్కిల్‌లో నిరసన తెలిపి, అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఎస్‌సి సెల్ నేతలతో కలిసి వైసిపి జిల్లా అధ్యక్షులు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, నెల్లూరు సిటీ ఇన్‌ఛార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, గూడూరు నియోజకవర్గ ఇన్చార్జ్, ఎమ్మెల్సీ మురళీధర్, నెల్లూరు రూరల్ ఇన్‌చార్జ్ ఆనం విజయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక చర్యలను ఖండించారు. చిత్తూరు జిల్లా చిత్తూరు నగరంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి విజయానంద రెడ్డి ఆధ్వర్యంలో నిరసన తెలిపి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. నగరిలో మాజీ మంత్రి రోజా ఆధ్వర్యంలో, ఎస్‌ఆర్‌పురం, జీడీ నెల్లూరు మండలాల్లో మాజీ డిప్యూటి సిఎం కళత్తూరు నారాయణస్వామి ఆధ్వర్యంలో, పుంగనూరు, వి కోట మండలాల్లో వైసిపి నాయకులు నిరసనలు తెలిపారు. తిరుపతి జిల్లాలో తిరుపతి నగరంలో వైసిపి ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో, పుత్తూరు, చంద్రగిరి, శ్రీకాళహస్తి, గూడూరు, నాయుడుపేటలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైసిపి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో నిరసనలు తెలిపారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలోని అజిత్ సింగ్‌నగర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. వైసిపి జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మొండితోక జగన్మోహన్‌రావు, ఎమ్మెల్సీ రాహుల్లా నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ తదితరులు పాల్గొని మాట్లాడారు. తిరుపతి జిల్లా తిరుపతి నగరంలో వైసిపి ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. విశాఖ జిల్లా విశాఖలోని ఎల్‌ఐసి కార్యాలయ దరి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. వాటిని ప్రభుత్వ రంగంలోనే నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు మాజీ ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు పాల్గొన్నారు.

విశాఖ జిల్లాలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న వైసిపి నాయకులు

బూటకపు ఎన్‌కౌంటర్‌పై విచారణ

- ఆపరేషన్ కగార్‌ను ఆపాలి
- పౌరహక్కుల సంఘం డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లా అబూజ్‌మడ్ ఇలాకా మూస్పర్షి అడవుల్లో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌పై విచారణ జరపాలని తెలంగాణ పౌరహక్కుల సంఘం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎన్ నారాయణరావు మాట్లాడుతూ.. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కడారి సత్యనారాయణరెడ్డి (కోసా దాద), కథా రామచంద్రారెడ్డి (రాజు దాద), వికల్పలు గతనెల 22న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించినట్టుగా ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ప్రకటించిందని చెప్పారు. మరుసటి రోజు మావోయిస్టు పార్టీ విడుదల చేసిన ప్రకటనలో కట్టా రామచంద్రారెడ్డి, కడారి సత్యనారాయణలను పోలీసులు అరెస్టు చేసి చిత్రహింసలకు గురిచేసి హత్య చేసినట్టుగా ప్రకటించిందని అన్నారు. ఆ ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులకు వేరే బాధ్యతలను పార్టీ అప్పగించిందనీ, అందులో భాగంగానే పది నెలల క్రితమే వారు రాయ్‌పూర్ శివారులో ఉన్నారని వివరించారు. వారిని నిరాయుధులుగా గతనెల 11 నుంచి 20 మధ్య అరెస్టు చేశారని చెప్పారు. రహస్య సమాచారం కోసం చిత్రహింసలు పెట్టి 22న అబూజ్‌మడ్ ఇలాకా మూస్పర్షి అడవుల్లో ఎన్‌కౌంటర్ పేరుతో కిరాతకంగా ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కాల్చి చంపిందని విమర్శించారు. ఆపరేషన్ కగార్‌ను ప్రారంభించి 21 నెలలు అవుతున్నదనీ, ఇప్పటి వరకు 80 ఎన్‌కౌంటర్లలో 700 మందిని హత్య చేశారని చెప్పారు. లక్షల కోట్ల రూపాయల విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పగించడం కోసమే మావోయిస్టులపై దాడులకు పాల్పడుతున్నదని విమర్శించారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. 400 సాయుధ క్యాంపులను ఎత్తేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కట్టా రామచంద్రారెడ్డి, కడారి సత్యనారాయణల ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయవిచారణ జరపాలని సూచించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండానే పోస్టుమార్టం నిర్వహించారని విమర్శించారు. కుటుంబ సభ్యుల సమక్షంలో రీ-పోస్టుమార్టం నిర్వహించాలని డిమాండ్ చేశారు.

సామ్రాజ్యవాద పునరుద్ధరణకే...

(మొదటిపేజీ తరువాయి)

యుద్ధం చేస్తున్నారని తెలిపారు. ఈ విషయంలో అక్కడ ట్రంప్, ఇక్కడ మోడీ ఒకే విధానాలు అమలు చేస్తున్నారని చెప్పారు. అక్కడ జాతి వివక్ష, ఇక్కడ మైనార్టీలకు వ్యతిరేకంగా జరుగుతున్న దాడి ఒక్కటేనని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ వాళ్లు చేసే హేతుబద్ధతలేని వాదనల మాదిరే ట్రంప్ వాదన చేస్తుంటారని అన్నారు. ఈ నేపథ్యంలోనే సుంకాల యుద్ధం గురించి ఆలోచన చేయాలని తెలిపారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ట్రంప్ సుంకాలు దేశం మొత్తం ప్రభా వితం చేస్తున్నాయని, దీనిపై ప్రజల్లో పెద్దఎత్తున చర్చ జరుగుతోందని తెలిపారు. ఒకవైపు విదేశాలపై ఆధారపడటమే మన ప్రధాన శత్రువని చెప్పిన మోడీ పత్తి, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను సుంకాల లేకుండా దిగుమతి చేసుకుంటున్నారని చెప్పారు. దీనివల్ల రైతులు నష్టపోతారని, ఆత్మహత్యలు జరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. పన్ను లేకుండా పత్తి దిగుమతిని నిలిపేయాలని అన్నారు. ప్రజలకు నష్టం కలిగిస్తున్న ఈ అంశాలపై రాష్ట్రంలో టిడిపి అధ్యక్షులు చంద్రబాబు నాయుడు, వైసిపి అధ్యక్షులు జగన్ నోరెత్తడం లేదని విమర్శించారు. పైగా మోడీకి చంద్రబాబు తబలా వాయిస్తున్నారని చెప్పారు. అమరావతి రాజధానిలో ఇన్నోవేషన్ హబ్, క్వాంటం హబ్ మైక్రోసాఫ్ట్, ఐబిఎం వాళ్లు పెడుతున్నారని చెప్పారు. దీనిపై ప్రచారం చేస్తున్న చంద్రబాబు టెక్నాలజీని బదిలీ చేస్తారా? లేదా అనే విషయాన్ని చెప్పడం లేదని అన్నారు. అమెరికా ఇక్కడ సెమీ కండక్టర్లు తయారు చేసి అమ్ముతుంటే వాటికి మన లేబుల్ వేసుకుని ఆనందపడుతున్నామని చెప్పారు. స్వేచ్ఛగా ఉత్పత్తులు దిగుమతి చేసుకోవాలని చెబుతున్న అమెరికాతో బంధం ప్రమాదకరమని అన్నారు. అమెరికా, ప్రమాదం ట్రంప్ సుంకాలపై క్షేత్రస్థాయిలో పెద్దఎత్తున ప్రచారం చేయాలని సూచించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ మోడీ, ట్రంప్ దేశాన్ని దెబ్బతీస్తున్నా మాట్లాడని సిఎం గతంలో పిల్లలను కనాలని చెప్పి, ఇప్పుడు రొయ్యలు తినాలంటున్నారని ఇంతకుమించి చేసిందేమీ లేదని అన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డివి కృష్ణ, విజయవాడ నగర పాలక సంస్థలో సిపిఎం ఫ్లోర్‌లీడర్ బి.సత్యబాబు, సెంట్రల్ జోన్ నాయకులు బి.రమణ, తూర్పుజోన్ నాయకులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తమిళనాట మరో విషాదం

(మొదటిపేజీ తరువాయి)

కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలని సంబంధిత అధికారులను స్టాలిన్ ఆదేశించారు. సొంత రాష్ట్రాలకు మృతదేహాలను తరలించేందుకు ప్రభుత్వమే అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

ముమ్మరంగా సహాయక చర్యలు

ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశాలతో ఘటనా స్థలానికి చేరుకున్న తమిళనాడు విద్యుత్ బోర్డు (టిఎన్‌ఇబి) ఛైర్మన్ జె రాధాకృష్ణన్ అక్కడ జరుగుతున్న సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్లాంటులో మొత్తం 3700 మంది కార్మికులు పనిచేస్తున్నారని, భద్రతా అధికారులు, సహాయక సిబ్బంది సమీపంలోని మూడు ప్లాంటుల్లోని బృందాలతో కలిసి సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. మరిన్ని సమస్యలు తలెత్తకుండా అన్ని విధాల జాగ్రత్త చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

గోదావరి ఉగ్రరూపం

(మొదటిపేజీ తరువాయి)

ఎర్రగట్టు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. మురుమూరు, నందిగామ, గౌరీదేవిపేట, తోటపల్లి, నెల్లిపాక గ్రామాల్లో వందల ఎకరాల్లోని మిర్చి తోటలు పూర్తిగా నీట మునిగాయి. ఇప్పటికే ఒక్కో ఎకరాకు రూ.25 వేలు ఖర్చు చేశామని, అదంతా గోదావరి పాలైందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. కూనవరం వాసులనూ వరద భయపెడుతోంది. ఏలూరు జిల్లాలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ప్రధాన రహదారులను వరద ముంచెత్తడంతో సుమారు 40కుపైగా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వరద పెరుగుతుండటంతో అధికారులు లోతట్టు ప్రాంతాలైన గొమ్ముగూడెం, కౌండిన్యముక్తి, లచ్చిగూడెం గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని అధికారులు, సిబ్బంది తమ పని ప్రదేశాల్లోనే ఉండాలని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. సెలవులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. పశ్చిమగోదావరి జిల్లాలో వశిష్ట గోదావరికి వరద తాకిడి పెరగడంతో లంక గ్రామాల ప్రజల్లో గుబులు మొదలైంది. ఎగువ నుంచి వస్తున్న వరద క్రమేపీ లంక భూముల్లోకి చేరుతుంది. దీంతో లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. కనకాయలంక కాజ్‌వేపై వరద ఉధృతి మరింత పెరగడంతో పడవల రాకపోకలను కట్టుదిట్టం చేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని పి.గన్నవరం మండలంలో కనకాయలంక, బూరుగులంక, అరిగెలవారిపేట, ఊడుమూడి లంక, జి.పెదపూడిలంక, కపిలేశ్వరపురం మండలంలో అద్దంకివారిలంక, పెదమల్లంక, పల్లపులంక, అయినవిల్లి మండలంలో పల్లపులంక, వీరవల్లిపాలెం, శానిపల్లి లంక, అయినవిల్లి లంకలను వరదనీరు తాకింది. వీరు నాటు, మర పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. వరదల నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లా కలెక్టరేట్, రాజమహేంద్రవరం, కొవ్వూరు ఆర్‌డిఓ కేంద్రాల్లో కంట్రోల్‌రూమ్‌లను ఏర్పాటు చేశారు.

పోలవరం నుంచి 10,50,735 క్యూసెక్కులు విడుదల

పోలవరం ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 10,50,735 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 32.900 మీటర్లు, స్పిల్‌వే దిగువన 24.500 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యామ్ ఎగువన 33.600 మీటర్లు, దిగువ కాఫర్ డ్యామ్ దిగువన 23.820 మీటర్లు, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల మధ్య 16.030 మీటర్లు నీటిమట్టం నమోదైనట్లు జలవనరులశాఖ అధికారులు తెలిపారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోండి : విపత్తుల నిర్వహణ సంస్థ

కృష్ణా, గోదావరి నదుల్లో వరద ప్రవాహం కొనసాగుతోందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి ప్రఖర్‌జైన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కృష్ణా, గోదావరి నదీ పరివాహక లోతట్టు ప్రాంత ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సహాయక చర్యల కోసం మూడు ఎన్‌డిఆర్‌ఎఫ్, 4 ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు, ఏలూరు, కృష్ణా బాపట్ల, గుంటూరు, అంబేద్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు, కర్నూలు జిల్లాల్లో ఉన్నాయని తెలిపారు.

గోదావరి వరద ఉధృతికి వేలేరుపాడు మండలంలో నీట మునిగిన పత్తి పంట

పోరాడారు... సాధించారు

- ఆల్ఫా ఇన్ఫ్రా బాధితుల విజయం
- నిర్వాసితులకు అనుకూలంగా హైకోర్టు తీర్పు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి / కొమరాడ

వారంతా అమాయక గిరిజనులు... అది ఓ మారుమూల గిరిజన గ్రామం... అయితేనేం... ఆల్ఫా ఇన్ఫ్రా అనే బడా కార్పొరేట్ కంపెనీపై పోరాడారు. చివరకు మెడవంచి విజయం సాధించారు. మాయమాటలతో కంపెనీ లాగేసుకున్న సాగు భూములను తిరిగి వెనక్కి తెచ్చుకున్నారు. వందలాది మంది సాగుదారులు తమ భూముల దరి దాపుల్లోకి ఇప్పటికీ చేరలేకపోతున్నప్పటికీ ఏడేళ్ల క్రితమే కోర్టు ఉత్తర్వుల ద్వారా తమ భూములపై సాగు హక్కులను తిరిగి సాధించుకున్నారు. ఆ గ్రామం మరెక్కడో కాదు... కొమరాడ మండలంలోని చినఖేర్జల పరిధిలోని లింగన్నదొర వలస.కొమరాడ మండలంలో థర్మల్ పవర్ ప్లాంట్ పేరిట పెదఖేర్జల, చినఖేర్జల, కోటిపాం, శివరాంపురం, రేగులపాడు రెవెన్యూ గ్రామాల పరిధిలో

సుమారు 1100 ఎకరాల ప్రభుత్వ, జిరాయితీ భూములను 2010లో అప్పటి ప్రభుత్వం కారు చౌకగా కట్టబెట్టిన విషయం విదితమే. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, భారీగా నష్టపరిహారం చెల్లిస్తామని, సకల సదుపాయాలతో పునరావాస కాలనీలు నిర్మిస్తామంటూ అప్పట్లో నాటి ప్రభుత్వం, కంపెనీ యాజమాన్యం కలిసి నమ్మబకాయి. ఆ పరిశ్రమ కారణంగా ఉద్యోగాలిచ్చే పరిస్థితి లేదు సరికాద పర్యావరణ సమస్యలు తలెత్తుతాయంటూ సిపిఎం, తదితర ప్రజాసంఘాల ఆధ్వర్యాన పెద్దఎత్తున ఉద్యమించడంతో కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ కూడా పర్యావరణ అనుమతులను 2013లో రద్దుచేసుకుంది. దీంతో మోసపోయామని తెలుసుకున్న లింగన్న దొరవలస గ్రామ గిరిజనులు పోగొట్టుకున్న భూములను తిరిగి సాధించేందుకు పోరాట నాందిపలికారు. ఇందుకోసం ఇతర గ్రామాలను అప్పట్లో సంప్రదించినప్పటికీ అక్కడ పాలక ప్రతిపక్ష నేతల్లో పెద్దగా స్పందన లేకపోయింది. కేవలం 16 కుటుంబాలు ఉంటున్న లింగన్నదొరవలసలో చదువుకున్న వ్యక్తి ఒక్కరంటే ఒక్కరు కూడా లేరు. కంపెనీని నిలదీసి పోయిన భూములను రాబట్టుకోవాలన్న ఆలోచన ఉన్నప్పటికీ ఎలా సాధించాలో తెలియని పరిస్థితి. సరిగ్గా అదే సమయంలో హిరమక గంగారావు (గంగాధర్) డిగ్రీ పూర్తిచేసుకుని గ్రామానికి వచ్చాడు. అప్పటికే భూములు కోల్పోయి మోసపోయామన్న ఆవేదన, ఆందోళన అవగతం చేసుకున్నాడు. తాను నేర్చుకున్న విద్యను ఆచరణలో పెట్టాలనే నిర్ణయానికి వచ్చాడు ఆ యువకుడు. ఇందుకు అంగవైకల్యం కూడా అడ్డురాలేదు. అనుకున్నదే తడువుగా న్యాయ పోరాటానికి సిద్ధమయ్యాడు. తెలివైనవారి ద్వారా న్యాయవాదులు, రిటైర్డు అధికారులను కలిసి తమ గ్రామానికి జరిగిన అన్యాయాన్ని వివరించాడు. వారి సూచనలు, సలహాలతో ఆల్ఫా ఇన్ఫ్రా మోసాలపై హైకోర్టులో కేసు వేశాడు. చివరకు సత్యం గెలిచింది. లింగన్నదొరవలసలోని మొత్తం 14మంది గిరిజన సాగుదారుల నుంచి తీసుకున్న భూములను తిరిగివారికి అప్పగించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించింది. దీంతో సాగుదారులు హాయిగా తమ భూములను సాగుచేసుకుంటూ జీవనం వెల్లదీస్తున్నారు.

భారత ప్రభుత్వం

రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వశాఖ

భారత జాతీయ రహదారుల సంస్థ

సత్యమేవ జయతే

భా రా రా ప్రా NHAI

ప్రాజెక్ట్స్ ఇంప్లిమెంటేషన్ యూనిట్ - తిరుపతి

తేనేపల్లి యూజర్ ఫీజు ప్లాజా వద్ద సవరించిన యూజర్ ఫీజు (టోల్) రేట్లపై పబ్లిక్ నోటీసు

(ఎన్‌హెచ్-40, కి.మీ.19.500) 2025-2026 ఆర్థిక సంవత్సరానికి వర్తిస్తుంది, అంటే, 01.10.2025 (00:00 గంటలు) నుండి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని (తేనేపల్లి గ్రామం, చిత్తూరు జిల్లా) కి.మీ.19.500 వద్ద ఉన్న **తేనేపల్లి యూజర్ ఫీజు ప్లాజా** వద్ద 01.10.2025 (00.00 గంటలు) నుండి సవరించబడుతున్నాయి. (ఎన్‌హెచ్-40, కి.మీ.19.500) పీలేర్ - పుతలపట్టు సెక్షన్ కి.మీ. 18/350 నుండి కి.మీ. 56/000 NH-40 (పాత NH-18) 29.09.2025 నాటి NHAI లేఖ ద్వారా సవరించిన లింకేజ్ ఫ్యాక్టర్‌పై వినియోగదారు రుసుము రేట్ల ఆమోదం కోసం MoRT&H ద్వారా గెజిట్‌లో ప్రచురించబడిన ఫీజు నోటిఫికేషన్‌కు పబ్లిక్ నోటీసును ఇందుమూలంగా తెలియజేస్తున్నాము.

మొత్తం రూ.

వాహనాల కేటగిరి	సింగిల్ జర్నీకి రుసుము	ఒక రోజులోపు తిరిగి వచ్చే ప్రయాణానికి రుసుము	నెలలో 50 సింగిల్ ప్రయాణం కోసం నెలవారీ పాస్ కోసం రుసుము	వాణిజ్య వాహనాలుతో సింగిల్ కోసం రుసుము కోసం ప్రయాణం నమోదు చేయబడింది జిల్లాలో ప్లాజా
కారు, జీపు, వ్యాన్ లేదా లైట్ మోటార్ వాహనము	35	50	1105	15
లైట్ కమర్షియల్ వాహనము, లైట్ గూడ్స్ వాహనము లేదా మినీ బస్	55	80	1785	25
బస్ లేదా ట్రక్ (రెండు యాక్సిల్స్)	110	170	3740	55
మూడు - యాక్సిల్స్ వాణిజ్య వాహనము	120	185	4080	60
(HCM) లేదా (EME) లేదా (MAV) (4 నుండి 6 యాక్సిల్స్)	175	265	5870	90
ఓవర్ సైజ్ గల వాహనాలు (7 లేదా అంత కుమించి యాక్సిల్స్)	215	320	7145	105

దుర్గంవారిపల్లి యూజర్ ఫీజు ప్లాజా వద్ద సవరించిన యూజర్ ఫీజు (టోల్) రేట్లపై పబ్లిక్ నోటీసు

(ఎన్‌హెచ్-40, కి.మీ.69.015) 2025-2026 ఆర్థిక సంవత్సరానికి వర్తిస్తుంది, అంటే, 01.10.2025 (00:00 గంటలు) నుండి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని (దుర్గంవారిపల్లి గ్రామం, అన్నమయ్య జిల్లా) **దుర్గంవారిపల్లి యూజర్ ఫీజు ప్లాజా** వద్ద 01.10.2025 (00.00 గంటలు) నుండి సవరించబడుతున్నాయి. కి.మీ. 69.015 వద్ద NH-40 (పాత NH-18) లోని పైలర్-రాయచోటి సెక్షన్ కి.మీ. 57/000 నుండి కి.మీ.108/850 వరకు S.O.No.1334(E) dt.09.03.2018 మరియు సవరించిన లింకేజ్ ఫ్యాక్టర్‌పై వినియోగదారు రుసుము రేట్ల ఆమోదం. 29.09.2025 నాటి NHAI లేఖ ద్వారా సవరించిన లింకేజ్ ఫ్యాక్టర్‌పై వినియోగదారు రుసుము రేట్ల ఆమోదం కోసం MoRT&H ద్వారా గెజిట్‌లో ప్రచురించబడిన ఫీజు నోటిఫికేషన్‌కు పబ్లిక్ నోటీసును ఇందుమూలంగా తెలియజేస్తున్నాము.

మొత్తం రూ.

వాహనాల కేటగిరి	సింగిల్ జర్నీకి రుసుము	ఒక రోజులోపు తిరిగి వచ్చే ప్రయాణానికి రుసుము	నెలలో 50 సింగిల్ ప్రయాణం కోసం నెలవారీ పాస్ కోసం రుసుము	వాణిజ్య వాహనాలుతో సింగిల్ కోసం రుసుము కోసం ప్రయాణం నమోదు చేయబడింది జిల్లాలో ప్లాజా
కారు, జీపు, వ్యాన్ లేదా లైట్ మోటార్ వాహనము	45	70	1560	25
లైట్ కమర్షియల్ వాహనము, లైట్ గూడ్స్ వాహనము లేదా మినీ బస్	75	115	2515	40
బస్ లేదా ట్రక్ (రెండు యాక్సిల్స్)	160	235	5275	80
మూడు - యాక్సిల్స్ వాణిజ్య వాహనము	175	260	5750	85
(HCM) లేదా (EME) లేదా (MAV) (4 నుండి 6 యాక్సిల్స్)	250	370	8270	125
ఓవర్ సైజ్ గల వాహనాలు (7 లేదా అంత కుమించి యాక్సిల్స్)	300	455	10065	150

రాపూర్ యూజర్ ఫీజు ప్లాజా వద్ద సవరించిన యూజర్ ఫీజు (టోల్) రేట్లపై పబ్లిక్ నోటీసు

(ఎన్‌హెచ్-565, కి.మీ.443.800) 2025-2026 ఆర్థిక సంవత్సరానికి వర్తిస్తుంది, అంటే, 01.10.2025 (00:00 గంటలు) నుండి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని (రాపూర్ గ్రామం, నెల్లూరు జిల్లా సమీపంలో) **రాపూర్ యూజర్ ఫీజు ప్లాజా** వద్ద 01.10.2025 (00.00 గంటలు) నుండి సవరించబడుతున్నాయి. కి.మీ.69.015 వద్ద NH-565 లోని పెంచలకోన-యెర్పేడు సెక్షన్ కి.మీ.390.148 నుండి కి.మీ.466.650 వరకు S.O.No.1516(E) dt.29.03.2023 మరియు సవరించిన వినియోగదారు రుసుము రేట్ల ఆమోదం. 29.09.2025 నాటి NHAI లేఖ ద్వారా రుసుము రేట్ల ఆమోదం కోసం MoRT&H ద్వారా గెజిట్‌లో ప్రచురించబడిన ఫీజు నోటిఫికేషన్‌కు పబ్లిక్ నోటీసును ఇందుమూలంగా తెలియజేస్తున్నాము.

మొత్తం రూ.

వాహనాల కేటగిరి	సింగిల్ జర్నీకి రుసుము	ఒక రోజులోపు తిరిగి వచ్చే ప్రయాణానికి రుసుము	నెలలో 50 సింగిల్ ప్రయాణం కోసం నెలవారీ పాస్ కోసం రుసుము	వాణిజ్య వాహనాలుతో సింగిల్ కోసం రుసుము కోసం ప్రయాణం నమోదు చేయబడింది జిల్లాలో ప్లాజా
శ్రీశైలం పది గేట్ల ద్వారా దిగువకు ప్రవహిస్తున్న వరద

ప్రకాశం బ్యారేజీకి స్థిరంగా వరద

పులిచింతల జలాశయానికి 6.10 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా 6.17 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతలతో పాటు ఖమ్మం, కృష్ణా జిల్లాల నుంచి వచ్చే ప్రవాహంతో కలిపి ప్రకాశం బ్యారేజీ 6.69 లక్షల క్యూసెక్కులు వస్తుండగా అదే స్థాయిలో దిగువకు విడుదల చేస్తున్నారు. బ్యారేజీ 69 గేట్లను ఎత్తారు. బ్యారేజీ వద్ద రెండో నంబరు ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు.

గుంటూరు జిల్లాలోని తుళ్లూరు, తాడేపల్లి, కొల్లిపర, దుగ్గిరాల మండలాల్లోని నదీ పరివాహక ప్రాంతంలోని పలు గ్రామాలకు వరద నీరు చేరింది. కొల్లిపర, దుగ్గిరాల, తుళ్లూరు, తాడేపల్లి మండలాల్లో వరి పంటలు నీటమునిగాయి. కంద, అరటి, పసుపు, కూరగాయల తోటలు నీట మునిగాయి. పల్నాడు జిల్లా దాచేపల్లి, అమరావతి, అచ్చంపేట, మాచవరం మండలాల్లో పత్తి పంట దెబ్బతింది. కృష్ణాతీరంలో ఉన్న ఎనిమిది మండలాల్లోని 24 గ్రామాల్లోని లంక గ్రామాలు, పరివాహక ప్రాంతాల్లో పంటలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.తుళ్లూరు, కొల్లిపర మండలాల్లోని పలు లంక గ్రామాలకు నీరు రావడంతో పునరావాస కేంద్రాలను కొనసాగిస్తున్నారు.

ముంపునకు గురైన పంటలు పరిశీలన

కృష్ణాజిల్లా తోట్లవల్లూరు, వల్లూరుపాలెం ముంపు ప్రాంతాల్లో రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు మంగళవారం పర్యటించారు. పసుపు, కంద, మినుము, అరటి, చెరకు, కూరగాయ పంటలు, పూల తోటలను పరిశీలించారు. దెబ్బతిన్న పంటలను ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.శివనాగేంద్రం, ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, నాయకులు కె.కొండలబాబు, వ్యవసాయ కార్మిక సంఘం తోట్లవల్లూరు మండల అధ్యక్షులు ఏసోబు, రైతు సంఘం సీనియర్ నాయకులు అన్నే సుబ్బారావు తదితరులు పరిశీలించారు.

పిహెచ్‌సి వైద్యుల ధర్నా

రాజమండ్రి డిఎంహెచ్‌ఒ వద్ద ఆందోళన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి/అమరావతి బ్యూరో

పిజి ఇన్ సర్వీస్‌ను కొనసాగించాలని, ట్రైబల్ అలవెన్స్‌లు ఇవ్వాలని, కాలపరిమితితో కూడిన ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్ర వరం డిఎంహెచ్‌ఒ కార్యాలయం పిహెచ్‌సి వైద్యులు ధర్నా చేశారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు ఈ ఆందోళన చేపట్టినట్లు వైద్యులు తెలిపారు. తమ సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 26 నుంచి సమ్మె చేస్తున్నామని, ఇందులో భాగంగా మంగళవారం జిల్లా వైద్యాధికారి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టినట్లు తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో ర్యాలీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజల సేవలో ఉన్న వైద్యుల భవిష్యత్తు కోసం రాష్ట్ర వ్యాప్తంగా పోరాడుతున్నామన్నారు. ప్రభుత్వం తెచ్చిన కొత్త విధానాల వల్ల గ్రామీణ వైద్యం కుంటుపడుతుం దన్నారు. వివిధ పిహెచ్‌సిల వైద్యులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాం : వైద్య ఆరోగ్యశాఖ

డిఎంహెచ్‌ఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పిహెచ్‌సి వైద్యులు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పిహెచ్‌సి)లో సామాజిక, ప్రాంతీయ, జిల్లా, బోధనాస్పత్రుల్లో పనిచేసే ఎంబిబిఎస్ వైద్యులు మంగళవారం నుంచి రోగులకు సేవలు అందిస్తున్నారని వైద్యారోగ్యశాఖ పేర్కొంది.

పిహెచ్‌సిలలో పనిచేసే వైద్యులు పిజి ఇన్ సర్వీసెస్ కోటా వ్యవహారంలో ఆందోళన చేస్తున్నందున వైద్యారోగ్యశాఖ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టినట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. సిహెచ్‌ఒలు హెల్త్ అండ్ వెల్నెస్ కేంద్రాల పరిధిలోనే ఉండాలని ఉత్తర్వులిచ్చింది.

సిమెంట్ మాటున గంజాయి సరఫరా

- 1210 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఒడిశా నుంచి హైదరాబాద్ గుండా రాజస్థాన్‌కు తరలిస్తున్న 1210 కిలోల గంజాయిని తెలంగాణ రాష్ట్రం రాచకొండ పోలీసులు పట్టుకున్నారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఇంత పెద్ద మొత్తంలో గంజాయి లభ్యం కావడం ఇదే మొదటిసారి అని రాచకొండ పోలీస్ కమిషనర్ డాక్టర్ సుధీర్‌బాబు తెలిపారు.

ఎల్‌బీనగర్‌లో ఉన్న సిపి క్యాంపు కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రాజస్థాన్ జోధ్‌పూర్‌కు చెందిన లారీ డ్రైవర్ విక్రమ్ విష్ణోయి అలియాస్ వికాస్.. వాహన యజమాని రాంలాల్ ఆదేశం మేరకు గంజాయిని ఒడిశా నుంచి రాజస్థాన్‌కు తరలిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న మహేశ్వరం ఎస్ఒటీ పోలీసులు, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు సంయుక్తంగా రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని కొత్తగూడెం గ్రామం వద్ద లారీని పట్టుకున్నారు. గంజాయి, లారీ, మొబైల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితున్ని రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో అదనపు డిసిపి షాకీర్ హుస్సేన్, ఎస్ఒటి ఎసిబి సత్తయ్య, ఇన్‌స్పెక్టర్లు అశోక్‌రెడ్డి, రవికుమార్, ఎస్ఐ రాజు తదితరులు ఉన్నారు.

ఎయిర్ బస్ బోర్డు సభ్యులతో లోకేష్ , రామ్మోహన్‌నాయుడు

పెట్టుబడులకు అనుకూల వాతావరణం

- ఎయిర్ బస్ బోర్డు సభ్యులతో లోకేష్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విమానాల తయారీ సంస్థ, ప్రపంచ ప్రఖ్యాత ఏరోస్పేస్ దిగ్గజం ఎయిర్ బస్ పెట్టుబడుల కోసం రాష్ట్రం మరో ముందడుగు వేసింది. మంగళవారం నాడిక్కడ రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఏరోస్పేస్ దిగ్గజం ఎయిర్ బస్ సంస్థ పూర్తిస్థాయి బోర్డుతో ఉన్నత స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈ భేటీలో ఎయిర్ బస్ ఛైర్మన్ రెనీ ఒబెర్మన్‌తోపాటు ఎయిర్ బస్ ఇండియా, సౌత్ ఏషియా ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు. మేకిన్ ఇండియా, స్వదేశీకరణ అవకాశాల అన్వేషణలో భాగంగా ఎయిర్ బస్ బోర్డు మొదటిసారి దేశానికి రావడం జరిగింది. రాష్ట్రంలో ఎయిర్ బస్ ఆధారిత ప్రపంచ స్థాయి ఏరోస్పేస్ మ్యానుఫాక్చరింగ్ ఫెసిలిటీతో పాటు దీనికి అనుబంధంగా టైర్-1, టైర్-2 సరఫరాదారుల సహ ఉత్పత్తి యూనిట్ల రూపంలో కలిసి పనిచేసేలా ప్రతిపాదనను మంత్రి లోకేష్ ముందుంచారు. రాష్ట్రంలో ఇప్పటికే అందుబాటులో ఉన్న భూమి లభ్యతతోపాటు ప్రాజెక్టు వేగవంతంగా పూర్తి, గ్లోబల్ క్వాలిటీ మాన్యుఫాక్చరింగ్, టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్‌కు అనుకూలంగా ఉన్న రాష్ట్ర ఏరో స్పేస్ పాలసీని వివరించారు. తద్వారా రాష్ట్రాన్ని ఎగుమతి ఆధారిత ఏరోస్పేస్ హబ్‌గా తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు.

ప్రధాన యూనిట్‌తో పాటు ఇంటిగ్రేటెడ్ క్లస్టర్‌ను ఏర్పాటు చేయండి

ప్రధాన యూనిట్‌తోపాటు సరఫరాదారులు, ఎంఎస్ఎంఇలు, భాగస్వాములు కలిసి పనిచేయగల ఇంటిగ్రేటెడ్ క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి లోకేష్ ఎయిర్ బస్‌ను కోరారు. దీనివల్ల టైమ్ లైన్ రిస్క్‌లు తగ్గడంతో పాటు లోకలైజేషన్ పెరిగి తక్కువ ఖర్చుతో విస్తృత స్థాయిలో తయారీ సాధ్యం అవుతుందని వివరించారు. ప్రస్తుతం అభివృద్ధి చేస్తున్న ఏరోస్పేస్ కారిడార్లలో అనేక సైటింగ్ ఆప్షన్స్ ఉన్నాయని, అవి ఎయిర్ బస్ ప్రోగ్రామ్ అవసరాలకు, సరఫరాదారుల క్లస్టరింగ్, రవాణా సౌకర్యాలు, భవిష్యత్ విస్తరణలకు అనుగుణంగా ఉంటాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ పెట్టుబడిదారుల ప్రాధాన్య విధానాన్ని, వేగవంతమైన అనుమతులు, సింగిల్ విండో సౌకర్యం, నిర్దిష్ట గడువులోగా ప్రాజెక్టు అమలు వంటి అంశాలతోపాటు ప్రపంచ స్థాయి పెట్టుబడులను రాష్ట్రానికి రప్పించడాన్ని వివరించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై రాష్ట్రం దృష్టి పెట్టిందన్నారు. ప్రపంచ ఏరోస్పేస్ రంగంలో ప్రఖ్యాతిగాంచిన ఎయిర్ బస్ రాష్ట్రంలో యూనిట్ నెలకొల్పేందుకు అవసరమైన పూర్తి ఎకో సిస్టమ్ అందించేందుకు రాష్ట్రం సిద్ధంగా ఉందని తెలిపారు.

టెట్ కేసులో సుప్రీంలో ఎస్‌టిఎఫ్‌ఐ రివ్యూ పిటిషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టెట్ కేసుకు సంబంధించి సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్‌ను స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టిఎఫ్‌ఐ) పక్షాన జాతీయ ప్రధాన కార్యదర్శి చావ రవి పేరిట న్యాయవాది సుభాష్ చంద్రబోస్ దాఖలు చేశారని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐదేళ్ల తర్వాత ఉద్యోగ విరమణ పొందే ఉపాధ్యాయులందరూ సర్వీసులో కొనసాగాలంటే తప్పనిసరిగా రెండేళ్లలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఉత్తీర్ణులు కావాలని లేదా ఉద్యోగం నుంచి రిటైర్ కావాలని, ఐదేళ్లలోపు సర్వీస్ ఉన్న ఉపాధ్యాయులు కూడా ప్రమోషన్ కావాలంటే టెట్ పాస్ కావాల్సిందేనంటూ ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించాలని రివ్యూ పిటిషన్ దాఖలు చేశారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, ఎన్‌సిటిఇ, రాష్ట్ర ప్రభుత్వం వీలైనంత త్వరగా రివ్యూ పిటిషన్లు వేయాలని కోరారు.

దక్షిణ కొరియాలో మంత్రుల పర్యటన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పారిశ్రామికవేత్తలకు పూర్తి సహకారం అందిస్తున్నామని మంత్రులు నారాయణ, బిసి జనార్ధన్ రెడ్డి తెలిపారు. దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా సియోల్‌లోని కియా పలు ఇతర సంస్థలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా యాజమాన్యాలను రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా కోరారు. సమర్థ నాయకత్వంలో కేవలం 15 నెలల్లోనే రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించగలిగామని తెలిపారు. నవంబరులో విశాఖపట్నంలో జరిగే సిఐఐ పార్టనర్‌షిప్ సదస్సుకు హాజరుకావాలని దక్షిణ కొరియా ఇన్వెస్టర్లను ఆహ్వానించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలను, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను, ఇస్తున్న రాయితీలను ఆ దేశ పారిశ్రామికవేత్తలకు, పెట్టుబడిదారులకు వివరించారు. ఈ సందర్భంగా కియా యూనిట్ విస్తరణకు సంబంధించిన చర్చలు జరిగాయి.

సెల్ఫ్ డ్రైవింగ్ ఆటో

- స్వయంగతి పేరిట ప్రవేశపెట్టిన ఒమెగా సీకి మొబిలిటీ

న్యూఢిల్లీ : సెల్ఫ్ డ్రైవింగ్‌తో ఎలక్ట్రిక్ ఆటో వచ్చేసింది. దీనిని డ్రైవ్ చేయడానికి ఇక డ్రైవర్లు అవసరం లేదు. ఎలక్ట్రిక్ త్రీ-వీలర్ తయారీ సంస్థ ఒమెగా సీకి మొబిలిటీ దేశంలో తొలి సెల్ఫ్-డ్రైవింగ్ ఆటోను పరిచయం చేసింది. 'స్వయంగతి' పేరిట ఈ ఆటోను లాంఛనంగా ప్రవేశపెట్టింది. ఈ కొత్త మోడల్ ప్యాసింజర్ వెర్షన్ ధర రూ.4 లక్షల (ఎక్స్ షోరూమ్) నుంచి ప్రారంభం కాగా.. కార్గో వెర్షన్ రూ.4.15 లక్షలకు (ఎక్స్ షోరూమ్) లభించనుంది. ముందస్తు బుకింగ్స్ ప్రారంభమయ్యాయని, డెలివరీలు త్వరలో మొదలవుతాయని కంపెనీ ప్రకటించింది. స్వయంగతి ఆటో.. 10.3 కెడబ్ల్యుహెచ్ బ్యాటరీతో వస్తుంది. ఫుల్ ఛార్జ్ చేస్తే గరిష్టంగా 120 కిలోమీటర్ల వరకు ప్రయాణించొచ్చు. అయితే ఈ వాహనానికి అవసరమైన ఛార్జింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై కంపెనీ ఇంకా వివరాలు వెల్లడించలేదు. ఇందులో కంపెనీ ఇవి ప్లాట్‌ఫాంతో పాటు ఎఐ ఆధారిత అటానమీ సిస్టమ్ ఉంది. లైడార్ టెక్నాలజీ, జిపిఎస్, 6 కిలోమీటర్ల దూరం వరకు అడ్డంకులను గుర్తించే సెన్సర్లు, మల్టీ సెన్సర్ నావిగేషన్, రిమోట్ సేఫ్టీ ఫీచర్లు ఉన్నాయి. డ్రైవర్ లేకుండానే ముందుగానే మ్యాప్ చేసిన మార్గంలో ప్రయాణించగలదు. మొదటి దశ పరీక్షలు విజయవంతం కాగా.. రెండో దశ పరీక్షలు త్వరలో నిర్వహిస్తామని సంస్థ చెప్పింది. ఇందులో భాగంగా వివిధ ప్రాంతాల్లో నియంత్రిత కమర్షియల్ ఆపరేషన్లు ప్రారంభం కానున్నాయి. విమానాశ్రయాలు, టెక్ పార్కులు, గేటెడ్ కమ్యూనిటీలు, పారిశ్రామిక ప్రాంతాలు, స్మార్ట్ సిటీల్లో స్వయంగతి ఆటోలను ప్రవేశపెట్టే యోచనలో కంపెనీ ఉంది. రాబోయే రెండేళ్లలో 1,500 సెల్ఫ్ డ్రైవింగ్ త్రీ-వీలర్లను ఉత్పత్తి చేయాలని ఒమెగా సీకి ప్రణాళికలు వేసింది. భారత రవాణా రంగంలో స్వయంగతి ఆవిష్కరణ కీలకమైందని కంపెనీ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ ఉదయ్ నారాంగ్ తెలిపారు. 'ఎఐ, లైడార్, ఆటానమస్ నావిగేషన్ వంటి అత్యాధునిక టెక్నాలజీని భారత్‌లోనే అభివృద్ధి చేసి, అందరికీ అందుబాటులో ఉండే ధరలో తీసుకొచ్చాం' అని తెలిపారు.

తెలుగు తల్లి ఫ్లైఓవర్ పేరు మార్చి తెలంగాణ తల్లి ఫ్లైఓవర్‌గా నామకరణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ సచివాలయం సమీపంలోని తెలుగు తల్లి ఫ్లైఓవర్‌ను తెలంగాణ తల్లి ఫ్లైఓవర్‌గా నామకరణం చేశారు. మంగళవారం ఫ్లైఓవర్ ఇరువైపులా తెలంగాణ తల్లి ఫ్లైఓవర్ సైన్ బోర్డులతో కమాన్ ఏర్పాటు చేశారు. సచివాలయం నుంచి లోయర్ ట్యాంక్ బండ్ వరకు ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం 1997లో అప్పటి సిఎం చంద్రబాబు ఈ ఫ్లైఓవర్‌ను నిర్మించారు. అప్పుడే దీనికి "తెలుగు తల్లి ఫ్లైఓవర్"గా నామకరణం చేశారు. ఈ వంతెన అశోక్‌నగర్, ఇందిరానగర్ ప్రాంతాలను సికింద్రాబాద్‌తో అనుసంధానించడంలో కీలకంగా మారింది. తాజాగా జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటీ నిర్ణయం మేరకు దీనిని 'తెలంగాణ తల్లి ఫ్లైఓవర్'గా మార్చారు.

నిరుద్యోగి ఆత్మహత్యాయత్నం

రామభద్రపురం (విజయనగరం) : మండల కేంద్రంలో కనిమేరక వీధికి చెందిన కనిమెరక సాయివిశ్వనాద్ (25) పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. ఎంబిఎలో ఉత్తమ పలితం సాధించినా నిరుద్యోగం వెంటాడడంతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగడంతో పాటు బ్లేడుతో చేయి మణికట్టు, మెడ దగ్గర కోసుకొని ఆత్మహత్యాయత్నం చేశారు. కుటుంబ సభ్యులు గమనించి బాడంగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం విజయనగరం తరలించారు.

ఫోన్ చేసిన 48 గంటల్లో పరిష్కారం

- కేరళలో 'సిఎం విత్ మి' కేంద్రం ప్రారంభం

తిరువనంతపురం : కేరళలోని వామపక్ష ప్రజాతంత్ర వేదిక (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వం మరో వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రజలకు మరింత జవాబుదారీగా, మరింత చేరువగా ప్రభుత్వం యంత్రాంగం పనిచేసేలా 'సిఎం విత్ మి' (నాకు తోడుగా ముఖ్యమంత్రి) పౌర అనుసంధాన కేంద్రాన్ని ప్రారంభించింది. ఈ కేంద్రానికి రాష్ట్ర ప్రజలు ఫోన్ చేసి తమ సమస్యలను కానీ, సలహాలను కానీ తెలియజేసిన 48 గంటల్లో ప్రభుత్వం స్పందించి.. తగిన చర్యలు తీసుకుంటుంది. ఈ కేంద్రాన్ని గత సెప్టెంబరు 29న సోమవారం నాడు ముఖ్యమంత్రి పినరయి విజయన్ లాంఛనంగా ప్రారంభించారు. ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం.. అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటుందని, అందుకు ఈ కేంద్రం ఒక ఉదాహరణగా నిలుస్తుందని ప్రభుత్వం పేర్కొంది.

విజయ్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం

- సిపిఎం

చెన్నై : కరూర్ తొక్కిసలాట ఘటనపై సినీనటుడు, టివికె వ్యవస్థాపకుడు విజయ్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం, రాజకీయ ప్రేరేపితమని సిపిఎం విమర్శించింది. విజయ్ వ్యాఖ్యలను తమిళనాడు ప్రజలు ఎప్పటికి క్షమించరని తెలిపింది. నిగూఢ ఉద్దేశాలు కలిగిన విజయ్ రాజకీయ ప్రయాణం గురించి తమిళనాడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. తొక్కిసలాట ఘటన జరిగిన మూడు రోజుల తరువాత విజయ్ ఒక వీడియోను విడుదల చేశారు. ఈ వీడియోపై స్పందిస్తూ సిపిఎం తమిళనాడు రాష్ట్ర కార్యదర్శి పి. షణ్ముగం ఒక ప్రకటన విడుదల చేశారు. కరూర్ ర్యాలీకి చాలా ఆలస్యంగా రావడం, ఘటన తరువాత కరూర్ నుంచి వెంటనే బయలుదేరడానికి గల కారణాలు గురించి వీడియోలో విజయ్ ఒక్క మాట కూడా మాట్లాడలేదని ప్రకటనలో విమర్శించారు. విజయ్ వీడియో ఆ పార్టీ కార్యకర్తలను రెచ్చగొట్టేలా ఉందని పేర్కొన్నారు.

క్రికెటర్ తిలక్ వర్మను సత్కరిస్తున్న రేవంత్ రెడ్డి; పక్కన తెలంగాణ క్రీడామంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ చైర్మెన్ శివసేనా రెడ్డి, శాట్జ్ ఎండీ సోనిబాలా దేవి.

దేశం గర్వపడేలా ఆడావు!

తిలక్ వర్మకు తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి ప్రశంస

సిఎంకు బ్యాట్‌ను బహూకరించిన క్రికెటర్

హైదరాబాద్ : ఆసియా కప్ 2025 ఫైనల్లో వీరోచిత ఇన్నింగ్స్‌తో పాకిస్తాన్‌పై చిరస్మరణీయ విజయాన్ని అందించిన తెలుగు తేజం తిలక్ వర్మను తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఘనంగా సన్మానించారు. మంగళవారం సాయంత్రం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో సీఎం రేవంత్ రెడ్డిని తిలక్ వర్మ, కోచ్ సలామ్ బయాచ్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసిన సీఎం తిలక్ వర్మను సత్కరించారు. క్రికెట్ బ్యాట్, తన జెర్సీ సహా క్యాప్‌ను ముఖ్యమంత్రికి తిలక్ వర్మ బహూకరించాడు. తిలక్ వర్మ బహూకరించిన బ్యాట్‌తో రేవంత్ రెడ్డి తన కార్యాలయంలోనే షాడో బ్యాటింగ్ చేసి అలరించారు. ఆసియా కప్‌లో భారత్‌ను విజేతగా నిలపడంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, దేశం గర్వపడే ఇన్నింగ్స్ ఆడావని తిలక్ వర్మను రేవంత్ రెడ్డి అభినందించారు. క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్జ్) చైర్మెన్ శివసేనా రెడ్డి, శాట్జ్ ఎండీ సోనిబాలా దేవి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధిలో భాగం కావాలి

ఆసియా కప్ ఫైనల్లో ఎంతో ఒత్తిడిలో అత్యుత్తమ ప్రదర్శన చేసిన తిలక్ వర్మ.. ఛేదనలో ఒత్తిడిని జయిస్తూ సాధించిన ఇన్నింగ్స్ విశేషాలను సీఎం రేవంత్ రెడ్డితో పంచుకున్నాడు. తెలంగాణ క్రీడాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఈ సందర్భంగా తిలక్ వర్మను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. 'తెలంగాణను దేశంలో నం.1 స్పోర్ట్స్ హబ్‌గా రూపుదిద్దాలి. అందుకు ఇప్పటికే తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డును ఏర్పాటు చేశాం. క్రికెట్‌తో పాటు ఇతర క్రీడలను అభివృద్ధి చేసేందుకు అవసర మైన సూచనల చేయటంతో పాటు ఆలోచనలను స్పోర్ట్స్ హబ్‌తో పంచుకోవాలి. క్రీడాశాఖ మంత్రి శ్రీహరి మాజీ రంజీ క్రికెటర్. శాట్జ్ చైర్మెన్ యువజన నాయకుడు, ఔత్సాహిక క్రీడాకారుడు. స్పోర్ట్స్‌లో తెలంగాణను అగ్రగామిగా నిలిపేందుకు యంగ్ టీమ్ పట్టుదలతో పని చేస్తోంది. ఈ ప్రయాణంలో నువ్వు కూడా భాగం కావాలి' అని తిలక్ వర్మతో సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

ఎన్నికల కోడ్ ఉందని..! :

భారత జట్టు ఆసియా కప్ విజయంలో కీలక పాత్ర పోషించిన తిలక్ వర్మకు రాష్ట్ర ప్రభుత్వం భారీ నగదు బహుమతితో పాటు గ్రూప్-1 స్థాయి ఉద్యోగం ప్రకటిస్తుందని అందరూ అనుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌తో సోమవారం నుంచే రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో నగదు ప్రోత్సాహకం, ప్రభుత్వ ఉద్యోగంపై ఎటువంటి ప్రకటన చేయలేదని తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసిన తర్వాత తిలక్ వర్మకు నగదు ప్రోత్సాహకంతో పాటు ప్రభుత్వ ఉద్యోగంపై సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా — గవర్నర్‌పేట బ్రాంచి-01451
డి.నెం. 27-18-85, హోటల్ రాజ్ టవర్స్ దగ్గర, కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డు, గవర్నర్‌పేట, విజయవాడ-520002.

ఈ వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 9(1) ప్రకారం స్థిరాస్తుల అమ్మకము కొరకు ఈ-వేలం అమ్మకపు ప్రకటన.

ఈ-వేలం తేది: 15-10-2025. తేది: 29.09.2025, ప్రదేశం: విజయవాడ. అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా — గవర్నర్‌పేట బ్రాంచి-01451
డి.నెం. 27-18-85, హోటల్ రాజ్ టవర్స్ దగ్గర, కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డు, గవర్నర్‌పేట, విజయవాడ-520002.

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరుచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6(2)/RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

తేది: 29.09.2025, ప్రదేశం: విజయవాడ. అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా — భారతీనగర్ బ్రాంచి
డోర్ నెం.54-15-9/1, సర్వీస్ రోడ్డు, భారతీనగర్, విజయవాడ, ఏపి.

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తుల కొరకు)

(Rule 8(1)) of Security Interest (Enforcement) Rules 2002

తేది: 25-09-2025, ప్రదేశం: విజయవాడ. అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

SBI భారతీయ స్టేట్ బ్యాంక్
SME పటమటలంక (63644), విజయవాడ, NTR జిల్లా

సంక్షిప్త డిమాండు నోటీసు

(సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13(2) క్రింద నోటీసు)

(I) ఋణగ్రహీత పేర్లు మరియు చిరునామా: మెస్సర్స్ ఆర్యహి ఇన్‌ఫ్రా, రిజిస్టర్డ్ కార్యాలయం : ...

తేది : 01.09.2025, ప్రదేశం : విజయవాడ. సం/- అధీకృత అధికారి, భారతీయ స్టేట్ బ్యాంక్.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా — గవర్నర్‌పేట బ్రాంచి-01451
డి.నెం. 27-18-85, హోటల్ రాజ్ టవర్స్ దగ్గర, కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డు, గవర్నర్‌పేట, విజయవాడ-520002.

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరుచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6(2)/RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

తేది: 29.09.2025, ప్రదేశం: విజయవాడ. అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.

SBI భారతీయ స్టేట్ బ్యాంక్
SME పటమటలంక (63644), విజయవాడ, NTR జిల్లా

సంక్షిప్త డిమాండు నోటీసు

(సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13(2) క్రింద నోటీసు)

తేది : 01.09.2025, ప్రదేశం : విజయవాడ. సం/- అధీకృత అధికారి, భారతీయ స్టేట్ బ్యాంక్.

వేలము ప్రకటన

మహారాజశ్రీ గుంటూరు IIవ అదనపు జిల్లా జడ్జి కోర్టులో
E.P.No. 933/2020 in Arbitration Cas No. 158/2019
బిట్వీన్:
M/s. Shriram City Union Finance Limited, Vinukonda Branch rep by its Authorised Person / Office Assistant. -DHr
And
1) Veeramalla Srinivasa Rao and Another -JDrs

దక్షిణమధ్య రైల్వే
మమ్మల్ని @SCRailwayindia ద్వారా అనుసరించవచ్చు, ద.మ రైల్వేలోని టెండరు ప్రకటనల వివరాలు మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in లో చూడవచ్చు.

ఇ-వేలం ప్రకటన నం. BZA-13-2025-26
తేది: 29.09.2025
PUB/1227

భారత రాష్ట్రపతి తరపున, విజయవాడ డివిజన్‌లోని దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, పద్దెనిమిది సంవత్సరాలు పైబడిన భారతీయ పౌరులను మరియు కంపెనీలు/సంస్థలను IREPS యొక్క 'ఇ-వేలం లీజింగ్' మాడ్యూల్ ద్వారా ఇ-వేలం కోసం ఆహ్వానిస్తున్నారు: www.ireps.gov.in విజయవాడ డివిజన్‌పై ప్రకటనలు ఇతర ఎన్‌ఎఫ్ఆర్ మరియు పార్కింగ్ కాంట్రాక్టులను అప్పగించడానికి. ఇ-వేలం షెడ్యూల్ ఇక్కడ వివరించబడింది.

కాంట్రాక్ట్ విధానం	లాట్ల సంఖ్య వేలంలో ఆఫర్ చేయబడిన కాంట్రాక్ట్	వేలం షెడ్యూల్ తేది మరియు ప్రారంభ సమయం
పార్కింగ్	కైకలూరు రైల్వే స్టేషన్‌లో జనరల్ మరియు ప్రీమియం ద్విచక్ర వాహనాల పార్కింగ్ స్థలం (G2W మరియు P2W), తుని (G2W మరియు P2W), పెదన (G2W), మచిలీపట్నం (మిక్స్‌డ్ పార్కింగ్, G2W&G4W), రాయనపాడు (మిక్స్‌డ్ పార్కింగ్, G2W&G4W) విజయవాడ (తారాపేట మిక్స్‌డ్ పార్కింగ్. P2W, G2W&G4W),కాకినాడ టౌన్ (P2W), ఏలూరు (P2W), నరసాపూర్ (P2W)	13.10.2025 @ 11.00 గం.లు

పైన పేర్కొన్న ఇ-వేలం తేదీలలోని సమయ స్లాట్‌లు IREPS అప్లికేషన్‌లోని ఇ-వేలం లీజింగ్ మాడ్యూల్‌లో (www.ireps.gov.in) అందుబాటులో ఉన్నాయి. దయచేసి గమనించండి మరియు తదనుగుణంగా వేలంలో పాల్గొనండి.
A1549 — ఎస్ఆర్.డివిజనల్ కమర్షియల్ మేనేజర్, విజయవాడ

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) — ప్రాంతీయ కార్యాలయం : భీమవరం
2వ అంతస్తు, జె.పి. రోడ్డు, చిన్నమీరాం, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా-534204.

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద
REDEMPTION NOTICE

టు:
తేదీ: 22.09.2025, ప్రదేశం: భీమవరం. సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్.

MANAPPURAM HOME FINANCE LTD. — మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

డిమాండ్ ప్రకటన

...ఉన్నారు, మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి, IV/470ఎ (పాతది) వద్ద (కొత్తది) 638ఎ (కొత్తది) వద్ద మా రిజిస్టర్డ్ కార్యాలయాన్ని కలిగి ఉన్నారు,మణప్పురం హౌస్, వలపాడ్, త్రిస్సూర్, కేరళ-680567 మరియు భారతదేశంలోని వివిధ ప్రదేశాలలో శాఖలు (ఇకపై "MAHOFIN" అని పిలుస్తారు) కంపెనీల చట్టం, 1956 కింద నమోదు చేయబడిన కంపెనీ మరియు సెక్యూరిటైజేషన్ మరియు ఆర్థిక ఆస్తుల పునర్నిర్మాణం మరియు భద్రతా వడ్డీ చట్టం యొక్క సెక్షన్ 2లోని ఉప-విభాగం (1)లోని నిబంధన (m)లోని ఉప-నిబంధన (iv) అర్థంలో ఉన్న ఆర్థిక సంస్థ.
2002 (ఇకపై చట్టంగా సూచిస్తారు) డిసెంబర్ 18, 2015న ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ నెం. ఎస్.ఒ. 3466 (ఇ)తో చదవబడింది. భారత ప్రభుత్వం, ఆర్థిక సేవల విభాగం, ఆర్థిక మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ, ఇతరత్రా వ్యవహారాలను నిర్వహిస్తోంది. నివాస యూనిట్ల నిర్మాణం మరియు / లేదా కొనుగోలు కోసం రుణాలను ముందస్తుగా ఇచ్చే వ్యాపారాన్ని నిర్వహిస్తోంది మరియు క్రింద పేర్కొన్న చార్టులోని కాలమ్ నంబర్ 2 లో పేర్కొన్న విధంగా రుణగ్రహీత / సహ-రుణగ్రహీతలు MAHOFIN నుండి రుణం పొందారు మరియు MAHOFIN SARFAESI చట్టం కింద సెక్యూర్డ్ రుణదాతగా ఉండటంతో మరియు భద్రతా వడ్డీ యొక్క నియమం 2 తో చదవబడిన ఆ చట్టంలోని సెక్షన్ 13(2) కింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ (అమలు) నియమాలు 2002, ఇక్కడ పేర్కొన్న విధంగా రుణగ్రహీతలు / సహ-రుణగ్రహీతలు నోటీసు తేదీ నుండి 60 రోజులలోపు నోటీసులలో పేర్కొన్న మొత్తాన్ని మరింత వడ్డీతో తిరిగి చెల్లించాలని డిమాండ్ నోటీసు జారీ చేసింది, కానీ వివిధ కారణాల వల్ల వారిలో కొందరికి నోటీసులు అందజేయబడలేదు. ఆ రుణగ్రహీతల సమాచారం కోసం దానికి అదనంగా క్రింద పేర్కొనబడిన, ఆ రుణగ్రహీతలకు ఈ పబ్లిక్ నోటీసు ద్వారా తెలియజేయబడుతున్నాయి.

క్ర సం	రుణగ్రహీత/సహ-రుణగ్రహీతల పేరు/లాన్/శాఖ	సృష్టించబడిన వడ్డీ విషయంలో సెక్యూర్డ్ అస్సెట్ వివరణ	ఎన్‌పిఎ తేది	డిమాండ్ నోటీసు పంపిన తేది మరియు మొత్తం బకాయి
1	కొడాలి సమాధానం, కొడాలి కళ్యాణ్ కుమార్/ MHL00310039425/ విజయవాడ	ఆంధ్రప్రదేశ్-521001, కృష్ణా జిల్లా, మచిలీపట్నం జిల్లా రిజిస్ట్రీ, మచిలీపట్నం మండలం, ఎస్.ఎన్.గొల్లపాలెం గ్రామ పంచాయితీ ప్రాంతము, ఎస్.ఎన్.గొల్లపాలెం గ్రామం, ఆర్.ఎస్.నం 149, డోర్ నం 4/7, మూల్యాంకనం నం 581, విస్తీర్ణత 121 చ.గ.లు.తూర్పు-చీలి నాగరాజు ఇల్లు; పడమర-కొమ్ముకూరి చంద్రశేఖర్ ఇల్లు;దక్షిణం:-పంచాయితీ రోడ్డు; ఉత్తరం-కొడాలి సురేంద్ర కుమార్ ఇల్లు	10-09-2025	13-09-2025 & Rs.5,70,690/-
2	పల్లికొండ పద్మా రావు, దోనెపాటి చిన్నారి పల్లికొండ బాబురావు/ NHL00310028881/ విజయవాడ	ఆంధ్రప్రదేశ్-522111, బాపట్ల జిల్లా, బాపట్ల సబ్ రిజిస్ట్రీ, కర్లపాలెం మండలం, పెరలి గ్రామ పంచాయితీ ప్రాంతం, పెరలి గ్రామం, డోర్.నం 704/2, డోర్ నం 3-23, మూల్యాంకనం నం 33. విస్తీర్ణత 157.3 చ.గ.లు. తూర్పు-4 అడుగుల వెడల్పు జాయింట్ పాసేజ్, పడమర-గెరా దానియేలు ఆస్తి, దక్షిణం-పంచాయితీ రోడ్డు, ఉత్తరం-పల్లికొండ సాంబయ్య ఇల్లు	11-09-2025	13-09-2025 & Rs.5,01,043/-
3	లాం జోషి సునీతా, లాం నాగరాజు/ MHL00310023204/ విజయవాడ	ఆంధ్రప్రదేశ్-521185, ఎన్‌టిఆర్ జిల్లా, కంచికచర్ల సబ్ రిజిస్ట్రీ, వీర్లపాడు మండలం, జమ్మవరం గ్రామ పంచాయితీ ప్రాంతం, జమ్మవరం గ్రామం, ఆర్.ఎస్.నం 14-1సి, డోర్ నం 1-130, మూల్యాంకనం నం 238 విస్తీర్ణం 242 చ.గ.లు. తూర్పు-రామల రాము ఇల్లు, పడమర-పంచాయితీ సిమెంటు రోడ్డు, దక్షిణం-కొనకల మైకెల్ ఇల్లు, ఉత్తరం-వెలిసెల శేషగిరి రా ఇల్లు.	11-09-2025	13-09-2025 & Rs.5,19,456/-
4	కందుకూరి నాగమణి, కందుకూరి శ్రీనివాస రావు, కందుకూరి మల్లేశ్వరరావు/ MHL00310024581/ విజయవాడ	ఆంధ్రప్రదేశ్, పిన్: 521170, ఎన్‌టిఆర్ జిల్లా, నందిగామ సబ్ రిజిస్ట్రీ నందిగామ మండలం దాములూరు గ్రామ పంచాయితీ గ్రామం డోర్ నం.3-37, మూల్యాంకనం నం.337, ఆర్.ఎస్.నం.101, ఆర్‌సిసి దాబా ఇల్లు కలిగి ఉన్న రెసిడెన్షియల్ సైట్ పరిధి 217.8 చ.గ.లు. తూర్పు : సి సి రోడ్డు, పడమర : సిసి రోడ్డు, దక్షిణం : నందిగామ ప్రభుదాన్, ఉత్తరం : సి సి రోడ్డు.	11-09-2025	13-09-2025 & Rs.6,23,939/-

కాబట్టి, పైన పేర్కొన్న విధంగా రుణగ్రహీతలు / సహ-రుణగ్రహీతలకు నోటీసు ఇవ్వబడింది. ఈ నోటీసు ప్రచురించబడిన 60 రోజులలోపు, సంబంధిత రుణగ్రహీత /సహ-రుణగ్రహీతకు వ్యతిరేకంగా పైన చూపిన విధంగా మొత్తం బకాయి మొత్తాన్ని చెల్లించమని వారిని కోరుతోంది. సంబంధిత రుణగ్రహీత /సహ-రుణగ్రహీత, MAHOFIN ద్వారా తదుపరి వడ్డీతో సహా మొత్తం బకాయి మొత్తాన్ని చెల్లించడంలో విఫలమైతే, పైన వివరించిన విధంగా ఆస్తులపై భద్రతా వడ్డీ అమలు కోసం చట్టం మరియు ఇక్కడ రూపొందించబడిన నియమాల ప్రకారం సూచించబడిన ఇతర పద్ధతులలో నోటీసు అందించడానికి కూడా చర్యలు తీసుకోబడుతున్నాయి. SARFAESI యొక్క సెక్షన్ 13(8)లో వివరించిన విధంగా, బహిరంగ వేలం లేదా అమ్మకం ద్వారా బదిలీ కోసం ప్రైవేట్ ఒప్పందం కోసం నోటీసు ప్రచురించబడిన తేదీకి ముందు ఏ సమయంలోనైనా MAHOFIN ద్వారా చెల్లించాల్సిన మొత్తం మొత్తాన్ని ఖర్చులు, ఛార్జీలు మరియు ఖర్చులతో సహా చెల్లించిన తర్వాత పేర్కొన్న తనఖాను తిరిగి పొందవచ్చని మీకు తెలియజేయబడింది. SARFAESI చట్టంలోని ఎస్- 13 (13) ప్రకారం, మీరు సెక్యూర్డ్ ఆస్తులను ఏ విధంగానైనా బదిలీ చేయడం మరియు/లేదా వ్యవహరించడం నుండి నిరోధించబడ్డారని గమనించండి. అమ్మకం, లీజు లేదా మరే ఇతర పద్ధతిలోనైనా ఆస్తులను బదిలీ చేయడం మరియు/లేదా వ్యవహరించడం మీరు నిషేధించబడ్డారు.

తేది : 01.10.2025, ప్రదేశం : తూర్పు గోదావరి — సం/- అధికృత అధికారి-మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

GRIHUM — గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
(గతంలో పూనావాల హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పేరొనబడింది)
అనుబంధం IV (రూల్ 8(1) చూడండి) స్వాధీనత నోటీసు (స్థిరాస్తి కొరకు)

13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ దిగువ వివరించిన ఆస్తిని 25 సెప్టెంబరు, 2024న దిగువసంతకందారుడు స్వాధీనపరుచుకోవడమైనదని రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమైనది.
ప్రత్యేకంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా ఆస్తితో లావాదేవీలు జరుపరాదని మరియు ఆస్తితో ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారు మొత్తం మరియు దానిపిమ్మట వడ్డీని సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క చార్జ్‌కు లోబడి జరుపవలెను. సెక్యూర్డ్ అస్సెట్స్ విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) నిబంధనలు అహ్వానించడమైనదని రుణగ్రహీతలు శ్రద్ధ వహించవలెను. స్వాధీనత తీసుకున్న ఆస్థి వివరాలు దిగువన ఇవ్వబడినాయి:

క్ర. సం.	రుణగ్రహీతల పేరు	ఆస్తి వివరణ	స్వాధీనం తీసుకున్న తేది	డిమాండ్ నోటీసు చట్టబద్ధత తేది	డిమాండ్ నోటీసులో మొత్తం (రూ.)
1.	అన్నం శకుంతలా కుమారి, అన్నం రాధాశ్యామ్	గుంటూరు జిల్లా, మంగళగిరి సబ్ రిజిస్ట్రార్, తాడేపల్లి గ్రామం మరియు మున్సిపల్ ఏరియా వద్ద ఉన్న బేరింగ్ డో.నం.13-146, మున్సిపల్ వార్డు నం. 13వ బ్లాక్‌లో ఉన్న తాడేపల్లి సర్వే నం.71లో మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ రెసిడెన్షియల్ సైట్ పరిధి 96.8 చ.గ.లు. లేదా 80.93 చ.మీ.లు. తో కలిపి ఆర్‌సిసి డాబాతో పాటు సౌలభ్య హక్కులు. ఉన్న హద్దులు : తూర్పు : 15 అ.లు. వెడల్పు ఉమ్మడి మార్గం, దక్షిణం : యరబడి శ్రీనివాసరావు ఆస్తి, పడమర : వీరమాచినేని చంద్ర కిరణ్‌బాబు ఆస్తి, ఉత్తరం: రాచకొండ వరలక్ష్మి ఆస్తి.	25/09/2025	09/04/2025	Loan No. HL0005310000005004153 రూ.26,66,996/- (ఇరవై ఆరు లక్షల అరవై ఆరు వేల తొమ్మిది వందల తొంభై ఆరు రూపాయలు మాత్రమే) 09.04.2025 నాటికి చెల్లించవలసిన మొత్తంతో పాటు రియలైజేషన్ వరకు 12.6 శాతం పి.ఎ. వడ్డీ.

గమనిక : ఏదైనా సందర్భంలో స్థానిక భాషా ప్రచురణ మరియు ఆంగ్ల వార్తాపత్రిక ప్రచురణ యొక్క విషయాల మధ్య ఏదైనా తేడా ఉంటే, ఆంగ్ల భాష వార్తా పత్రిక బిజినెస్ స్టాండర్డ్‌లో ప్రచురించబడిన కంటెంట్ చెల్లుతుంది.

ప్రదేశం : గుంటూరు
తేది : 01.10.2025
సం/- అధీకృత అధికారి
గృహం హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో పూనావాల హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పిలువబడింది)

జీవన సౌరభం

అపజయాలు నిరాశాజనకాలు కాదు.. భవిష్యత్తులో ఏం చేయాలో తెలిపే పాఠాలు.

మీ కోసం

పులిహోర కోసం అన్నం వండేటప్పుడు అందులో ఒక చెంచా నూనె వేస్తే పొడిపొడిగా ఉంటుంది.

సహకారం

రామయ్యకు రెండెకరాల పొలంలో నీళ్ళు పుష్కలంగా ఉండటంతో పంటలు మార్చి, మార్చి వేసి మంచి లాభాలు గడించాడు. రామయ్య తోట ప్రక్కనే ఉన్న సోమయ్యకు ఇది నచ్చలేదు. రామయ్యపై అసూయ పెంచుకున్నాడు. అదను చూసి ఒకరోజు రామయ్య బోరులోకి రాళ్ళు వేశాడు. అది గమనించినా రామయ్య ఊరుకున్నాడు.

రామయ్య బోరుకు సమాంతరంగా సోమయ్య తన పొలంలో బోరు వేశాడు. అయితే ఎంత లోతు వేసినా నీళ్ళు పడలేదు. ఉన్న డబ్బంతా ఖర్చు పెట్టాడు. అయినా నీళ్లు పడలేదు. ఈలోపు, రామయ్య బోరుకు మరమ్మత్తులు చేసి యధావిధిగా పొలంలోకి నీళ్ళు పారించుకున్నాడు. చాలా రోజులుగా సోమయ్య బోరు ప్రయత్నాలు చూస్తున్న రామయ్య, సోమయ్య పొలంలో చెట్లు ఎండి పోవటం చూసి ఎంతో బాధపడ్డాడు.

సోమయ్య, దగ్గరకు వెళ్లి, 'పొలంలో చెట్లు ఎండిపోతున్నాయి. బోరులో నీళ్ల పడలేదు అనుకుంటా! నా బోరు నీళ్ల వాడుకో' అని చెప్పాడు. రామయ్యకి తను చెడు చేయాలని చూసినా తనకి మంచి చేశాడని సోమయ్య పశ్చాత్తాపం చెందాడు. 'రామయ్య నీ మేలు మరువలేను, నీ తోట నీళ్ళు లేకపోయుంటే నా కుటుంబం రోడ్డున పడేది. నీ బోరులో రాళ్ళు వేసింది నేనే అయినా నువ్వు నాకు సాయం చేశావు. నీ మంచితనానికి కృతజ్ఞతలు' అన్నాడు. దానికి రామయ్య 'సోమయ్య మనమిద్దరం రైతులం. చెట్లు ఎండిపోతుంటే చూస్తూ ఊరుకోలేం. అందుకే నా బోరులో రాళ్ళు వేసింది నువ్వే అని తెలిసినా నీకు సాయం చేశాను. ఇంకెప్పుడూ ఇలాంటి పనులు చేయకు. ఇద్దరం కలిసిమెలిసి ఉందాం' అన్నాడు. ఆ రోజు నుంచి ఒకరికొకరు సహకరించుకుని వారిద్దరూ మంచి లాభాలు గడించారు.

– కనుమ ఎల్లారెడ్డి,
తాడిపత్రి,
93915 23027.

తేడాలు గుర్తించండి

పిల్లలూ, ఇక్కడ ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు బొమ్మల్లో పది తేడాలు ఉన్నాయి. కనిపెట్టండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ

మొండెం లక్ష్మణరావు
4వ తరగతి,
ఎంపిపిఎస్,
వానపాముల
(హెచ్‌డబ్ల్యు),
పెదపారుపూడి
మండలం, కృష్ణాజిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

చర్మ వ్యాధులను అశ్రద్ధ చేయొద్దు

ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉంటే వ్యాధులు దూరమవుతాయి. ఆరోగ్యమే మహా భాగ్యమనే సూక్తిని నేడు ప్రతి ఒక్కరూ బలంగా నమ్మాలి. ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరంగా ఎలాంటి సమస్యలు వచ్చినా ప్రాథమిక స్థాయిలోనే నిర్లక్ష్యం చేయకుండా సొంత వైద్యం కాకుండా వైద్యులను సంప్రదిస్తే తీవ్రత తగ్గుతుంది. త్వరితగతిన వ్యాధి నిర్ధారణ చేసుకుని చికిత్స పొందడం ద్వారా వ్యాధి త్వరగా నయం చేసుకోవచ్చు కూడా. వ్యాధులను నిర్లక్ష్యం చేస్తే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రస్తుతం అడపా దడపా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఇప్పటికే సీజనల్ వ్యాధులు ముప్పేట దాడిచేస్తున్నాయి. చలివాతావరణం ఉన్న సమయాల్లో చర్మవ్యాధులు కూడా బాగా ఇబ్బందిపెట్టేస్తుంటాయి. అన్ని కాలాల్లోనూ ఇలాంటి సమస్యలు ఉత్పన్నమవుతూనే ఉంటాయి. సాధారణంగా ముఖం, మెడ, ఛాతీ, వీపుపై చర్మంపై బ్లాక్‌హెడ్స్, మొటిమలు వస్తుంటాయి. హార్మోన్లు, మందులు, పర్యావరణం, ఆహారపు అలవాట్లు, సౌందర్య సాధనాలు, వైద్య పరిస్థితులు, జన్యుపరమైన మార్పులు కూడా మొటిమలకు కారణాలు కావొచ్చు. వారసత్వంగా కూడా ఈ మొటిమలు వచ్చే అవకాశం ఎక్కువ. చిన్న కేసులను యాంటీ బాక్టీరియల్ ఫేస్ వాష్‌తో చికిత్స చేయొచ్చు. తీవ్రమైన కేసులకు కొన్ని బలమైన మందులు అవసరమవుతాయి. ఇవేకాకుండా ఎగ్జిమా, లాటెక్స్ అలర్జీ, తట్టు, అమ్మోరు, రింగ్‌వార్మ్, మెలస్మా, బేసల్ సెల్ కార్సినోమా, పొలుసుల కణ క్యాన్సర్, ఇంపెటిగో, గజ్జి, హైపర్ హైడ్రోసిస్, సెల్యులైటిస్ వంటి మరికొన్ని చర్మ సంబంధిత వ్యాధులు ఉన్నాయి. వీటిని కూడా త్వరగా గుర్తించి చికిత్సలు చేయించుకుంటే వేగంగా ఉపశమనం పొందొచ్చు. లేదంటే చర్మం మరింతగా డ్యామేజ్ అయ్యే అవకాశం ఉంటుంది.

ముఖ్యంగా శరీరంపై దద్దుర్లు తీసుకునే ఆహారాలు, నీరు, మందులు, చలి, అతినీలలోహిత కాంతి, చర్మంపై ఒత్తిడి, మొక్కలు, జంతువులు లేదా పలు రసాయనాలను తాకినప్పుడు కూడా కలుగుతాయి. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యంతోపాటు చర్మాన్ని కూడా రక్షించుకోవచ్చు.

దద్దుర్లు: దద్దుర్లు (అర్టికేరియా) ప్రపంచవ్యాప్తంగా చాలా మందిని ప్రభావితం చేస్తుంది. దద్దుర్లు చర్మంపై వాపు, దురద, చికాకును కలిగించడమే కాక చర్మంపై బొబ్బలు, పొక్కులకు కూడా కారణమవుతాయి. చాలా రకాల దద్దుర్లు కొన్ని రోజులు లేదా వారాల్లో వాటంతట అవే తగ్గిపోతాయి. అయితే కొన్ని సందర్భాల్లో దురద 6 వారాల కంటే ఎక్కువ రోజులు గనుక ఉంటే, అది దీర్ఘకాలిక దురదగా చెప్పుకోవచ్చు.

రోసేసియా : ఇది ముఖంపై ఎరుపు, దద్దుర్ల రూపంలో కనిపించే దీర్ఘకాలిక చర్మ సమస్య. ముఖ్యంగా ముక్కు, బుగ్గలు, నుదుటిపై ప్రభావం చూపుతుంది. ఇది వచ్చిందంటే త్వరగా తగ్గదు. వైద్యుల సూచనల మేరకు ప్రిస్క్రిప్షన్ క్రీములు, యాంటీబయాటిక్‌లు, ఇంటెన్స్ పల్సెడ్ లైట్ థెరపీ వంటి కొన్ని చికిత్సల ద్వారా తగ్గించుకునే ప్రయత్నం చేయొచ్చు.

సోరియాసిస్ : ఇది రోగనిరోధక వ్యవస్థ వికటించడం వల్ల వచ్చే ఒక రకమైన చర్మ సంబంధిత వ్యాధి. ఈ ఈ సమస్య వచ్చినప్పుడు చర్మంపై వెండి పొలుసుల మచ్చలు కనిపిస్తాయి. సాధారణంగా ఇది నెత్తి, మోచేతులు, మోకాళ్లపై వస్తుంది. దీని కారణంగా చర్మం మందంగా మారడం, తెలుపు, వాపు వంటి లక్షణాలు కనిపిస్తాయి. త్వరగా చికిత్సలు ప్రారంభిస్తే తగ్గుతాయి.

మెలనోమా : ఇది ఒక చర్మ సంబంధిత క్యాన్సర్. సాధారణంగా ఇది పుట్టు మచ్చల నుంచి పుడుతుంది. కొత్తగా పుట్టుమచ్చలు వస్తున్నా.. లేదా ఉన్న పుట్టుమచ్చల్లో ఏదైనా మార్పు గమనించినా.. వెంటనే అప్రమత్తమం కావాలి. క్యాన్సర్ అయితే ప్రారంభ దశలోనే గుర్తిస్తే డాక్టర్ దాన్ని తొలగిస్తారు.

కాంటాక్ట్ డెర్మటైటిస్ : పడని పదార్థాలు తిన్నప్పుడు ఈ చర్మ వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువ. ఏ పదార్థం తింటే అలర్జీ వస్తుందో తెలుసుకోవాలి. దానికి దూరంగా ఉండాలి.

గజ్జి: గజ్జి (స్కేబీస్) ఇది చిన్నగా ఉండే ఎనిమిది కాళ్ల మైట్ అనే పరాన్నజీవి వల్ల వస్తుంది. ఇది ఆహారం కోసం చర్మం పొరలోకి ప్రవేశించినప్పుడు వస్తుంది. తీవ్రమైన దురదను కలిగి ఉండడం దీని ప్రధాన లక్షణం. ఈ వ్యాధి చర్మం నుంచి చర్మానికి వ్యాప్తి చెందుతుంది.

మొటిమలు: చర్మ రంధ్రాలు మూసుకుపోవడం వల్ల మొటిమలు ఏర్పడతాయి. ముఖంపై తిత్తులు లేదా గుంతలు లాగా వచ్చి నల్లమచ్చలు లేదా తెల్ల మచ్చలుగా కనబడుతుంటాయి. అయితే కొంతమందికి ముఖంపై మొటిమల సమస్య తగ్గినప్పుడు మచ్చలు రావడం ప్రారంభమవుతాయి. మొటిమలు తగ్గిన తర్వాత కూడా చాలా మంది ఎక్కువ కాలం పిగ్మెంటేషన్ మచ్చలను కలిగి ఉంటారు.

బొల్లి: ప్రపంచవ్యాప్తంగా లక్షల మందిని ప్రభావితం చేస్తున్న చర్మ వ్యాధుల్లో బొల్లి కూడా ఒకటి. చర్మం రంగును కోల్పోయే ఒక రకమైన చర్మ వ్యాధి. ఈ వ్యాధి సోకితే చర్మం తన సహజ రంగును కోల్పోతుంది. ఇది శరీరంలో ఏ భాగంలోనైనా వచ్చే అవకాశం ఉంటుంది. ఈ మచ్చలు కాలక్రమేణా పెరుగుతాయి. బొల్లి అంటు వ్యాధి కాదు. స్కిన్‌పై సహజంగా ఉండే రంగు పోవడం, తెల్ల మచ్చలు ఏర్పడడాన్ని బొల్లి లేదా విటిలిగో అంటారు. ముఖ్యంగా మెలనన్ లేకపోవడం వల్ల ఈ వ్యాధి వస్తుంది. దీనికి ఎలాంటి నివారణా లేదు. సూర్యుని నుంచి చర్మాన్ని తగిన విధంగా రక్షించడం ద్వారా ఈ ప్రభావాన్ని చాలా వరకు తగ్గించొచ్చు.

తామర: తామర (రింగ్‌వార్మ్) అనేది డేర్మటోఫైట్ అని పిలువబడే ఒక రకమైన ఫంగస్ వల్ల వస్తుంది. ఇది దురద, ఎర్రబడిన చర్మ పొక్కులతో కూడిన ఒక సాధారణ చర్మ సమస్య. ఇది అనేక రకాలుగా ఉంటుంది.

మెలస్మా: మెలస్మా అనేది ఒక సాధారణ చర్మ వ్యాధి. ముఖంపై చర్మం యొక్క రంగు సహజ రంగులో కాకుండా ముదురు రంగులో మారే పరిస్థితి. ముఖంపై నల్ల మచ్చలాగా కనిపిస్తాయి. మెలస్మా ప్రధానంగా ముఖం మీద, బుగ్గలు, గడ్డం, నుదురు, ముక్కు, పై పెదవి పైన వస్తాయి. మెలస్మా కేసులు మహిళల్లో ఎక్కువగా కనిపిస్తాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలివే...

- సూర్యరశ్మిలో కొంత సమయం గడపాలి
- చర్మాన్ని ఎల్లప్పుడూ హైడ్రేటెడ్‌గా ఉంచాలి
- కాలుష్యం బారిన పడకుండ చూసుకోవాలి
- స్నాన సమయాన్ని తగినంతగా పరిమితం చేసుకోవాలి
- మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలి

ఇవి పాటించటం మేలు

- శరీరానికి సరిపడే ఆహారం మాత్రమే తీసుకోవాలి.
- జంక్‌పుడ్స్, డెయిరీ ప్రొడక్ట్సతో జాగ్రత్తగా ఉండాలి.
- ప్రతి రోజూ సరిపడినన్ని నీళ్లు తాగాలి
- బయటికి వెళ్లేటప్పుడు చర్మ రక్షణ చర్యలు తీసుకోవాలి
- చర్మంలో తేమ స్థాయిలు తగ్గకుండా చూసుకోవాలి
- మెడ భాగంలో, కళ్ల కింద మాయిశ్చరైజర్‌తో మృదువుగా మర్దన చేసుకోవచ్చు
- ముఖం కడుక్కునేటప్పుడు చేతులతో మరీ గట్టిగా రుద్దకూడదు.
- చర్మం పొడిబారిపోకుండా చూసుకోవాలి
- మచ్చలు, మొటిమలను గిల్లకూడదు. అందవిహీనంగా తయారవుతారు.

–డాక్టర్ జి.అర్చన మాధురి,
ఎండి, డివిఎల్,
ప్రముఖ చర్మవైద్య నిపుణురాలు,
కాస్మోలాలజిస్ట్,
డాక్టర్ అర్చన హాస్పిటల్స్
(స్కిన్ అండ్ కిడ్నీకేర్),
జగదంవారి వీధి,
సూర్యారావుపేట,
విజయవాడ.

పెద్ద కథానాయకుల చిత్రాల షూటింగ్ షురూ...

తెలుగు సినిమా పరిశ్రమలో పెద్ద కథానాయకుల సినిమాలు ఏడాదికి రెండో, మూడో ఉంటాయి. తమ అభిమాన కథానాయకుడి సినిమాల కోసం అభిమానులు కూడా ఎదురుచూస్తుంటారు. వరుసగా దసరా, దీపావళి, క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగలు వరుసగా వస్తుండటంతో కొత్త సినిమాల విడుదల తేదీలు కూడా ఒక్కొక్కటిగా ప్రకటిస్తున్నారు. దసరా బరిలో మిరాయ్, ఓజీ, కాంతార : చాప్టర్ 1 నిలిచాయి. నందమూరి బాలకృష్ణ నటించిన 'అఖండ' మూవీకి సీక్వెల్‌గా వస్తున్న 'అఖండ 2 : తాండవం' డిసెంబర్ 5న విడుదల కానుంది. ఆ తర్వాత సంక్రాంతి పండుగ బరిలో సినిమాలు విడుదల కానున్నాయి. కథానాయకుడు చిరంజీవి 'మన శంకరవరప్రసాద్ గారు'. 'పండగకి వస్తున్నారు' అన్నది ఈ మూవీ ట్యాగ్‌లైన్. ట్యాగ్‌లైన్ చూస్తే సంక్రాంతికి విడుదలయ్యే సినిమా అనేది చెప్పకుండానే తెలుస్తుంది. విడుదల తేదీ మాత్రం ఇంకా చిత్ర యూనిట్ ప్రకటించలేదు. మరోవైపు ప్రభాస్ 'ది రాజాసాబ్' జనవరి 9న విడుదల కానున్నట్లుగా ప్రకటించారు. యువ కథానాయకుడు నవీన్ పొలిశెట్టి 'అనగనగా ఒక రాజు'తో జనవరి 14న ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. ఇక మిగిలిన డేట్స్ 12, 13 మాత్రమే. ఈ రెండు రోజుల్లో ఏదో ఒక రోజు చిరంజీవి సినిమా రావాల్సింది. మరోవైపు రవితేజ కూడా సంక్రాంతి సమరానికి సై అంటున్నాడు. కిశోర్ తిరుమల దర్శకత్వంలో ఆయన నటిస్తున్న ఓ చిత్రం సంక్రాంతికి రిలీజ్ అవుతుందనే ఊహాగానాలు కూడా విన్పిస్తున్నాయి. జనవరి 13న రిలీజ్ డేట్ లాక్ చేసినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం జెట్‌స్పీడ్‌తో జరుగుతోన్న షూటింగ్ అక్టోబర్ నాటికి పూర్తవుతుందని, ఆ వెంటనే పోస్ట్ ప్రొడక్షన్ పనులు మొదలుపెట్టి సంక్రాంతికి రంగంలోకి దించేలా ప్లాన్ చేస్తున్నారని సమాచారం. చిరంజీవి సినిమా జనవరి 12వ తేదీ మాత్రమే అవకాశం ఉంది.

సరికొత్తగా 'గత వైభవ'

ఎస్ఎస్ దుశ్యంత్, అశికా రంగనాథ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఫాంటసీ డ్రామా 'గత వైభవ'. సింపుల్ సుని దర్శకత్వంలో సర్వెగర సిల్వర్ స్క్రీన్స్, సుని సినిమాస్ బ్యానర్స్‌పై దీపక్ తిమ్మప్ప, సుని నిర్మిస్తున్నారు. మేకర్స్ తాజాగా ఈ చిత్ర టీజర్‌ని రిలీజ్ చేశారు. సరికొత్త కథతో తెరకెక్కిన ఈ సినిమా ఖచ్చితంగా ప్రేక్షకులను అలరిస్తుందని నిర్మాతలు తెలిపారు. ఈ సినిమా నవంబర్ 14న విడుదల కానుంది. ఈ చిత్రానికి మ్యూజిక్ జూదా సాంధి, సినిమాటోగ్రఫీ విలియం జే డేవిడ్, ఎడిటర్ ఆశిక్ కుసుగొల్లి.

సర్‌ప్రైజ్ చేసే 'థామా'

ఆయుష్మాన్ ఖురానా, రష్మిక జోడీగా తెరకెక్కిన సినిమా 'థామా'. హర్రర్ కామెడీగా రూపొందిన ఈ సినిమాకి ఆదిత్యా సర్పోత్దార్ దర్శకత్వం వహించారు. పరేష్‌రావల్, నవాజుద్దీన్ సిద్ధిఖీ కీలక పాత్రలు పోషించారు. మాడాక్ ఫిల్మ్స్ సమర్పణలో దినేష్ విజన్, అమర్ కౌశిక్ నిర్మించారు. ఈ మూవీ అక్టోబర్ 21న విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో హీరో ఆయుష్మాన్ ఖురానా మాట్లాడుతూ, 'మాడాక్ ఫిల్మ్స్ హర్రర్ కామెడీ యూనివర్స్‌లో వస్తున్న నెక్స్ట్ చాప్టర్ 'థామా'. బేతాళ్‌కి హెడ్ థామా. రష్మికతో కలిసి నటించడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా కాన్సెప్ట్ ఆడియన్స్‌ని అలరిస్తుంది. ఫస్ట్ టైం యాక్షన్ చేశాను. ఇలాంటి క్యారెక్టర్ చేయడం నాకు చాలా కొత్తగా అనిపించింది' అని తెలిపారు. 'ఇందులో కథకు చాలా ప్రాధాన్యత ఉంటుంది. పర్ఫార్మెన్స్‌లు అమేజింగ్‌గా ఉంటాయి. ఈ యూనివర్స్‌కి ఆడియన్స్ నుంచి చాలా మంచి ఆదరణ ఉంది. ప్రతి సినిమాకి ఒక కొత్త క్యారెక్టర్ చేయాలని ప్రయత్నిస్తుంటాను. ఈ సినిమాతో కూడా ఆడియన్స్‌ని సర్‌ప్రైజ్ చేస్తానని భావిస్తున్నాను. ఈ సినిమా మిమ్మల్ని ఖచ్చితంగా ఎంటర్‌టైన్ చేస్తుందనే నమ్మకం ఉంది' అని హీరోయిన్ రష్మిక మందన్నా చెప్పారు.

శుక్రాచార్యుడిగా అక్షయ్‌ఖన్నా

'హనుమాన్' సినిమా తర్వాత దర్శకుడు ప్రశాంత్ వర్మ 'జై హనుమాన్'తో బిజీగా ఉన్నారు. ఇదే చిత్రంతో పాటు ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో అధీర, మహాకాళి మూవీస్ కూడా చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా మహాకాళి చిత్రం నుంచి ఒక అప్‌డేట్ ఇచ్చారు. శుక్రాచార్యుడిగా అక్షయ్‌ఖన్నా నటించనున్నట్లు అధికారికంగా ప్రకటిస్తూ ఒక పోస్టర్‌ను విడుదల చేశారు. మహాకాళి చిత్రానికి ప్రశాంత్‌వర్మ కథను అందించారు. దర్శకురాలు పూజ కొల్లూరు తెరకెక్కిస్తున్నారు. అక్షయ్ ఖన్నా తాజాగా వచ్చిన ఛావా సినిమాలో ఔరంగజేబు పాత్రలో నటించారు.

దీప్తి ఆల్‌రౌండ్ ప్రదర్శన

శ్రీలంకపై 59 పరుగుల తేడాతో టీమిండియా గెలుపు

ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్

గౌహతి: ఐసిసి మహిళల వన్డే ప్రపంచకప్‌లో భారత్ బోణీ కొట్టింది. గౌహతి వేదికగా శ్రీలంకతో మంగళవారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన్ 59 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఆల్‌రౌండర్ దీప్తి శర్మ అర్ధసెంచరీకి తోడు మూడు వికెట్లు పడగొట్టి టీమిండియా గెలుపులో కీలకపాత్ర పోషించిం ది. తొలుత అమన్‌జోత్ కౌర్ (57), దీప్తిలు అర్ధ శతకాలతో రాణించడంతో భారతజట్టు 47 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 259 పరుగుల భారీ స్కోర్ చేయగా.. స్నేహ్ రానా(2/32), తెలుగమ్మాయి శ్రీ చరణి(2/37)లు తిప్పేయగా శ్రీలంక మహిళలు 211కే ఆలౌటయ్యారు.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు శుభారంభం దక్కలేదు. స్టార్ ప్లేయర్ స్మృతి మంధాన(8) త్వరగా పెవీలియన్‌కు చేరింది. శ్రీలంక స్పిన్నర్ ఇనొకా రణవీర (4/46) విజృంభణతో ఒక దశలో124కే ఆరు వికెట్లు పడి ఆలౌట్ అంచున నిలిచిన టీమిండియా నిలిచింది. ఈ క్రమంలో అమన్‌జ్యోత్-దీప్తి కలిసి ఏడో వికెట్‌కు సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పి ఆదుకున్నారు. ఆఖరి బంతికి దీప్తి ఔట్ కాగా భారత్ 47 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 269 పరుగులు చేసింది. వర్షం అంతరాయాల నడుమ సాగిన వరల్డ్ కప్ ఆరంభ పోరులో భారత జట్టు భారీ స్కోర్ చేసింది. అలాగని ఫామ్‌లో ఉన్న ఓపెనర్ మంధాన (8), ప్రతీకా రావల్ (37) రాణించలేదు. అయినా సరే టీమిండియా ప్రత్యర్థి శ్రీలంకు 270 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగలిగిందంటే అందుకు కారణం అమన్‌జోత్ కౌర్ (57), దీప్తి శర్మ(53). ఈ ఇద్దరి అద్భుత పోరాటంతో పుంజుకుంది టీమిండియా. మంధాన ఔటయ్యాక ప్రతీకతో కలిసి ఇన్నింగ్స్ నిర్మించింది హర్లీన్ డియోల్ (48). అర్ధ శతకానికి చేరువైన ఆమెను ఔట్ చేసిన ఇనొకా రణవీర తర్వాతి బంతికే జెమీమా రోడ్రిగ్స్ (0) ను క్లీన్ బౌల్డ్ చేసింది. దాంతో.. హ్యాట్రిక్‌పై నిలిచింది. కానీ, దీప్తి శర్మ(53) వికెట్‌ను కాపాడుకుంది. కానీ, సింగిల్ రాగా క్రీజులోకి వచ్చిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (21) కట్ షాట్ ఆడబోయి వికెట్ కీపర్ సంజీవని చేతికి చిక్కింది. దాంతో.. 120-3తో పటిష్ఠంగా ఉన్న టీమిండియా 124-5 కు చేరింది. ఆ మరసటి ఓవర్లో రీచా ఘోష్(2) సైతం డియోల్ మాదిరిగానే కవర్స్‌లో ఆడబోయి చేతికి క్యాచ్ ఇచ్చింది. అంతే.. చూస్తుండగానే ఆరు వికెట్లు పడ్డాయి.

సెంచరీ భాగస్వామ్యంతో..

టెయిలెండర్లతో కలిసి దీప్తి శర్మ జట్టుకు పోరాడగలిగే స్కోర్ అందించే బాధ్యత తీసుకుంది. ఆమెకు అమన్‌జోత్ కౌర్ (57) అండగా నిలవడమే కాదు భారీ షాట్లతో లంక బౌలర్ల లయను దెబ్బతీసింది. కవిష ఓవర్లో సిక్సర్‌తో జట్టు స్కోర్ 170 దాటించింది. వీలుచిక్కినప్పుడల్లా బౌడరీలు బాదుతూ.. వీరిద్దరూ 78 బంతుల్లో 86 పరుగుల జోడించారు. దాంతో, భారత్ మరోసారి వర్షం అంతరాయం కలిగించే సమయానికి 40 ఓవర్లకు 210 రన్స్ చేయగలిగింది. బౌండరీ లైన్ వద్ద డైవ్ చేస్తూ క్యాచ్ అందుకోవడంతో సెంచరీ (103) భాగస్వామ్యానికి తెరపడింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దీప్తి శర్మకు లభించింది. అక్టోబర్ 5న జరిగే రెండో లీగ్ మ్యాచ్‌లో పాకిస్తాన్ మహిళలతో కొలంబోలో తలపడనున్నారు.

వర్షం అంతరాయం

మహిళల వన్డే వరల్డ్ కప్ తొలి మ్యాచ్‌కు వరుణుడు ఆటంకం కలిగించాడు. తొలుత టీమిండియా 10 ఓవర్లలో వికెట్ నష్టానికి43 పరుగులు చేసింది. వీరిద్దరూ జోరు పెంచుదామనేలోపే వర్షం కురవడం మొదలైంది. దాంతో, సిబ్బంది పరుగున వచ్చి పిచ్‌ను ప్లాస్టిక్ కవర్లతో కప్పివేశారు. ఆ తర్వాత వర్షం తగ్గడంతో దాదాపు గంట విరామం తర్వాత తిరిగి మ్యాచ్ 5.00గం॥లకు ప్రారంభమైంది. దీంతో మ్యాచ్‌ను అంపైర్లు 48 ఓవర్లకు కుదించారు. అనంతరం 40ఓవర్లు మ్యాచ్ ముగిసాక మళ్లీ వర్షం కురిసింది. ఆ సమయానికి భారతజట్టు 6వికెట్ల నష్టానికి 210 పరుగులు చేసింది. అమన్‌జ్యోత్(50), దీప్తి(37) క్రీజ్‌లో ఉన్నారు.

ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా మహిళలు × న్యూజిలాండ్ మహిళలు
(వేదిక: ఇండోర్; సమయం: మ.3.00గం॥లకు)

స్కోర్‌బోర్డు...

ఇండియా మహిళల ఇన్నింగ్స్: ప్రతికా రావల్ (సి)గుణరత్నే (బి)రణవీర 37, మంధాన (సి)గుణరత్నే (బి)ప్రబోధిని 8, హర్లిన్ డియోల్ (సి)దిల్హారి (బి)రణవీర 48, హర్మన్‌ప్రీత్ (సి)సంజీవని (బి)రణవీర 21, రోడ్రిగ్స్ (బి)రణవీర 0, దీప్తి శర్మ (సి)సుగంధిక (బి)కులసూరియ 53, రీచా ఘోష్ (సి)ప్రబోధని (బి)ఆటపట్టు 2, అమన్‌జ్యోత్ కౌర్ (సి)గుణరత్నే (బి)ఉద్దేశిక 57, స్నేహ్ రాణా (నాటౌట్) 28, అదనం 15. (47 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 269పరుగులు. **వికెట్ల పతనం:** 1/14, 2/81, 3/120, 4/120, 5/121, 6/124, 7/227, 8/269 **బౌలింగ్:** కులసూరియ 8-0-42-1, ప్రబోధిని 10-1-55-2, సుగంధిక 9-0-46-0, కవిషా ధిహరి 8-0-51-0, ఇనోకా రణవీర 9-0-46-4, ఆటపట్టు 3-0-24-1.

శ్రీలంక మహిళల ఇన్నింగ్స్: హాసిని పెరీరా (బి)క్రాంతి గాడ్ 14, ఆటపట్టు (బి)దీప్తి శర్మ 43, హర్షిత (ఎల్‌బి)శ్రీచరణి 29, గుణరత్నే (ఎల్‌బి)అమన్‌జ్యోత్ కౌర్ 11, దిహారి (సి)రిచా (బి)దీప్తి 15, నీలాక్షి (బి)స్నేహ్ రాణా 35, అనుష్క సంజీవని (సి)హర్మన్‌ప్రీత్ (బి)దీప్తి శర్మ 6, సుగంధిక (బి)స్నేహ్ రాణా 10, అఛిని కులసూరియ (సి)మంధాన (బి)శ్రీచరణి 17, ప్రబోధిని (నాటౌట్) 14, ఇనోకా రణవీరా (ఎల్‌బి)ప్రతిక రావల్ 3, అదనం 14. (45.4ఓవర్లలో ఆలౌట్) 211 పరుగులు. **వికెట్ల పతనం:** 1/30, 2/82, 3/103, 4/105, 5/130, 6/140, 7/173, 8/184, 9/199, 10/211 **బౌలింగ్:** క్రాంతి గాడ్ 9-0-41-1, అమన్‌జ్యోత్ కౌర్ 6-0-37-1, స్నేహ్ రాణా 10-0-32-2, దీప్తి శర్మ 10-1-54-3, శ్రీచరణి 8-0-37-2, ప్రతిక రావల్ 2.4-0-6-1.

టెస్టు సవాల్‌కు సై

గిల్ సేన సాధన షురూ

అహ్మదాబాద్ : వెస్టిండీస్‌తో 2 మ్యాచుల టెస్టు సిరీస్‌కు టీమ్ ఇండియా సై అంటోంది. ఆసియా కప్ విజయంతో సోమవారం స్వదేశానికి చేరుకున్న భారత క్రికెటర్లు నేరుగా తొలి టెస్టు వేదిక అహ్మదాబాద్‌కు చేరుకున్నారు. జస్‌ప్రీత్ బుమ్రా, కుల్‌దీప్ యాదవ్, అక్షర్ పటేల్‌లు విశ్రాంతి తీసుకోగా.. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, సాయి సుదర్శన్, ప్రసిద్ కృష్ణ, ధ్రువ్ జురెల్, కెఎల్ రాహుల్, మహ్మద్ సిరాజ్, యశస్వి జైస్వాల్‌లు మంగళవారం ప్రాక్టీస్ సెషన్లో చెమటోడ్చారు. చీఫ్ కోచ్ గౌతం గంభీర్‌తో కలిసి శుభ్‌మన్ గిల్ తొలుత పిచ్‌ను పరిశీలించాడు. ఆటగాళ్ల సుమారు మూడు గంటల పాటు ప్రాక్టీస్ సెషన్లో సాధన చేశారు. భారత్, వెస్టిండీస్ తొలి టెస్టు రేపటి నుంచి అహ్మదాబాద్‌లో ఆరంభం కానుంది. తెలుగు క్రికెటర్లు నితీశ్ కుమార్ రెడ్డి, మహ్మద్ సిరాజ్‌లు రెండు మ్యాచుల్లోనూ తుది జట్టులో నిలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

టైటాన్స్ హ్యాట్రిక్ విక్టరీ

చెన్నై : ప్రో కబడ్డీ లీగ్ 12వ సీజన్‌లో తెలుగు టైటాన్స్ మళ్లీ హ్యాట్రిక్ విజయం సాధించింది. మంగళవారం చెన్నైలో జరిగిన మ్యాచ్‌లో 37-28 తేడాతో పట్నా పైరేట్స్‌ను తెలుగు టైటాన్స్ చిత్తు చేసింది. కెప్టెన్ విజయ్ మాలిక్ (13 పాయింట్లు), ఆల్‌రౌండర్ భరత్ 8 పాయింట్లతో రాణించాడు. పట్నా రెయిడర్లు అయాన్ (13 పాయింట్లు), సుధాకర్ (5) మెరిశారు. పీకెఎల్12లో 11 మ్యాచ్‌ల్లో ఆరో విజయం సాధించిన టైటాన్స్ 12 పాయింట్లతో టేబుల్‌లో మూడో స్థానానికి ఎగబాకింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68